సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 243
శుక్రవారం 17-5-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై

వచ్చే నెలలో భారత్ తరఫున చివరి మ్యాచ్ ఆడనున్న కెప్టెన్ సునీల్ ఛెత్రి - 13లో



జోహో సెమీ కండక్టర్స్

700 మిలియన్ డాలర్ల పెట్టుబడి యోచనలో సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ - 13లో



అల్లర్లకు విపక్షాల కుట్ర

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



గోవధను అడ్డుకుంటాం

'అధికారంలోకి రాగానే మేం ఎట్టి పరిస్థితుల్లోనూ గోవధను అనుమతించం' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

వివరాలు 6లో ▸



రిజర్వేషన్ల రద్దుకు పన్నాగం

ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ చూస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



యుద్ధానికి రాజకీయ పరిష్కారం

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చైనా అధినేత జిన్ పింగ్ భేటీ అయ్యారు. ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం కనుగొంటామని జిన్‌పింగ్ అన్నారు.

వివరాలు 6లో ▸

మళ్లీ చరిత్ర సృష్టిస్తున్నాం

పోలింగ్ సరళిపై తొలిసారిగా స్పందించిన సీఎం వైఎస్ జగన్

2019కి మించి 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

- జూన్ 4న ఘన విజయంతో దేశం మొత్తం మన వైపే చూస్తుంది
- 59 నెలలుగా ప్రజలకు మంచి చేశాం.. వచ్చే ఐదేళ్లు మరింత మేలు చేద్దాం
- విజయవాడలో ఐ-ప్యాక్ ప్రతినిధులతో సమావేశం



విజయవాడలో ఐ-ప్యాక్ ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి, ఫలితాల అంచనాపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా స్పందించారు. మరోసారి చరిత్ర సృష్టించబోతున్నామని, మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పొలిటికల్ కన్సల్టెన్సీగా పని చేసిన ఐ-ప్యాక్ (ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ) కార్యాలయాన్ని సీఎం జగన్ గురువారం సందర్శించారు. విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలో ఉన్న ఐ - ప్యాక్ కార్యాలయానికి వచ్చిన ఆయన సుమారు అరగంట సేపు గడిపారు. ఐ-ప్యాక్ ప్రతినిధులను అభినందించి

మిగతా 2వ పేజీలో ▶

డీబీటీ పథకాల చెల్లింపులు ప్రారంభం

5 లో

- వైఎస్సార్ ఆసరాకు రూ.1,480 కోట్లు విడుదల
- జగనన్న విద్యా దీవెనకు రూ.502 కోట్లు చెల్లింపు
- పోలింగ్‌కు ముందు నిధుల పంపిణీని అడ్డుకున్న బాబు బ్యాచ్
- పోలింగ్ అయ్యే వరకు నిధులు విడుదల చేయొద్దని ఈసీ ఆదేశం
- పేదలకు మేలు చేయడానికి హైకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం
- ఒకరోజు వెసులుబాటు ఇచ్చిన హైకోర్టు.. బేఖాతరు చేసిన ఈసీ
- పోలింగ్ ముగియడంతో పేదలకు నిధులు చెల్లిస్తున్న సర్కారు

పల్నాడు, అనంత ఎస్పీలపై వేటు

- వారిద్దరూ సస్పెన్షన్.. ఎన్నికల అనంతర ఘర్షణలపై ఈసీ చర్యలు.. 'సిట్' ఏర్పాటు.. 2 రోజుల్లో నివేదిక!
- పల్నాడు కలెక్టర్, తిరుపతి ఎస్పీ బదిలీ
- 3 జిల్లాల్లో మరో 12 మంది పోలీస్ అధికారుల సస్పెన్షన్
- కౌంటింగ్ తర్వాత 15 రోజులు ఏపీలో 25 కంపెనీల పారా మిలటరీ బలగాలు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరు ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం
- ఏపీలో పరిస్థితిపై సీఎస్, డీజీపీతో చర్చించిన సీఈసీ

2లో



పల్నాడు ఎస్పీ బిందు మాధవ్



అనంతపురం ఎస్పీ అమిత్ బర్దర్



పల్నాడు కలెక్టర్ శివ శంకర్



తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

టీడీపీ చెప్పినట్లు ఆడినందుకే



- ప్రజాస్వామ్య ప్రక్రియకు పాతరేసిన ఫలితం.. విధి నిర్వహణలో అలసత్వమే ఈసీ వేటుకు కారణం
- రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్ అధికారుల బదిలీ.. పురందేశ్వరి జాబితా ప్రకారం నియామకాలు
- ఆ ప్రాంతాల్లోనే హింసాత్మక ఘటనలు

2 లో

ప్లే ఆఫ్స్‌కు సన్‌రైజర్స్..

- గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ రద్దు
- 15 పాయింట్లతో మూడో స్థానంలో హైదరాబాద్ జట్టు

13లో

చంద్రబాబు ప్రోద్బలంతోనే దాడులు..

గవర్నర్ నజీర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు

- పక్షపాతంగా వ్యవహరించిన ఎన్నికల అబ్జర్వర్ దీపక్ మిశ్రా
- టీడీపీ ఫిర్యాదులపై ఏకపక్షంగా చర్యలు.. మిశ్రాపై న్యాయ విచారణ చేయాలి : మంత్రి బొత్స
- కొందరు అధికారులు టీడీపీకి కొమ్ము కాశారు : మంత్రి మేరుగు
- కౌంటింగ్ సజావుగా సాగాలంటే మిశ్రాను మార్చాలి : ఎంపీ మోపిదేవి
- జిల్లా ఎస్పీలను బెదిరిస్తున్నారు: మాజీ మంత్రి పేర్నినాని

2 లో



రాజ్ భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు తదితరులు

గోపిరెడ్డి హత్యకు చదలవాడ కుట్ర..!

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హత్యకు వ్యూహం



చదలవాడ



గోపిరెడ్డి



టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లో స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు ఇల్లు కేంద్రంగా కుట్ర
- గోపిరెడ్డి దొరక్కపోవడంతో ఆయన మామపై హత్యాయత్నం
- అనంతరం అరవింద బాబు హౌస్ అరెస్ట్
- పోలీసుల తనిఖీలో మారణాయుధాలు, పెట్రోల్ బాంబులు లభ్యం.. పోలింగ్‌కు ముందే పథకం ప్రకారం సమకూర్చుకున్న వైనం
- మారణాయుధాలకు సంబంధించి కేసు నమోదు చేయని పోలీసులు.. పల్నాడులో హత్యా రాజకీయాలనే నమ్ముకున్న టీడీపీ

5 లో

ఇదంజగత్



పాలన బాగుంటేే పోలింగ్ పెరుగుతుంది

ఇది రాజకీయ విశ్లేషకుల మాట.. మాట నెరవేర్చిన ప్రభుత్వాలను మళ్లీ ఎన్నుకుంటారు..

- పోలింగ్ శాతం పెరగడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమనే ప్రచారం అవాస్తవం
- 2004లో 69.8 శాతం పోలింగ్‌తో వైఎస్సార్‌కు అధికార పగ్గాలు.. 2009లో 72.7% పోలింగ్‌తో మళ్లీ సీఎంగా వైఎస్సార్
- తెలంగాణలో 2014లో 69.5 శాతం పోలింగ్‌తో అధికారంలోకి టీఆర్ఎస్
- 2018లో 73.2 శాతం పోలింగ్‌తో మరోసారి సీఎంగా కేసీఆర్
- ఇప్పుడు ఏపీలోనూ అదే ట్రెండ్.. మరిన్ని సీట్లతో సీఎంగా మళ్లీ వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: పరిపాలన నచ్చితే ప్రజలు తమ మద్దతు ఓట్ల రూపంలో చూపిస్తారని, అందుకు అనుగుణంగానే పోలింగ్ శాతం పెరుగుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్‌కు, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కేసీఆర్‌కు ప్రజలు వరుసగా రెండుసార్లు అధికారం కట్టబెట్టటాన్ని ఇందుకు నిదర్శనంగా ఉదహరిస్తున్నారు. ఇప్పుడు ఏపీలోనూ అదే ట్రెండ్ కనిపిస్తోందని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్ ప్రభుత్వానికి మరోసారి పట్టం గట్టడం ఖాయమని, అందుకనే పోలింగ్ శాతం పెరిగిందని విశ్లేషిస్తున్నారు. పోలింగ్ శాతం పెరగడం ప్రభుత్వంపై వ్యతిరేకతను సూచిస్తోందనే ప్రచారంలో నిజం లేదని సీనియర్ రాజకీయ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. ప్రజలకు

మిగతా 14వ పేజీలో ▶



విత్తనాలు రెడీ

- ఖరీఫ్ కోసం సబ్సిడీపై 6.19 లక్షల క్వింటాళ్ల విత్తనాలు
- పంపిణీకి అనుమతి ఇచ్చిన ఎన్నికల కమిషన్
- ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టిన వ్యవసాయ శాఖ
- రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

14 లో

45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి

విశాఖ పోర్టు రికార్డు

సాక్షి, విశాఖపట్నం: సరుకు హ్యాండ్లింగ్‌లో మేజర్ పోర్టులతో పోటీ పడుతూ నంబర్ వన్ దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో మైలురాయిని అధిగమించింది. కేవలం 45 రోజుల్లోనే 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి, దిగుమతులు నిర్వహించి రికార్డు సృష్టించింది. 2024-25లో శరవేగంగా సరుకు హ్యాండ్లింగ్ నిర్వహణ కొనసాగుతోందని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 90 ఎంఎంటీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. 2023-24లో 10 ఎంఎంటీకి 47 రోజులు పట్టగా.. ఈసారి రెండు రోజుల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నట్లు చైర్మన్ వివరించారు.



వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లపై టీజీ

కేంద్ర ప్రభుత్వ గెజిట్ జారీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లపై రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఇకపై తెలంగాణలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లపై టీఎస్ స్థానంలో



టీజీ కోడ్ ఉండేలా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రకారం వాహనాల రిజిస్ట్రేషన్ సీరియల్ నంబర్ 29-ఏ, టీఎస్ కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తు టీజీగా సవరిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

బాలకృష్ణ సీనూ రివర్సే!

- రూ.30 కోట్లు పంచిన బాలకృష్ణ
- ఓటుకు నోటు లెక్కగట్టి పందేరం... డబ్బు పంపిణీ సరిగా కాలేదని అనుమానం

హిందూపురం అర్బన్: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనుకున్న టీడీపీ నేతలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేశారు. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఊరూరా విందులు ఇచ్చారు. ఆ తర్వాత ఓటుకు ఇంత అని లెక్కగట్టి ఆయా మండలాలకు డబ్బు పంపారు. ఇన్ని తంటాలు పడినా... పోలింగ్ రోజున అంతా తారుమారైనట్లు తెలుస్తోంది. ఇలా దెబ్బతిన్న వారిలో నందమూరి బాలకృష్ణ ఉన్నట్లు తెలుస్తోంది. పోలింగ్ ముందురోజు అంటే 12న రాత్రి ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాలని బాలకృష్ణ టీడీపీ నేతలకు డబ్బులు అప్పగించారు. పోలింగ్ సరళిని చూసి ఇప్పుడు లెక్కలు వేస్తున్నారు. ఓటర్లకు డబ్బు పంపిణీ సక్రమంగా జరగలేదని, టీడీపీ నేతలు డబ్బు మింగేసినట్లు భావిస్తున్నారు. దీనిపై తమ్ముళ్ల మధ్యే వాగ్వాదాలు జరిగాయి. అసలు హిందూపురానికి తెచ్చిన డబ్బెంత.. పంపిణీ చేసిందెంత?..ఎవరి కనుసన్నల్లో డబ్బు పంపిణీ జరిగింది? లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు ఎంత మొత్తం చేరింది? ఎక్కడ పంపిణీ చేయలేదు?మిగిలిన మొత్తం ఎవరి వద్ద ఉందన్న దానిపై బాలకృష్ణ పీఏ ఆరా తీస్తున్నారు. చిలమత్తూరు మండలంలోని గ్రామాల్లోని ముఖ్య నేతలకు టీడీపీ నేతలు పెద్ద మొత్తంలో నగదు ఇచ్చి పంపిణీ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో మండల కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో డబ్బు పంపిణీ జరగలేదు. దీంతో అక్కడ పంపిణీ చేయని రూ.20 లక్షలు వెనక్కి పంపాలని గుంటూరు నుంచి వచ్చిన బాలకృష్ణ పీఏ నాయకులకు హుకుం జారీ చేశారు. ''పార్టీ కోసం కష్టపడి గ్రామాలన్నీ తిరిగాం. ఓటర్లకు డబ్బును బాలకృష్ణ మనుషులే పంచారు. ఇప్పుడేమో ప్రతి రూపాయికి మమ్మల్ని లెక్క అడుగుతున్నారు..ఎన్నికలు అయిపోతే అంతేనా''...అంటూ టీడీపీ ముఖ్యనేతలు నిట్టూరుస్తున్నారు.

టీడీపీ చెప్పినట్లు ఆడినందుకే

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య ప్రక్రియను పరిరక్షించాల్సిన పోలీసు యంత్రాంగం, ఉన్నతాధికారులు బాధ్యత మరచి హింస చెలరేగేందుకు తావిచ్చినందుకు వేటు పడింది! నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన వారు రాజకీయ ఒత్తిళ్లతో చెప్పినట్లలా ఆడినందుకే ఈ పరిస్థితి వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుట్రలకు తలొగ్గి పచ్చ ముఠాల విధ్వంసకాండకు కొమ్ముకాసిన పోలీసు అధికారులపై ఎన్నికల కమిషన్ (ఈసీ) కన్నెర్ర చేసింది. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసు అధికారులను హఠాత్తుగా బదిలీ చేసిన జిల్లాల్లోనే హింసాకాండ చెలరేగిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ, రాష్ట్ర ప్రభుత్వం సవివరంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని అధికారులను నియమించడంతో ఎన్నికల వేళ హింస చెలరేగేందుకు ఆస్కారం ఏర్పడింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో ఈసీ నియమించిన పోలీసు అధికారులు తోలుబొమ్మల్లా వ్యవహరించడంతో టీడీపీ రౌడీ మూకలు బరి తెగించి భయానక వాతావరణాన్ని సృష్టించాయి.



లావు సన్నిహితుడు.. బిందు మాధవ్

ప్రజాదరణ కోల్పోవడంతో పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో అక్రమాలు, హింసకు చంద్రబాబు తెర తీశారు. ఆ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పట్టున్న సమర్థులైన పోలీసు అధికారులు ఉండటం చంద్రబాబుకు ఇబ్బందికరంగా మారింది. దీంతో వారిపై నిరాధార ఆరోపణలతో ఈసీకి ఫిర్యాదులు చేశారు. దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా ఈ కుట్రలను అమలు చేశారు. పల్నాడు నుంచి అనంతపురం జిల్లా వరకు పోలీసు అధికారులను బదిలీ చేయాలని పేర్కొంటూ ఆ స్థానాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ ఏకంగా జాబితాను సమర్పించారు. ఈ ఒత్తిడికి తలొగ్గిన ఈసీ హడావుడిగా డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, నిఘా విభాగం ఇన్‌చార్జ్ పీఎస్‌ఆర్ ఆంజనేయులతోపాటు గుంటూరు డీఐజీ పాలరాజు, అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిని బదిలీ చేసింది. సమస్యాత్మక నియోజకవర్గాలు అత్యధికంగా ఉన్న పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం ఎస్పీలు, విజయవాడ సీపీని బదిలీ చేసింది. క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు కలిపి 14 మందిని బదిలీ చేయడం గమనార్హం. చంద్రబాబు ఆదేశాలతో పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని పోలీసు అధికారులకు ఆ స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. సమస్యాత్మక పల్నాడు జిల్లా ఎస్పీగా గరికిపాటి బిందు మాధవ్‌ను నియమించారు. ఆయన టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. అదే రీతిలో పురందేశ్వరి సూచించిన వారినే తిరుపతి, అనంతపురం జిల్లాల్లో నియమించారు.

పూర్తిగా విఫలమైన ఈసీ నియమించిన అధికారులు

క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన, పట్టులేని అధికారులను నియమించడంతో పోలింగ్ సందర్భంగా, అనంతరం టీడీపీ రౌడీ మూకలు చెలరేగిపోయాయి. యథేచ్ఛగా విధ్వంసకాండ సృష్టించాయి. నరసరావుపేట, గురజాల, మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రి నియోజకవర్గాల్లో స్వైర విహారం చేశాయి. పెట్రోల్ బాంబులతో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ జిల్లాల్లో ఈసీ నియమించిన పోలీసు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యారు. టీడీపీ మూకలు విధ్వంసం సృష్టిస్తుంటే పల్నాడు ఎస్పీ గరికిపాటి బిందు మాధవ్‌తోపాటు ఆయన ఆధ్వర్యంలోని డీఎస్పీలు, సీఐలు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌లపై టీడీపీ రౌడీ మూకలు దాడులకు తెగబడి బాంబులు విసిరినా సరే పోలీసులు పత్తా లేరు. తమపై దాడులు జరుగుతున్నాయని పల్నాడు ఎస్పీకి మొర పెట్టుకున్నా కనీస స్పందన లేదు. పోలింగ్ సక్రమంగా నిర్వహించడంలో పల్నాడు కలెక్టర్ లోతేటి శివ శంకర్ పూర్తిగా విఫలమయ్యారు. అనంతపురం జిల్లాల్లో శాంతిభద్రతల పరిస్థితి ఘోరంగా దిగజారినా జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ బోద్యం చూస్తూ ఉండిపోయారు. కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ వాహనంలో రూ.2 కోట్లు లభ్యమైతే కేసు నమోదు చేయకుండా తాత్సారం చేశారు. పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు, టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, అల్లుడు దీపక్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లో చొరబడి అక్రమాలకు తెగించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంపై టీడీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. ఎస్పీ అమిత్ బర్దర్ వీటిని కట్టడి చేయలేకపోయారు. ఏకంగా పోలీసులే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంలోకి దూరి విధ్వంసం సృష్టించడం నివ్వెరపరిచింది. చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై టీడీపీ గుండాలు దాడి చేశారు. ఆయన వాహన శ్రేణిలోని వాహనానికి నిప్పుపెట్టారు. తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ అల్లరి మూకలను కట్టడి చేయడంలో విఫలమయ్యారు.

ఏఎస్పీ వల్లే తాడిపత్రిలో అల్లర్లు

టీడీపీకి వెన్నుదన్నుగా నిలిచిన వైనం

తాడిపత్రి రూరల్: అడిషనల్ ఎస్పీ రామకృష్ణ తీరే తాడిపత్రిలో విధ్వంసానికి కారణమైందని పట్టణంలో చర్చ జరుగుతోంది. టీడీపీకి దన్నుగా నిలిచి ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తించారని స్పష్టమవుతోంది. అనంతపురంలో 'సెబ్' అడిషనల్ ఎస్పీగా ఉన్న రామకృష్ణను పథకం ప్రకారమే అధికారులు తాడిపత్రి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీకి చెందిన జేసీ ప్రభాకర్‌రెడ్డికి పోలింగ్ కేంద్రాలను పరిశీలించే అనుమతి లేదని, ఆయన రాకతో అల్లర్లు చెలరేగి శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని ఎన్నికల అధికారులు చెప్పినా, ఏఎస్పీ పెడచెవిన పెట్టారు. పైగా జేసీ ప్రభాకర్‌రెడ్డి వెంట ఉంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై చిందులు తొక్కారు. పోలింగ్ రోజు ఓంశాంతి నగర్‌లో జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి దిగారు. ఆ సమయంలో జేసీ, అతని అనుచరులను అదుపులోకి తీసుకొని ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఏఎస్పీ తమకు అండగా ఉన్నాడన్న ధైర్యంతోనే జేసీ వర్గీయులు అరాచకం సృష్టించారు. ఈ విషయమై ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఈసీ, డీజీపీలకు ఫిర్యాదు చేయగానే.. ఏఎస్పీ పోలీసు సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి తలుపులు పగులగొట్టి పర్నీచర్, కంప్యూటర్లు ధ్వంసం చేయించడం, దొరికిన వారిని దొరికినట్లు చితకబాదడం చర్చనీయాంశమైంది.

పల్నాడు, అనంత ఎస్పీలపై వేటు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ఎన్నికల సంఘం విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు అధికారులపై వేటు వేసింది. పల్నాడు, అనంతపురం ఎస్పీలు బిందు మాధవ్, అమిత్ బర్దర్‌లను సస్పెండ్ చేయగా తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌ను బదిలీ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను సైతం బదిలీ చేసి శాఖాపరమైన విచారణ చేపట్టాలని సూచించింది. అలాగే పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాలకు చెందిన 12 మంది పోలీసు అధికారులను సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణ నిర్వహించాలని పేర్కొంది. హింస చెలరేగేందుకు కారకులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి రెండు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. బాధ్యులపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చార్జిషీట్ నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఢిల్లీ వెళ్లి ఎన్నికల వేళ చెలరేగిన హింసపై స్వయంగా వివరణ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని, కౌంటింగ్ రోజు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఆరు ప్రతిపాదనలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఓట్ల లెక్కింపు అనంతరం 15 రోజులపాటు బందోబస్తు విధులు నిర్వహించేందుకు 25 కంపెనీల అదనపు బలగాలను పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ కేంద్ర హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది.

ఈసీ సస్పెండ్ చేసిన పోలీసులు వీరే

తిరుపతి జిల్లా	
ఎ.సురేందర్‌రెడ్డి	డీఎస్పీ-తిరుపతి
కె.రాజశేఖర్	స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్
ఎం.భాస్కర్ రెడ్డి	స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ
ఒ.రామచంద్రారెడ్డి	ఇన్‌స్పెక్టర్-అలిపిరి
పల్నాడు జిల్లా	
ఎ.పల్లపురాజు	ఎస్‌డీపీవో-గురజాల
వీఎస్ఎన్ వర్మ	ఎస్‌డీపీవో-నరసరావుపేట
కె.ప్రభాకర్‌రావు	స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్
ఇ.బాలనాగిరెడ్డి	స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్
ఎం.రామాంజనేయులు	ఎస్సై-కారంపూడి
డి.వి.కొండారెడ్డి	ఎస్సై-నాగార్జునసాగర్
అనంతపురం జిల్లా	
సి.ఎం. గంగయ్య	డీఎస్పీ-తాడిపత్రి
ఎస్. మురళీకృష్ణ	ఇన్‌స్పెక్టర్-తాడిపత్రి

అడుగడుగునా టీడీపీకి సహకారం

నరసరావుపేట: కూటమి చేతిలో కీలు బొమ్మగా మారిన ఎన్నికల కమిషన్ తన నిర్ణయాలను తానే మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం నాయకులు పదేపదే ఫిర్యాదు చేస్తుండటంతో పల్నాడు ఎస్పీగా ఉన్న వై.రవిశంకర్‌రెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించే ఎస్పీ జి.బిందుమాధవ్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత

ఎస్పీ బిందుమాధవ్ తీరు ఆది నుంచి అనుమానాస్పదమే

ఈయన తీసుకున్న నిర్ణయాలు అన్నీ టీడీపీకి అనుకూలంగా మారాయి. టీడీపీ దౌర్జన్యకాండను ఏ దశలోనూ ఆపలేకపోయారు. ఎస్పీ తీరు ఆది నుంచి అనుమానాస్పదంగానే ఉంది. టీడీపీ ఎంపీగా పోటీ చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు భార్య, ఎస్పీ బిందుమాధవ్ భార్య బంధువులని.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సహకారంతో జిల్లా ఎస్పీగా బిందుమాధవ్ నియమితులయ్యారని మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇప్పటికే ఆరోపించారు. అందువల్లే పిన్నెల్లి భార్య, కుమారుడిపై దాడులు జరిగినా, సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటుపై సరిగా స్పందించలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీకి అనుకూలమైన గ్రామాల్లో నామమాత్రం బందోబస్తు ఏర్పాటు చేసి, అక్కడ రిగ్గింగ్ జరిగేందుకు ఎస్పీ తోడ్పాటు అందించారని మాచర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పటికే బహిర్గతం చేశారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహంపై టీడీపీ నేతల విధ్వంసం ఘటన పోలీసుల పక్షపాతం కారణంగానే జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే గోపిరెడ్డి పోలింగ్ బూత్‌లు పరిశీలించకుండా హౌస్ అరెస్టు చేసి, టీడీపీ అభ్యర్థులు చదలవాడ, లావులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని కూడా తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిలకు టీడీపీ వర్గీయుల నుంచి రక్షణ కల్పించలేకపోయారు. సత్తెనపల్లిలో మంత్రి అంబటికి సీఐ రివాల్వర్ గురిపెట్టడం, టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు పోలీసులు సహకరించడం విమర్శలకు దారి తీసింది. పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించకపోవటం టీడీపీ అరాచకానికి ఊతమిచ్చింది. వీటన్నింటి దృష్ట్యా ఎస్పీ బిందుమాధవ్‌పై ఈసీ వేటు వేసింది. పోలీసు వ్యవస్థతో సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని బదిలీ చేసింది.

జూన్ 9న విశాఖలో జగన్ ప్రమాణ స్వీకారం

కనీవినీ ఎరుగని రీతిలో ఫలితాలు వస్తాయి

- రాష్ట్రానికి ఈసారీ జగనే సీఎం కావాలని ప్రజలంతా భావించారు
- జగన్‌కు ఉన్నది.. చంద్రబాబుకు లేనిది విశ్వసనీయత
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఆ పత్రికలు ఇప్పుడు రాయవు
- ఆగిపోయిన పథకాల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని ఫలితాలతో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించబోతోందని, జూన్ 9వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరంలో ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మంత్రి గురువారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా ఈసారి కూడా జగనే రావాలని కోరుకున్నారని తెలిపారు. సీఎంగా జగన్ వస్తేనే ఒకటో తేదీన పింఛన్ వస్తుందని, క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందుతాయని భావించి ఓట్లేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో చెప్పినట్లు ఈ ఐదేళ్లలో మేలు జరిగితేనే ఓటేయండని ప్రజలను అడిగి సీఎం జగన్ దేశంలోనే కొత్త ట్రెండ్ తీసుకొచ్చారని తెలిపారు. తమ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు, పథకాలన్నింటినీ కొనసాగిస్తామని ప్రజలకు చెప్పామన్నారు. సీఎం జగన్ ఏ కార్యక్రమం చేపట్టినా దానిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రజలకు మేలు జరుగుతుందంటేనే నిర్ణయం తీసుకోవాలని చెబుతారన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత మళ్లీ వెనుకడుగు ఉండదన్నారు. ఒకవేళ చేయలేకపోయినా కారణం కూడా చెప్పే ధైర్యం తమ నాయకుడికి ఉందన్నారు. చంద్రబాబు ఎంతసేపు జగన్‌ను తిట్టి ఓటేయమన్నాడే తప్ప చేసిందేమీలేదన్నారు. జగన్ లేకపోతే సంక్షేమం ఉండదని, మళ్లీ కష్టాలొస్తాయని, జన్మభూమి కమిటీలు వచ్చి అవినీతి రాజ్యమేలుతుందని ప్రజలకు అర్థం అయిందన్నారు. అందుకే ప్రజలు కూడా ఉవ్వెత్తున పోలింగ్ బూత్‌లకు బారులు తీరారని, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అందరూ జగన్‌ను ఆశీర్వదించారని చెప్పారు. అందుకే సహనం కోల్పోయిన టీడీపీ దాడులకు తెగబడుతోందన్నారు. టీడీపీ అల్లర్లకు ప్రతిగా తమ నాయకుడు కూడా స్పందిస్తే వేరేలా ఉండేదని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం మంచి సంప్రదాయం కాదని వైఎస్ జగన్ అందర్నీ సంయమనం పాటించాలని కోరారని తెలిపారు. ప్రభుత్వాన్ని నడపాల్సింది, శాంతిభద్రతలను కాపాడాల్సింది తామే అయినందున బాధ్యతగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. సంయమనం పాటిస్తే అన్నీ సర్దుకుంటాయని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన సామాజిక న్యాయం చరిత్రలో ఎక్కడా లేదన్నారు. టీడీపీలో అది లేదని, వారిచ్చిన టికెట్లలోనే ఏ వర్గానికి ఎన్ని ఇచ్చారో స్పష్టం అవుతుందన్నారు. తమ పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 72 శాతానికి పైగా సీట్లిచ్చామని, అందుకే ఆయా వర్గాలు తమకు పట్టం కట్టాయన్నారు.

చంద్రబాబు గత చరిత్ర ప్రజలకు తెలియదా?

చంద్రబాబు గెలుస్తాననడానికి ఆయనకున్న బేస్ ఏమిటని, చెప్పుకోవడానికి ఒక్క మంచిపనైనా ఉందా అని మంత్రి బొత్స ప్రశ్నించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ చెబితే చేసేస్తారని ప్రజలు నమ్మేయడానికి ఆయనేం రాజకీయాలకు కొత్తకాదని, 14 ఏళ్లు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేశారని, ఆ పాత చరిత్ర ప్రజలకు తెలియదా అని అన్నారు. 2014లో రుణమాఫీ చేస్తానని మహిళలు, రైతులను మోసం చేశాడని, బాబొస్తే జాబొస్తుంది.. లేదంటే రూ.2 వేల భృతి అని యువతను మోసం చేశాడన్నారు. అలాంటి మోసకారిని ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. జగన్‌కు ఉన్నది చంద్రబాబుకు లేనిది విశ్వసనీయత అని, జగన్ చెప్పిందే చేస్తారని, ప్రజలకు అలాంటి నమ్మకం కావాలన్నారు. సీఎం జగన్ పాలనలో పేదవాడి ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, పేద విద్యార్థి గ్లోబల్ స్థాయికి ఎదగడానికి అవసరమైన ప్రక్రియలు ప్రాథమిక స్థాయి నుంచే సమకూరుస్తున్నారన్నారు. ఇలాంటివి చంద్రబాబు నాయుడిని ఒక్కటైనా చెప్పమనండని అడిగారు.

చెప్పిందే జరిగింది

చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజలందరికీ పూర్తి అవగాహన ఉందన్నారు. పోలింగ్ అయిన మరుసటి రోజు నుంచీ ఆ పత్రికలు ఈ చట్టంపై ఒక్క వార్త కూడా రాయవని తాను తొలిరోజే చెప్పానని, ఇప్పుడు అదే జరిగిందన్నారు. వారి కుయుక్తులకు పేదవాడికి రావాల్సిన పింఛన్ ఆగిందని, సంక్షేమ ఫలాలు ఆగిపోయాయని తెలిపారు. అది కూడా ఈ నెల 14 వరకేనని చెప్పామన్నారు. ఈరోజు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆసరా పథకం సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు వెళ్లిపోయాయని చెప్పారు. నాలుగైదు రోజుల్లో అన్ని పథకాల సొమ్ము లబ్ధిదారులకు చేరిపోతుందన్నారు. అదే చంద్రబాబు అయితే ఇచ్చేవాడా అని ప్రశ్నించారు. ఎన్నికలు అయిపోవడంతోటే ఆయనకు ప్రజలతో పనుండదని, తన తాబేదార్లకు, అనుకూల కాంట్రాక్టర్లకు డబ్బంతా ఇచ్చుకునేవాడని మంత్రి అన్నారు.

మళ్లీ చరిత్ర సృష్టిస్తున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. 2019 ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలను దక్కించుకుని వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించిందని ఈ సందర్భంగా సీఎం జగన్ గుర్తు చేశారు. ఈ దఫా అంతకంటే ఎక్కువ స్థానాల్లో విజయ పతాకం ఎగురవేసి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు.

మరింత మంచి చేద్దాం..

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4న వచ్చే ఫలితాలు చూసి దేశం షాక్ అవుతుందని.. ఫలితాలు వెల్లడైన తర్వాత దేశం మొత్తం మన వైపు చూస్తుందని సీఎం జగన్ చెప్పారు. 59 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజలకు మంచి చేశామని.. రాబోయే ఐదేళ్లలో ఇంకా ఎక్కువ మేలు చేద్దామని చెప్పారు. రానున్న రోజుల్లో ఐ-ప్యాక్‌తో ప్రయాణం ఇలాగే కొనసాగుతుందన్నారు.

విశ్వసనీయతే విజయానికి మెట్టు..

గత ఎన్నికల్లో చారిత్రక విజయంతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ తొలి ఏడాదే మేనిఫెస్టోలోని హామీల్లో 95% అమలు చేశారు. మొత్తమ్మీద 99% హామీలను అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా వివక్ష, లంచాలకు తావు లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందించారు. సంక్షేమ పథకాల ద్వారా 59 నెలల్లో పేదల ఖాతాల్లోకి డీబీటీ రూపంలో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు. చెప్పిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరిగింది. వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయానికి ఇదే బాటలు వేసిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



ఐ-ప్యాక్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెల్ఫీ

మహిళలు, గ్రామీణులు వైఎస్సార్‌సీపీ వైపే..

అమ్మ ఒడి, ఆసరా, చేయూత లాంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు సీఎం జగన్ సుస్థిర బాటలు వేశారు. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకూ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారు. నామినేటెడ్ పనులు, పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మరీ మహిళలకు పట్టం కట్టారు. ఇంటి స్థలంతోపాటు ఇంటిని కూడా మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మహిళా సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్ నాయకత్వంపై మహిళల్లో మద్దతు మరింత పెరిగింది. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. ఊరు దాటాల్సిన అవసరం లేకుండా పనులన్నీ జరుగుతుండటంతో సీఎం జగన్ నాయకత్వంపై గ్రామీణుల నమ్మకం మరింత పెరిగింది.ఇటు ప్రభుత్వం.. అటు ప్రైవేట్ రంగాల్లో భారీ ఎత్తున ఉద్యోగాలు ఇవ్వడంతో సీఎం జగన్ నాయకత్వంపై యువతలో విశ్వసనీయత రెట్టింపైంది. ఏపీలో మహిళలు, గ్రామీణులే ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మహిళలు, గ్రామీణులు పెద్ద ఎత్తున సీఎం జగన్ నాయకత్వానికి మద్దతుగా ఓటు వేయడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందని, వైఎస్సార్‌సీపీ మరోసారి చారిత్రక విజయం సాధించడం ఖాయమని తేల్చి చెబుతున్నారు.

చంద్రబాబు ప్రోద్బలంతోనే దాడులు

గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఏపీలో పోలింగ్ రోజు, అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ దాడులకు చంద్రబాబే కారణమని, ఆయన ప్రోద్బలంతోనే హింసాకాండ కొనసాగిందని మంత్రి బొత్స ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేసింది. పల్నాడు, అనంతపురం తదితర జిల్లాల్లో పోలీసు అధికారుల వైఫల్యాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లింది. ఈసీ పలుచోట్ల పోలీసు అధికారులను మార్పులు చేసిన తర్వాత రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు పెరిగాయని వివరించింది. పోలీసు అధికారులు తీసుకున్న చర్యల్లోని లోపాలనూ ఫిర్యాదులో ప్రస్తావించింది. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం నియమించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా పక్షపాతంతో వ్యవహరించారని తెలిపింది. మిశ్రా టీడీపీతో కుమ్మక్కయ్యారని, ఎన్నికల ప్రక్రియను దెబ్బ తీస్తూ తనకు అప్పగించిన బాధ్యతకు తూట్లు పొడిచారని చెప్పారు.

హింస ఆందోళన కలిగిస్తోంది..

చంద్రబాబుతో పాటు హింసకు కారణమైన వారందరిపై చర్యలు తీసుకోవాలని మంత్రి బొత్స డిమాండ్ చేశారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ తర్వాత జరుగుతున్న హింస ఆందోళన కలిగిస్తోందన్నారు. టీడీపీ ఫిర్యాదులపై విచారణ లేకుండా ఎన్నికల అబ్జర్వర్ దీపక్ మిశ్రా చర్యలు తీసుకోవడం ఆయన పక్షపాతంగా వ్యవహరించారనడానికి నిదర్శనమని, ఆయనపై న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం నుంచి రిపోర్ట్ తెప్పించుకుని దీపక్ మిశ్రాను మార్చాలని గవర్నర్‌ను కోరినట్టు వివరించారు. రాష్ట్రంలో ఎన్నికలు జరగక ముందు, ఆ తర్వాత పరిణామాలను గవర్నర్‌కు వివరించామని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. శంఖబ్రత బాగ్చీ, త్రిపాఠి, బిందు మాధవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. మిశ్రాతో పాటు, వీరందరూ కౌంటింగ్‌పైనా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా దీపక్ మిశ్రా వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పేర్నినాని మాట్లాడుతూ.. ఉద్దేశ పూర్వకంగా మిశ్రాను ఏపీలో ఎన్నికల కోసం బీజేపీ, టీడీపీలు తెచ్చాయని చెప్పారు. అతని కారణంగానే విధ్వంసం జరుగుతోందన్నారు. మిశ్రా విజయవాడకు వచ్చినప్పటి నుంచి టీడీపీ సానుభూతి పరులైన రిటైర్డు అధికారులను కలిశారన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ నాయుడు ఉన్నారు.

బదిలీల తర్వాతే హింస!

- కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించిన సీఎస్, డీజీపీ
- ఏపీలో పోలింగ్, తర్వాత చోటు చేసుకున్న ఘటనలపై వివరణ
- కౌంటింగ్ రోజు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈసీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక అందజేశారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు జరగడానికి కారణాలను నివేదించారు. ఈసీ ఆదేశాల మేరకు ఢిల్లీ వచ్చిన వారిద్దరూ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలతో సమావేశమయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో అల్లర్లకు కారణాలను విశ్లేషించారు.

అధికారుల బదిలీ తర్వాతే అల్లర్లు

సమస్యాత్మక ప్రాంతాలైన పల్నాడు, చంద్రగిరి, తాడిపత్రిని దృష్టిలో ఉంచుకుని ముందుగానే భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ జవహర్‌రెడ్డి ఈసీకి తెలిపారు. హఠాత్తుగా పోలీసు అధికారులను బదిలీ చేయడం, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారికి క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల అల్లర్లకు దారి తీసిందని తాము గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు పల్నాడు, కారంపూడి, మాచవరం, తాడిపత్రి, తిరుపతి, చంద్రగిరి, అనంతపురం, కృష్ణా జిల్లా, నర్సీపట్నం తదితర చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ స్థాయి అధికారి నుంచి ఎస్ఐ వరకు హఠాత్తుగా బదిలీలు చేయడంతో ఇదే అదునుగా అల్లర్లకు పాల్పడినట్లు వివరించారు. అల్లర్లు జరిగిన ప్రాంతాలన్నింటిలోనూ పోలీసు అధికారుల ఆకస్మిక బదిలీలే హింసకు కారణమని పేర్కొన్నట్లు తెలిసింది.

కౌంటింగ్ రోజు జాగ్రత్త..

రాష్ట్రంలో ఇకపై ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్, డీజీపీని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అల్లర్లకు కారకులపై కఠినంగా వ్యవహరించాలని సూచించింది. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట బందోబస్తు కల్పించాలని పేర్కొంది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారులు, సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించినట్లు సమాచారం. ఎస్పీ స్థాయి అధికారి నుంచి హోంగార్డు వరకు ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉందని, దీనిపై నిశితంగా పర్యవేక్షించాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచించినట్లు తెలిసింది.

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు

వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డెంగీ నివారణకు పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తెలిపారు. గురువారం మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో డెంగీ అనుమానాస్పద కేసుల్లో రక్త నమూనాలను సేకరించి రాష్ట్ర వ్యాప్తంగా 54 నిర్ధారణ కేంద్రాల్లో పరీక్షిస్తున్నట్టు వివరించారు.

జగన్ రెండోసారి సీఎం ఖాయం

భారతదేశం లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాల

రహమత్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం ఖాయమని భారతదేశం లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాల ధీమా వ్యక్తం చేశారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఏపీలో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే మరోసారి ఆయనను గెలిపిస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తరువాత టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. ఏపీలోని అన్ని అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని మాల స్పష్టం చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారానికి నీతి ఆయోగ్ చెక్

ఈ చట్టంతోనే భూ యాజమాన్య నిర్వహణ పటిష్ఠమని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: పచ్చమీడియా విషప్రచారాన్ని అండగా చేసుకుని చెలరేగిపోయి, రాష్ట్ర ప్రజానీకాన్ని తప్పుదారి పట్టించాలని చూసిన చంద్రబాబు నాయుడికి దిమ్మదిరిగే షాక్ నీతి ఆయోగ్ రూపంలో తగిలింది...ఎన్నికల ప్రచారంలో దూషణలు, పనికిమాలిన అబద్ధాలు చెప్పి ప్రజలను వంచించాలని చూసిన ఈ పచ్చపార్టీ అధినేతకు ఇది శరాఘాతమే..

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఎల్లో మీడియాతో కలిసి చంద్రబాబు గణం చేసిన దుష్ప్రచారానికి నీతి ఆయోగ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ చట్టానికి సంబంధించి కీలక సమాచారాన్ని వెల్లడించింది. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతుల భూములు లాక్కునే పరిస్థితి ఉండదని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. ఈ చట్టం వల్ల భూములన్నీ మరింత భద్రంగా ఉంటాయని... భూ పరిపాలన మరింత సులువవుతుందని పేర్కొంది. భూములపై రైతులకు సర్వహక్కులూ లభిస్తాయని... ఈ చట్టంతో పటిష్ఠమైన భూ యాజమాన్య నిర్వహణ సాధ్యమవుతుందని వెల్లడించింది. సమాచార హక్కు చట్టం కింద సాక్షి టీవీ డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్ నాగిళ్ల వెంకటేష్ అడిగిన ప్రశ్నలకు నీతి ఆయోగ్‌లోని జల, భూవనరుల శాఖ ఈ విషయమై స్పష్టతను ఇచ్చింది. ఆ శాఖ అండర్ సెక్రటరీ రవీందర్ కౌర్ గురువారం ఒక లేఖ ద్వారా ఈ వివరాలను వెల్లడించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు సంబంధించిన ముసాయిదాను కేంద్ర భూవనరుల శాఖతో పాటు అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే పంపించామని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది.

జేసీ సోదరులపై బిగుస్తున్న ఉచ్చు!

- జేసీ ట్రావెల్స్ దందాపై ఈడీ కొరడా
- కీలక ఆధారాలు సేకరించి నిర్ధారించిన ఈడీ
- వేగవంతం కానున్న కేసు విచారణ
- సీఎంఎల్‌ఏ కోర్టులో ఈడీ ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు

తాడిపత్రి అర్బన్: నకిలీ పత్రాలతో వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫోర్జరీ ఎన్‌ఓసీలతో వాహనాల కొనుగోలు, అమ్మకాల వెనుక భారీగా నల్లధనం చేతులు మారిన బాగోతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జేసీ కుటుంబ సభ్యులపై ఉచ్చు బిగుస్తోంది. మనీ లాండరింగ్ చట్టాలను ఉల్లంఘించిన వ్యవహారంలో విచారణకు జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు, ప్రస్తుత టీడీపీ తాడిపత్రి అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిలనూ ఈడీ విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన ఈడీ తాజాగా ఈ కేసులో విశాఖపట్నం సీఎంఎల్‌ఏ న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ (పీసీ)ని దాఖలు చేసింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి, చవ్వా గోపాల్‌రెడ్డితో పాటు 17 మందిని నిందితులుగా పేర్కొంది.

అక్రమ బాగోతం ఇలా...

సుప్రీంకోర్టు నిషేధించిన బీఎస్–3 కేటగిరీకి చెందిన 154 లారీలు, బస్సులను తుక్కు కింద జఠాధర ఇండస్ట్రీస్ పేరున 50, సి.గోపాల్‌రెడ్డి అండ్ కో పేరున 104 వాహనాలను టీడీపీ నేత జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి సోదరులు కొన్నారు. నకిలీ పత్రాలతో వాటిని బీఎస్–4 వాహనాలుగా చలామణీలోకి తెచ్చారు. ఆ తర్వాత వాటిని నాగాలాండ్ రాజధాని కోహిమాలో రిజిస్ట్రేషన్ చేయించి, ఎన్‌ఓసీ పొందారు.ఈ తతంగం పూర్తయిన తర్వాత 15 రోజుల్లోనే వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్‌లలో మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లో 101 , తెలంగాణలో 33 , కర్ణాటకలో 15 వాహనాలు, తమిళనాడులో ఒకటి, ఛత్తీస్‌ఘడ్‌లో ఒక బస్సును నిర్వహించారు. మరో మూడు బస్సులు ఎక్కడ ఉన్నాయన్నది తెలియలేదు. ఆ వాహనాల లైసెన్సులకూ ఫోర్జరీ పత్రాలు సమర్పించారు. వాహనాల బీమాలోనూ వీరు ఫోర్జరీకి పాల్పడ్డారు. వీటిని కొద్ది రోజుల పాటు తిప్పి ఆ తర్వాత పోలీసుల నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లతో (ఎన్‌ఓసీ) వాటిని ఇతర రాష్ట్రాల వారికి విక్రయించేశారు. వీటిని కొనుగోలు చేసిన వారు తాము మోసపోయామని గుర్తించి ఫిర్యాదు చేశారు. సమగ్ర సమాచారం కోసం పోలీసులు నేషనల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీ) రికార్డులను పరిశీలించారు. జేసీ కుటుంబం సమర్పించిన బీమా పత్రాలు నకిలీవని తేలడంతో అప్పటి అనంతపురం డిప్యూటీ రవాణా కమీషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2020 జూన్‌లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డితో పాటు 23 మందిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు 35 కేసులు నమోదు చేశారు. ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రత్యేక దర్యాప్తునకు కేంద్రానికి లేఖ...

జేసీ కుటుంబ అక్రమాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని సూచిస్తూ రాష్ట్ర పోలీసులు అప్పట్లో కేంద్రానికి లేఖ రాసిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. జేసీ కుటుంబ అక్రమాల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు కోసం ఈడీని రంగంలోకి దింపింది. కొన్ని నెలల క్రితం ఈడీ అధికారులు అనంతపురం రవాణా శాఖ అధికారుల నుంచి ఆధారాలు, కీలక పత్రాలనూ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి, వారి వ్యాపార భాగస్వామి చవ్వా గోపాల్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాలతో పాటు తాడిపత్రి, హైదరాబాద్, బెంగళూరు తదితర చోట్ల ఈడీ ఏక కాలంలో నిర్వహించిన సోదాల్లో కీలక ఆధారాలు సేకరించి ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డిల ఫోన్లను, రూ.28.62 కోట్ల విలువైన స్థిరాస్తులనూ జప్తు చేసింది. ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌ను తాజాగా విశాఖ న్యాయస్థానంలో దాఖలు చేయడంతో ఈ కేసు విచారణ వేగవంతం కానున్నట్లు స్పష్టమవుతోంది.

ఈ-ఆఫీస్ అప్‌గ్రేడేషన్ నిలిపివేయాలి

గవర్నర్‌కు చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ అప్‌గ్రేడ్ చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు చంద్రబాబు లేఖ రాశారు. అనంతరం లేఖను మీడియాకు విడుదల చేశారు. ఈ నెల 17–25 వరకు అప్‌గ్రేడ్ పేరుతో ఈ–ఆఫీస్ మూసివేతపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. త్వరలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న తరుణంలో ఇప్పటికిప్పుడు ఈ–ఆఫీస్ అప్‌గ్రేడేషన్ చేయాల్సిన అవసరం లేదన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో జీవోలను పెట్టకుండా ప్రభుత్వం రహస్యంగా ఉంచిందన్నారు. నేడు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ ఈ–ఆఫీస్ వెర్షన్ మార్చడం సరికాదన్నారు. ఇప్పటికే పలు కీలకమైన రికార్డులు మాయమైనట్లు తెలిసిందని, కొద్దిరోజుల క్రితం నిబంధనలకు విరుద్ధంగా పలు రికార్డులను సీఐడీ కాల్చేసిందని ఆరోపించారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉన్న ఫిజికల్, డిజిటల్ డాక్యుమెంట్‌లు భద్రపరిచేలా సీఎస్‌ను ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు.

నకిలీ న్యాయవాదులపై బార్ కౌన్సిల్ వేటు

సాక్షి, అమరావతి: నకిలీ విద్యార్హతల ధ్రువపత్రాలు సమర్పించి న్యాయవాదులుగా చెలామణి అవుతున్న ఆరుగురిపై రాష్ట్ర బార్ కౌన్సిల్ వేటు వేసింది. వారిని తక్షణమే బార్ కౌన్సిల్ న్యాయవాదుల జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా, సత్తెనపల్లికి చెందిన బిక్కి నాగేశ్వరరావు, మాచర్ల వెంకటేశ్వరరావు, తూర్పు గోదావరి జిల్లా, బొక్కావారిపాలెంకు చెందిన పితాని లక్ష్మీబాయి, గుంటూరుకు చెందిన జొన్నకూటి సాంబశివరావు, విశాఖపట్నంకు చెందిన తడ్డి వెంకటనాయుడు, కర్నూలు జిల్లా, గుండ్ల సింగవరంకు చెందిన కాటాసాని సంజీవరెడ్డిలను జాబితా నుంచి తొలగిస్తూ బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత నోటిఫికేషన్ జారీ చేశారు. బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా ఎన్‌రోల్ అయ్యే సమయంలో ఈ ఆరుగురు ధ్రువపత్రాలు సమర్పించారు. బార్ కౌన్సిల్ పరిశీలనలో ఇవి నకిలీవని తేలింది. దీంతో వీరి పేర్లను బార్ కౌన్సిల్ జాబితా నుంచి తొలగించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. రెండు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీకి స్పష్టం చేసింది. సమావేశమైన బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ ఈ ఆరుగురి పేర్లను తక్షణమే బార్ కౌన్సిల్ జాబితా నుంచి తొలగించాలని తీర్మానించింది.

ముందస్తు 'నైరుతి'

31నే కేరళను తాకనున్న రుతుపవనాలు.. చల్లని కబురు అందించిన ఐఎండీ

సాక్షి, విశాఖపట్నం: ఎండలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది రుతుపవనాలు జూన్ ఒకటో తేదీన కేరళలోకి ప్రవేశించాల్సి ఉంది. కానీ ఈ సారి మే 31నే తాకుతాయని ప్రకటించింది. ఇందుకు వాయవ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు, దక్షిణ భారతదేశంలో రుతుపవనాలకు ముందుగా కురుస్తున్న వానలు, దక్షిణ చైనా, నైరుతి పసిఫిక్ మహా సముద్రంపై ఔట్ గోయింగ్ లాంగ్ వేవ్ రేడియేషన్ (మేఘాలు కమ్ముకుని ఉండడం), ఆగ్నేయ హిందూ మహాసముద్రంలో భూమధ్య రేఖపై దిగువ స్థాయిలో గాలులు, ఈశాన్య హిందూ మహా సముద్రంలో భూమధ్య రేఖాప్రాంతంపై ఎగువ స్థాయిలో గాలులు వంటి ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజను సమృద్ధిగా వర్షాలను కురిపిస్తుందని, సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావం జూన్‌తో బలహీన పడి, లానినా ప్రభావం మొదలవుతుండడం ఇందుకు దోహదపడుతుందని పేర్కొంది. గతేడాది వారం రోజులు ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు రావడంతో జూన్ ఆఖరి వరకు జనం అల్లాడిపోయారు. ఆ తర్వాత కూడా సకాలంలో వర్షాలు కురవక పంటలు కూడా ఆశాజనకంగా పండలేదు. ఈ సారి రుతుపవనాలు ఆలస్యం కాకుండా ఒకింత ముందుగానే ప్రవేశించనున్నందున రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గి వడగాడ్పుల బెడద తప్పనుంది.



గత ఐదేళ్లలో నైరుతి ఆగమనం ఇలా..

సంవత్సరం	ఆగమనం	అంచనా తేది
2019	జూన్ 8	జూన్ 6
2020	జూన్ 1	జూన్ 5
2021	జూన్ 3	మే 31
2022	మే 29	మే 27
2023	జూన్ 8	జూన్ 4

మూడు రోజులు వర్షాలు

దక్షిణ అంతర్గత కర్నాటక నుంచి తూర్పు విదర్భ వరకు ఉన్న ద్రోణి గురువారం బలహీన పడింది. అయినప్పటికీ గాలిలో తేమతో పాటు ఆగ్నేయ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఒంగోలులో 5, ఓలేటివారిపాలెం(నెల్లూరు)లో 4.8, నందికొట్కూరు (నంద్యాల)లో 4.7, నాయుడుపేట(తిరుపతి)లో 2.7, పాయకరావుపేట (అనకాపల్లి)లో 2.3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

గ్రేటర్ హైదరాబాద్‌లో కుండపోత

గంట సేపట్లో సికింద్రాబాద్‌లో 11.6 సెం.మీ. వర్షపాతం

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు రాకముందే తెలంగాణలో ముందస్తుగా కురిసిన వాన మురిపించింది. గురువారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండవేడితో ఉక్కిరిబిక్కిరైన గ్రేటర్ ప్రజలకు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మొదలైన వాన ఉపశమనాన్ని ఇచ్చింది. గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని గంటకుపైగా ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. కుండపోత వానతో నగరంలోని రోడ్లన్నీ జలమయ్యాయి. ప్రధాన రహదారుల వెంట ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సికింద్రాబాద్‌లో అత్యధికంగా 11.6 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కృష్ణానగర్‌లో 9, షేక్‌పేటలో 8.65, అంబర్‌పేట్‌లో 8.45, నాంపల్లిలో 8.3, ఖైరతాబాద్‌లో 7.73 సెం.మీ. నమోదైంది. హైదరాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి.

తెలంగాణలో నేటి నుంచి 'సినిమా' బంద్!

- మూతపడనున్న సింగిల్ స్క్రీన్ థియేటర్లు
- రాష్ట్రంలో దాదాపు 350పైనే..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో శుక్రవారం నుంచి పలు సినిమా థియేటర్లు మూతపడనున్నాయి. రాష్ట్రంలో దాదాపు 350కిపైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను దాదాపు పదిరోజులపాటు మూసివేస్తున్నట్టు థియేటర్ల యజమానులు చెబుతున్నారు. థియేటర్ల మూసివేత విషయం ఎగ్జిబిటర్ల అసోసియేషన్ సమష్టిగా తీసుకున్న నిర్ణయం కాదని... నష్టాలను మూటకట్టుకోవడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొంటున్నారు. ఆ మేరకు కొత్త సినిమాలు వచ్చేవరకు అంటే... శుక్రవారం నుంచి కనీసం పదిరోజులపాటు ఏ బొమ్మా పడదని అంటున్నారు. జనవరి తర్వాత జూన్ వరకు పెద్ద హీరోల సినిమాలు ఒక్కటి కూడా విడుదల కావడం లేదని, చిన్న సినిమాలు వచ్చినా.. అవి ప్రేక్షక ఆదరణ లేని కారణంగా రోజు అయ్యే వ్యయంలో కనీసం పదిశాతం ఆదాయం కూడా రావడం లేదని ఎగ్జిబిటర్ ఒకరు చెప్పారు. కాగా, తెలంగాణలో రెండు వారాలపాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపివేయాలన్న నిర్ణయంతో తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అధ్యక్షుడు సునీల్‌నారంగ్, కార్యదర్శి కె.అనుపమ్‌రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

నిశ్చయంగా, నరకం ధిక్కారుల గమ్యస్థానం. అందులో వారు యుగాల తరబడి ఉంటారు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 17 మే 2024

ఉత్తరాఖండ్ నిర్లక్ష్యం

నిర్లక్ష్యం మంటల్లో నిత్యం దహించుకుపోతున్న ఉత్తరాఖండ్ అడవులపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టిసారించటం, సంజాయిషీ కోరడం హర్షించదగిన పరిణామం. ఈ మంటల్లో చిక్కుకుని ఇంత వరకూ అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇతర జీవరాశులకు కలిగిన నష్టమెంతో తెలియదు. హిమాలయ సానువుల్లో కొలువుదీరి పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ అడవులపై అధికార యంత్రాంగం ప్రదర్శిస్తున్న అంతులేని నిర్లక్ష్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాతావరణపరంగా ఉత్తరాఖండ్‌లో, పొరుగునున్న హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ఈ రెండుచోట్లా శీతా కాలంలో భారీ వర్షాలు కురుస్తాయి. బలమైన గాలులు వీస్తాయి. అంతకుముందు విపరీతంగా మంచుకురుస్తుంది. దేవదారు వృక్షాలనుంచి రాలిపడిన ఆకులతో కొండ ప్రాంతాలన్నీ నిండిపోతాయి. ఈ ఆకులు మామూలుగా అయితే చిన్న నిప్పురవ్వ తగిలినా భగ్గునమండుతాయి. కానీ ఆ సమయంలో పడే వర్షాలతో అటవీప్రాంతమంతా చిత్తడిగా మారిపోతుంది. వేసవిలో కూడా ఇదే స్థితి కొనసాగుతుంది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇదంతా తారుమారైంది. నవంబర్ నుంచే అడవుల్లో అగ్నికీలలు కనబడ్డాయి. ఈ పరిణామాన్ని అంచనా వేయటం పెద్ద కష్టం కాదు.

కొండ ప్రాంతమంతా రాలిన ఆకులతో నిండినప్పుడు, ఎండలు మండుతున్నప్పుడు ఏం జరుగుతుందో గత అనుభవాలే చెబుతున్నాయి. దీనికితోడు పొగరాయుళ్లు నిర్లక్ష్యంగా పడేసే చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కూడా ప్రమాదాలు తెస్తున్నాయి. మాఫియాల బెడద సరేసరి. అటవీ భూములు అందుబాటులోకొస్తే కోట్లు గడించవచ్చని ఉద్దేశపూర్వకంగా అడవుల్ని తగలబెడుతుంటారు. వీరికి రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉంటాయి. ఇక కొండప్రాంతాలకు సమీపంలో పంట వ్యర్థాలను కళ్లాల్లోనే తగలబెట్టే అలవాటు అధికం. ఇది కూడా అడవులు అంటుకోవటానికి కారణమవుతోంది. ఇలాంటివారినుంచి అడవుల్ని కాపాడటానికీ, నిప్పు జాడ కనుక్కుని వెనువెంటనే ఆర్పడానికీ కొండలపై గార్డులు గస్తీ కాస్తుంటారు. కానీ వారంతా ఎన్నికల విధులు నిర్వర్తించటానికి తరలిపోయారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన దాఖలా లేదు. అందువల్లే ఈ దఫా ఇంతవరకూ 1,400 హెక్టార్ల అడవి తగలబడిందని ఒక అంచనా. గత నెలనుంచి చూసుకున్నా అడవులు అంటుకున్న ఉదంతాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లతో పోలిస్తే ఉత్తరాఖండ్‌లోనే అధికమని ఈమధ్య ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) డేటా తెలిపింది. ఉత్తరాఖండ్‌లో దాదాపు 24,305 చదరపు కిలోమీటర్లమేర అడవులున్నాయి. రాష్ట్ర భౌగోళిక ప్రాంతంలో ఇది 44.5 శాతం. ఇంత విస్తారంగా అడవులున్న రాష్ట్రం వాటిని ప్రాణప్రదంగా చూసుకోవద్దా?

కొండలపై రాలిపడే ఆకుల్ని ఏరేందుకూ, తామరతంపరగా పెరిగే గడ్డి మొక్కల్ని తొలగించటానికీ, అగ్ని ప్రమాదాల నివారణకూ మనుషుల్ని నియమించాలి. ఇందుకోసం ఏటా దాదాపు రూ. 9 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కానీ చిత్రమేమంటే ప్రభుత్వం కేవలం రూ. 3.15 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. మంటల జాడ లేకుండా చూడాలే తప్ప, ఒకసారి అంటుకుంటే అదుపు చేయటం అంత సులభం కాదు. ఈ నెల మొదట్లో అడవులు తగలబడుతున్నప్పుడు వైమానిక దళ హెలికాప్టర్లు రంగంలోకి దిగి వేలాది లీటర్ల నీటిని వెదజల్లాయి. ఈ చర్య కొంతమేర ఉపయోగపడినా అనుకోకుండా కురిసిన భారీ వర్షంతో పరిస్థితి అదుపులోకొచ్చింది. ఇలా ప్రతిసారీ జరుగుతుందని ఆశిస్తూ కూర్చుంటే అంతా తలకిందులవుతుంది. తమకున్న అడవుల్లో కేవలం 0.1 శాతం ప్రాంతంలో మాత్రమే మంటల బెడద ఉన్నదని ఉత్తరాఖండ్ దాఖలుచేసిన అఫిడవిట్ తెలిపింది. ఎంత శాతమని కాక, ఏమేరకు ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నామో, వాటి లోటుపాట్లేమిటో అధ్యయనం చేస్తున్న దాఖలా లేదు. ఎంత ప్రాంతంలో వృక్షాలు దెబ్బతిన్నాయో లెక్కలు చెబుతున్నారు. కానీ పర్యావరణానికి కలిగే నష్టం ఎవరూ గమనించటం లేదు. అగ్ని ప్రమాదాలవల్ల వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ పరిమాణం పెరుగుతుంది. నేలల్లో తేమ తగ్గిపోతుంది. పోషకాలు కూడా కనుమరుగవుతాయి. వీటికి సంబంధించిన డేటా ప్రభుత్వం దగ్గర ఉందో లేదో తెలియదు. నిజానికి ఇలాంటి డేటాతో స్థానిక ప్రజల్లో చైతన్యం తీసుకొస్తే, అడవులు తగలబడటంవల్ల భవిష్యత్తులో ఎన్ని చిక్కులు ఏర్పడే అవకాశమున్నదో చెబితే వారే స్వచ్ఛంద సైనికుల్లా ముందుకొస్తారు. అడవులను కాపాడతారు. మాఫియాలను కట్టడి చేసేందుకు సైతం సంసిద్ధులవుతారు. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఆ రకమైన చొరవేది?

ఉత్తరాఖండ్ అడవులు విశిష్టమైనవి. అక్కడ రెండు టైగర్ రిజర్వ్‌లున్నాయి. పక్షుల సంరక్షణ కేంద్రాలున్నాయి. ఇక్కడి గాలులు మోసుకెళ్లే ఆక్సిజన్ కారణంగానే కాలుష్యం కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ నగరం ఆ మాత్రమైనా ఊపిరి పీల్చుకోగలుగుతోంది. ఇక్కడి వృక్షాలవల్ల హిమాలయాల్లోని మంచుపర్వతాలు ఒక క్రమపద్ధతిలో కరిగి జీవనదులు పారుతున్నాయి. ఇంతటి అపురూపమైన అడవులు మానవ నిర్లక్ష్యం కారణంగా నాశనం కావటం అత్యంత విషాదకరం. ఎంత ప్రాంతమని కాదు...అడవిలోని ఒక్క వృక్షమైనా మన నిర్లక్ష్యంవల్ల, తప్పిదాలవల్ల నేలకొరగరాదన్న దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తే, దానికి అనుగుణమైన చర్యలు తీసుకుంటే అడవులు కళకళలాడతాయి. మనుషులు మాత్రమే కాదు...సకల జీవరాశులూ సురక్షితంగా ఉంటాయి. సర్వోన్నత న్యాయస్థానం జోక్యంవల్ల ఇదంతా నెరవేరితే అంతకన్నా కావాల్సిందేముంది?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, తిథి: శు.నవమి ఉ.9.09 వరకు, తదుపరి దశమి
నక్షత్రం: పుబ్బ రా.9.40 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** లేదు
దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.52 వరకు, తదుపరి ప.12.22 నుండి 1.10 వరకు, **అమృతఘడియలు:** ప.2.54 నుండి 4.28 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అనిశ్చితి కొనసాగితే అంతులేని నష్టం

విశ్లేషణ


జైదీప్ సైకియా

ఏడాది తర్వాత కూడా మణిపుర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మెరుగు పడలేదు. మణిపుర్ రాజధాని ఇంఫాల్‌తో నాగాలాండ్‌ను కలిపే జాతీయ రహదారి మీద ఉన్న వంతెనను దుండగులు పేల్చేశారు. మరో ఘటనలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపేశారు. అరాచకం ఎంత స్థాయికి వెళ్లిందంటే, న్యూఢిల్లీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని భావించే శక్తులు ఉన్నాయి. పదునైన టీమ్ వర్క్ ఫలితంగా అస్సాంలో శాంతి యుగానికి నాంది పడింది. అస్సాంలో జరిగినట్లుగానే మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్ ప్రదేశ్‌లకు ఏకీకృత కమాండ్ వ్యవస్థ (యూనిఫైడ్ కమాండ్ స్ట్రక్చర్)ను తక్షణమే ఏర్పాటు చేయడం మేలు. ప్రస్తుతం ఉన్న గందరగోళాన్ని, అనిశ్చితిని ఇలాగే కొనసాగనిస్తే, మణిపుర్ కోలుకోలేని విధంగా నష్టపోతుంది.

హింస చెలరేగిన ఏడాది తర్వాత కూడా మణిపుర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మరింత దారుణంగానే ఉంది. ఈ రాష్ట్రంలోని ప్రధాన శక్తులు ఏకతాటిపైకి వచ్చి తక్షణ దిద్దుబాటు కోసం ఒక మార్గాన్ని అన్వేషించడమే ఇప్పుడున్న ఏకైక పరిష్కారం.



సైన్యం లక్ష్యంగా దాడి

మణిపుర్‌లో ఇటీవల జరిగిన మూడు సంఘటనలను దృష్టిలో పెట్టుకోవాలి. ఏప్రిల్ 24న కాంగ్‌పోక్పి జిల్లాలోని జాతీయ రహదారి-2పై ఉన్న వంతెన మీద దుండగులు ఐఈడీ పేలుడుకు పాల్పడ్డారు. ఈ వంతెన ఇంఫాల్‌ను నాగాలాండ్‌లోని దిమాపూర్‌తో కలుపుతుంది. ఈ రహదారి రాష్ట్రానికి ప్రధాన జీవనాధారం. రాష్ట్రం నిలువునా చీలిపోయిన కారణంగా మణిపుర్ ప్రజలకు అవసరమైన సామగ్రిని తీసుకువెళ్లే 100కు పైగా ట్రక్కులు అక్కడ నిలిచిపోవాల్సి వచ్చింది.

ఏప్రిల్ 27న బిష్ణుపూర్ జిల్లాలోని నారాన్‌సీనా వద్ద జరిగిన దాడిలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. సీఆర్‌పీఎఫ్ జవాన్లు విడిది చేసి ఉన్న ప్రాంతానికి 200 మీటర్ల దూరంలోనే ఇండియా రిజర్వ్ బెటాలియన్ క్యాంపు (ఐఆర్‌బీ) ఉంది. ఐఆర్‌బీలో సిబ్బంది ప్రధానంగా మైతేయి కమ్యూనిటీకి చెందినవారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తమ శిబిరాన్ని ఖాళీ చేసే పనిలో ఉన్నారనీ, అక్కడ ఒక ప్లాటూన్ మాత్రమే మిగిలి ఉందనీ తెలియవచ్చింది.

దాడి చేసినవారు ఐఆర్‌బీలోని మైతేయి సభ్యులను లక్ష్యంగా చేసుకున్నారని భావించే అవకాశం ఉంది; రాత్రిపూట దాడి జరిగినందున, వారు సీఆర్‌పీఎఫ్ శిబిరాన్ని ఐఆర్‌బీ అని పొరపడి ఉండొచ్చు.

అయితే, ఆ దాడి లక్ష్యం సీఆర్‌పీఎఫ్ కూడా అయి ఉండవచ్చు – 1990ల మధ్యకాలంలో, అస్సాంలోని హిందీ మాట్లాడే ప్రజలను యథేచ్ఛగా హతమార్చడానికి ప్రయత్నించిన తిరుగుబాటు బృందం యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోమ్ (ఉల్ఫా) కార్యాచరణను ఇది తలపింపజేస్తోంది. అప్పట్లో ఉల్ఫా కేంద్రప్రభుత్వ దృష్టిని ఆకర్షించడానికి గట్టిగా ప్రయత్నించింది. అందులో విజయవంతం అయింది కూడా. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుండి కొంతమంది ఎంపీలు హిందీ మాట్లాడే తమ సోదరులకు సహాయం చేయడానికి వెంటనే అస్సాంలో దిగారు. బయటి వ్యక్తులు తమ రాష్ట్రంలో దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించే ఒక వర్గం అస్సామీ జనాభాలో ఉండేది. అది ఇప్పటికీ అలాగే ఉంది.

నారాన్‌సీనా ఘటనకు సంబంధించి, మణిపుర్‌లో అరాచకం ఎంత తీవ్రస్థాయికి వెళ్లిందంటే, న్యూఢిల్లీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని భావించే శక్తులు ఉన్నాయి. కాకపోతే సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ వంటి కేంద్ర పారామిలిటరీ బలగాలను వీరు గతంలో లక్ష్యంగా చేసుకోలేదని గమనించడం ముఖ్యం.

ఒకే తాటిపైకి వస్తేనే...

వంతెనపై ఐఈడీ పేలుడు, సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడికి సంబంధించిన అనుమానపు చూపు ప్రధానంగా కుకీ మిలిటెంట్ల వైపు మళ్లింది. అయితే, అది చేసింది ఎవరైనా కావచ్చు. 2023 మే 3 నుండి నియంత్రణ లేకుండా ఉన్న రాష్ట్రంలో, దాదాపు ప్రతి సమూహం సైనికీకరించబడింది.

మూడో విషయం రాజకీయ అండదండలతో కొనసాగుతున్న అరాచకానికి సంబంధించినది. అక్రమ ఆయుధాలతో ఉన్న అరామ్‌బాయి తెంగోల్ సభ్యులను పట్టుకున్న తర్వాత, సైన్యానికి చెందిన కాస్పిర్ వాహనాన్ని మీరా పైబీలు(మహిళా బృందాలు) అడ్డగించారు. వందలాది మంది మీరా పైబీలు కాస్పిర్‌ను చుట్టుముట్టి సైనికులను దూషించారు. ఆ సమయంలో గనక సైనిక సిబ్బంది సంయమనం కోల్పోయి ఉంటే రక్తపాతం జరిగి ఉండేది.

పదునైన టీమ్ వర్క్ ఫలితంగా అస్సాం శాంతి యుగానికి నాంది పలికింది. అస్సాంలో జరిగినట్లుగానే మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్ ప్రదేశ్‌లకు ఏకీకృత కమాండ్ వ్యవస్థ (యూనిఫైడ్ కమాండ్ స్ట్రక్చర్)ను తక్షణమే ఏర్పాటు చేయడం మేలు. ఇది రంగాపహాడ్(నాగాలాండ్) కేంద్రంగా పనిచేసే 3 కోర్‌కు చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మొత్తం నాయకత్వం కింద ఉండాలి. సహజంగానే సంప్రదింపుల తర్వాతే ఒక స్పష్టమైన స్వరం... శాంతి, సాధారణ స్థితికి రావడానికి కావాల్సిన వ్యూహాలు, మార్గాలు, సాధనాలపై దృష్టి పెట్టాలి.

మణిపుర్ విభజితమై ఉంది. రాష్ట్ర పోలీసు యంత్రాంగం దాదాపుగా పనిచేయడం లేదు. ఎటువంటి ఎదురూ లేని రాడికల్ మిలీషియా సంస్థకు పోలీస్ విభాగం తన బాధ్యతను వదిలేసుకుంది. కొంతమంది పోలీసులను ఆయుధాలు వదిలివేయమని బలవంతం చేస్తూ అరామ్‌బాయి తెంగోల్ ఒక డీఎస్పీని తీసుకెళ్లింది. ఇలాంటి తరుణంలో పోలీసులకు నాయకత్వం అవసరం. దురదృష్టవశాత్తు, అది పోలీసు శాఖ లోపల నుండి ఉద్భవించదు. దానిపై అధికారాన్ని 3 కోర్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ వంటి బలమైన సంస్థాగత మద్దతుతో కూడిన దృఢమైన నాయకుడికి అప్పగించాలి.

అస్సాం రైఫిల్స్ అద్భుతంగా పని చేస్తోంది. కానీ అది పక్షపాత దృష్టితో ఉందని అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారు. మణిపుర్ లోయ నివాసితులు దానిని తొలగించాలని కోరారు. మణిపుర్‌లోని అనేక ప్రాంతాల నుండి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం తొలగించబడింది. దాంతో రాష్ట్రంలో ప్రభుత్వేతర శక్తులు చేస్తున్న చర్యలను ఎవరైనా చూడవచ్చు. అస్సాం రైఫిల్స్ ఇప్పటికే 3 కోర్ కార్యాచరణ కమాండ్ కింద ఉంది. కానీ దీనిని ఏకీకృత కమాండ్ వ్యవస్థ(యూసీఎస్)లో భాగం చేస్తే... ఆర్మీ, మణిపుర్ పోలీస్, కేంద్ర పారామిలిటరీ బలగాలతో దాని కార్యాచరణ కదలికలను క్రమాంకనం చేయడానికి అది వీలు కల్పిస్తుంది. అంతేగాక, యూసీఎస్ లోని ఇతర అంతిమ వినియోగదారులకు అనుగుణంగా పటిష్ఠమైన నిఘా వీలవుతుంది.

అన్నీ కలగలిసే...

మణిపుర్, నాగాలాండ్, దక్షిణ అరుణాచల్‌లకు పరస్పరం ముడిపడి ఉన్న సమస్యలే దీనికి కారణం. ఉదాహరణకు, ప్రత్యేక అడ్మినిస్ట్రేటివ్ జోన్లను ఏర్పర్చిన తర్వాత, నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్- ఇసాక్- ముయివా (ఎన్ఎస్‌సీఎన్-ఐఎమ్) సహాయంతో లోయ-ఆధారిత తిరుగుబాటు గ్రూపులు మణిపుర్‌లోకి ప్రవేశించే సమస్యనుంచి ఎవరూ తప్పించుకోలేరు. అలాగే, 'ఈస్టర్న్ నాగా నేషనల్ గవర్నమెంట్' నుండి ఎన్ఎస్‌సీఎన్-ఐఎమ్‌కు లభిస్తున్న మద్దతు వెలుగులోనే, దక్షిణ అరుణాచల్‌లోని తిరప్, చాంగ్లాంగ్, లాంగ్డింగ్ జిల్లాలలో జరిగే కుతంత్రాలను చూడాలి.

భారత రాజ్యం, దాని సైన్యం చాలా శక్తిమంతమైనవి. అవి ఎలాంటి సవాలునైనా ఎదుర్కోగలవు. ఈ క్లిష్ట సమయంలో న్యూఢిల్లీ తీసుకోవాల్సిన ఏకైక చర్య తన బలగాలను బలోపేతం చేయడమే. అసాధ్యమైన వాటిని సాధించగల సామర్థ్యం సైన్యానికి ఉంది. ప్రస్తుతం ఉన్న గందరగోళాన్ని, అనిశ్చితిని ఇలాగే కొనసాగనిస్తే, మణిపుర్ కోలుకోలేని విధంగా నష్టపోతుంది.

వ్యాసకర్త భద్రత – తీవ్రవాద వ్యవహారాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



స్లొవేకియాకు సంఘీభావం



స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో మీద జరిగిన దాడి వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ పిరికి, పిదప చర్యను తీవ్రంగా ఖండిస్తూ, ఫికో వేగంగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. స్లొవాక్ రిపబ్లిక్ ప్రజలకు ఇండియా సంఘీభావం చూపుతోంది.

– నరేంద్ర మోదీ, ప్రధాని

తగిన మనిషి



నేను ట్విట్టర్‌లో పనిచేస్తున్నప్పుడు, ఆ వేదికను బాగా అర్థం చేసుకోవడం కోసం ఒక సింగపూర్ మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి మీటింగ్ అభ్యర్థన వచ్చింది. అరగంట అనుకున్నది గంటన్నర చర్చ నడిచింది. మళ్లీ ఆయన్ని ఈమధ్యే కలిసే భాగ్యం దక్కింది. ఆయన జ్ఞానం, అణకువ, నడత నన్ను ముగ్ధుడిని చేశాయి. నిన్న (15 మే) ఆయన (లారెన్స్ వాంగ్) సింగపూర్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

– పర్మిందర్ సింగ్, వ్యాపారవేత్త

మెజారిటీ దక్కేనా?



ఇప్పుడు ఉన్న స్థితిగతులను బట్టి చూస్తే, బీజేపీ తన మెజారిటీ మార్క్ కంటే అత్యంత దిగువన ఉంది. ఆఖరికి ఎన్డీయేకు కూడా మెజారిటీ దక్కకపోవడమూ సంభవమే.

– యోగేంద్ర యాదవ్, విశ్లేషకుడు

ఎందుకంత పట్టింపు?



నన్ను రంధ్రాన్వేషి అన్నా సరే... ఉన్నట్టుండి బైడెన్(అమెరికా అధ్యక్షుడు) ఎందుకు (ట్రంప్‌తో) డిబేట్ కోసం ఉత్సాహపడుతున్నారు? ఆయన ఏదో ఒకటి చేయాలని ఆత్రంలో ఉన్నారా లేక అదొక నాటకం అయివుండొచ్చా? ఏమైనా దీని మీద ఓ కన్నేసి ఉంచండి.

– వివేక్ రామస్వామి, అమెరికా రిపబ్లికన్ నేత

వార్త కాదా?



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్తానీ భద్రతా దళాల హింస, రక్తపాతాలకు వ్యతిరేకంగా గొంతెత్తిన కశ్మీరీ కవి, కార్యకర్త అహ్మద్ ఫర్హాద్‌ను రావల్పిండి నుంచి పాకిస్తాన్ ఐఎస్ఐ అపహరించుకువెళ్లింది. పాక్, అంతర్జాతీయ మీడియాలో ఈ వార్తే లేదు. విచారకరం.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

దుర్బల మనుషులం



ప్రకృతి శక్తుల ముందు నాగరికత ఎంత దుర్బలమైనదో మనం గ్రహించాలి. ఈ శక్తులను మనం ఎప్పటికీ నియంత్రించలేం. కేవలం వాటి ప్రభావాన్ని మాత్రమే అనుభవించగలం. ప్రకృతిలో ప్రతిదానిలాగానే నాగరికత వస్తుంది, పోతుంది. ఈ భూమ్మీది చరిత్ర మనకు అదే బోధిస్తుంది.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

ఆ మాత్రం నడవరా?



యువతలో స్థూలకాయ సమస్యకు మూలం ఎక్కడుందో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. సన్నం, పొడవు, సగటు– వాళ్లు ఎలాంటివారైనా సరే, మెట్రో స్టేషన్లలో వృద్ధులు, దివ్యాంగుల కోసం కేటాయించిన ఎలివేటర్లలోకి యువకులు దూరుతున్నారు. ఇది చూడటానికే చీదరగా ఉంది. మధుమేహం, గుండె సంబంధిత జబ్బులు కూడా ఎక్కువ అవుతున్నాయంటే ఇంకా ఆశ్చర్యమా?

– అర్షియా మలిక్, రచయిత్రి

ఇన్ బాక్స్

అవిశ్రాంత ఉద్యమశీలి

మార్క్సిస్ట్ – లెనినిస్ట్ నాయకుడు కామ్రేడ్ రాగి సుబ్బారావు రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. దాదాపు 5 దశాబ్దాలకు పైగా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి, పౌర హక్కుల ఉద్యమాలతో మమేకమై ఉంది ఆయన జీవితం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మలితరం మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకుల్లో ప్రముఖుడు. యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) పార్టీ గుంటూరు జోనల్ కమిటీకి కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. సీపీఐ (ఎమ్ఎల్) జనశక్తి నాయకునిగా, సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమోక్రసీ నాయకునిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మార్క్సిస్ట్ లెనినిస్ట్ ఉద్యమ నేతృత్వంలో ఏర్పడిన ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, అఖిల భారత పౌర ప్రజాతంత్ర హక్కుల సంస్థ మహాసభలు గుంటూరులో జరపటంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. భారత్ – చైనా మైత్రి మండలిలో పనిచేశారు. వర్కర్స్ సాలిడారిటీ, ఏఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, ప్రజాస్వామ్య యువజన సంఘం, రైతు కూలీ సంఘం వంటి ప్రజా సంఘాలను నిర్మాణం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. గుంటూరు నగరంలో సిటీ బస్సులు జాతీయాకరణ చేయాలనే పోరాటంలో జైలుకెళ్లారు.


రాగి సుబ్బారావు

1974కు పూర్వమే రాగి సుబ్బారావు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)ల నాయకత్వాన ఉన్న యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) పార్టీ సంబంధాల్లోకి వెళ్ళారు. నాగిరెడ్డి, డీవీ చెప్పిన పొలిటికల్ ఓరియంటేషన్నూ, నిర్మాణ విధానాన్నీ వంట పట్టించుకున్నారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో పోలీసులకు దొరక్కుండా రహస్య జీవితంలోకి వెళ్లారు. ఎమర్జెన్సీ తర్వాత రహస్య జీవితం నుంచి బయటికి వచ్చినా విప్లవమే వృత్తిగా, సమ సమాజమే సిద్ధాంతంగా, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా మారారు. సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలో భాగస్వామ్య సభ్యునిగా ఉంటూ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను కోరుకుంటూ మే ఒకటవ తేదీన అమరులయ్యారు.

– మన్నవ హరిప్రసాద్
సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు
(నేడు గుంటూరులో రాగి సుబ్బారావు సంస్మరణ సభ)

కమలనాథుల ధీమా సడలుతోందా?

అభిప్రాయం


ఎస్. అబ్దుల్ ఖాలిక్

లోక్‌సభ ఎన్నికల్లో అనుకున్న సంఖ్యాబలాన్ని సాధించడంలో భారతీయ జనతా పార్టీ ధీమా సడలుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మొదటి, రెండో విడత పోలింగ్ తరువాత పరిస్థితి ఆశాజనకంగా లేదన్న సంగతి బీజేపీ అగ్రనాయకులకు తెలిసిపోయింది. దీంతో ఒక్కసారిగా ప్రధాని నరేంద్ర మోదీ స్వరం మారిపోయింది. పదేళ్ల పాలనలో ప్రజలకు తాము ఏం చేశామో ఇప్పటికీ ధీమాగా మోదీ చెప్పలేకపోతున్నారు. ముస్లిం రిజర్వేషన్ల రద్దు, పాకిస్తాన్ బూచితో మూడోసారి అధికారంలోకి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ.



మోదీ పదేళ్ల పాలనను పరిశీలిస్తే రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినే అనేక చర్యలు కనిపి స్తాయి. తమకు 400 సీట్ల మెజారిటీని కట్టబెడితే అసలు రాజ్యాంగాన్నే మార్చివేస్తాం అని కొందరు బీజేపీ నాయకులు ప్రకటించే స్థాయికి చేరడం ఈ సందర్భంగా గమనార్హం. 2014లో అచ్ఛేదిన్ పేరుతో మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అంతకు ముందు కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ కూటమి వరుసగా పదేళ్లపాటు అధికారం చలాయించింది. ఈ పదేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాల మయంగా మారింది. ఆ పార్టీ పాలనపై దేశవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి పరోక్షంగా బీజేపీ విజయానికి దారితీసింది. 2019 నాటికి దేశంలో పరిస్థితులు మారిపోయాయి. ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికల ముందు పుల్వామా సంఘటన జరిగింది. అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వెంటనే పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. దీంతో దేశభక్తి వరదలా పొంగింది. ఫలితంగా ఎన్డీఏ కూటమి మరోసారి కేంద్రంలో పాగా వేయగలిగింది.

అయితే 2024 ఎన్నికల సమయానికి పుల్వామా వంటి కలిసివచ్చే సంఘటన ఏదీ ఎన్డీఏ కూటమికి అందుబాటులోకి రాలేదు. దీంతో తానే అవకాశాన్ని సృష్టించుకోదలచింది. ఫలితంగా అయోధ్య ఆలయంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను తెరపైకి తీసుకువచ్చింది. కానీ ఎన్నికలు ప్రారంభ మయ్యేనాటికి అయోధ్య అంశం సృష్టించిన హైప్ చల్లబడింది. అదే సమయంలో పదేళ్లపాటు ప్రధానిగా పనిచేసిన మోదీ... ప్రజలకు తాము చేసింది ఇదీ అని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్క అంశం కూడా లేకుండా పోయింది. దీంతో కమలం పార్టీ 'వికసిత్ భారత్' నినాదం అందుకొంది. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభానికి ముందు ఎన్డీఏ కూటమికి తాము ఆశించినట్లు 400 సీట్లు వస్తాయని కమలనాథులు ఆశించారు. అయితే మొదటి విడత పోలింగ్ ముగియగానే పరిస్థితి నిరాశాజనకంగా ఉందన్న సంగతి బీజేపీ అగ్రనాయకత్వం గుర్తించింది.

దీంతో ఒక్కసారిగా మోదీ ప్రచార తీరు మారింది. రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ అకస్మాత్తుగా ముస్లిం మైనారిటీలపై విషం చిమ్మారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని సంపదనంతా ముస్లిం మైనారిటీలకు దోచి పెడుతుందని హుందాతనం మరచిపోయి ఆరోపించారు. అంతేకాదు మిగిలిన విడతల్లో విజయం కోసం రెండంచెల వ్యూహాన్ని కమలం పార్టీ అమలు చేస్తోంది. ఒకవైపు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం, మరోవైపు సమాజంలో ముస్లిం వ్యతిరేకతను పెంచడం ఈ వ్యూహంలో భాగం. దీంతో యావత్ హిందూ ఓటు బ్యాంక్ బీజేపీకి అనుకూలంగా మారుతుందన్నది బహుశా బీజేపీ ఆలోచన కావచ్చు. తాజాగా ఓటర్లను ఆకట్టుకోవడానికి మరో అస్త్రాన్ని కూడా ప్రయోగించింది కమలం పార్టీ. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పాకిస్తాన్ కోరుకుంటోందన్నది మోదీ చేసిన తాజా కామెంట్. పాకిస్తాన్ ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉంది. దానికి మన రాజకీయాలను పట్టించుకునే తీరిక ఎక్కడ అనేది విశ్లేషకుల మాట. మొత్తంగా ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి పన్నుతున్న ఎత్తుగడలు మన రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా పరిణమించాయని చెప్పవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 63001 74320

తప్పు చేసే దుఃస్థితి రాకుండా...

జరగకూడని నష్టం జరిగినపుడు మనసు అంతులేని దుఃఖంతో నిండిపోతుంది. అయితే, నష్టం ఎంతటిదైనప్పటికీ అతిగా దుఃఖిస్తూ కూర్చోవడం అభిలషణీయం కాదు. దుఃఖం చేత ఆక్రమించబడిన మనస్సు ఆలోచనను పోగొట్టుకుంటుంది. కనుక, ఆలోచనాపరుడు జరిగిన కీడును దీర్ఘకాలం తలపోస్తూ కూర్చోడు. చింతను వదిలి, తనలోని బాధ అనే అగ్నిని వివేకమనే చల్లదనంతో అణిచివేయగల వాడే క్రియాశీలుడౌతాడు. తమకు అత్యంత ప్రియమైన వస్తువు తమది కాకుండాపోవడం, తమకు అత్యంతగా కష్టం కలిగించేది జరగడం అన్నవి 'నిత్యానిత్య వివేకహీనులైన' అల్పాశయులకు, అనగా చాలా తక్కువ ఆశయ పరిధి కలిగినటువంటి సాధారణ మానవులకు, అమితమైన దుఃఖాన్ని కలిగిస్తాయి. మానవ శరీరం ఒక రథం వంటిది. దానికి సారథి బుద్ధి. కరచరణాది ఇంద్రియాలు గుర్రాలు. హితం కాని విషయాలను సైతం ఊహించగలిగిన బుద్ధి చేసే ఆలోచనలు పగ్గాలు. ఎన్నెన్నో బాధలకు గురిచేసి ఎంతో దుఃఖాన్ని నింపే సామర్థ్యం కలిగినదిగా ఉంటుంది ఆ రథం. ఆ కారణంగానే జ్ఞానవంతులైన మనుషులు వివేకమనే మందుతో ఆ రథాన్ని తమ అధీనంలో ఉంచుకుంటారు. ప్రాణులన్నీ అశాశ్వతములే అన్న ధర్మాన్ని ఎప్పుడూ వింటూనే ఉంటాం. ధైర్యం నిండిన మనస్సుతో ఆ ధర్మాన్ని ఆచరించడం మొదలుపెట్టాలి. ఆ జ్ఞానమే అన్ని దుఃఖాలను పోగొట్టి మనసుకు సాంత్వనను కలుగజేస్తుంది. దైవసంకల్పంగా సంభవించే పరిణామాలను ఎవరూ ఆపలేరు. అవి దైవం సంకల్పించినట్లే జరుగుతాయి. కనుక లోకం దృష్టిలో చివరిదాకా గౌరవంగా మనగలగాలంటే, ఎంతటి శోకాన్నైనా తట్టుకుని నిలబడాలి. ఆ స్థితిని సాధించడానికి ఆంధ్ర మహాభారతం, స్త్రీపర్వంలోని ఈ కందపద్యం మార్గాన్ని చెప్పింది.



తన మేలు గీడు దా మది
గనుచు, హితులు సెప్పు బుద్ధి గైకొని శుభముం
గొనకొని నడుపు పతికి వ
చ్చునె పశ్చాత్తప మెట్టి చోట? నరేంద్రా!

ఎప్పటికప్పుడు తన మంచిచెడులను తానే గుర్తించి బేరీజు వేసుకుంటూ, హితులు చెప్పే మాటలను పెడ చెవిన పెట్టక గ్రహించి ఆచరిస్తూ, శుభాన్ని సాధించే వ్యక్తికి ఎప్పుడూ చేసిన తప్పుకు చింతించాల్సిన అవసరం కలగదు. అనగా అసలు తప్పు చేసే పరిస్థితి రాదు అని తిక్కన రచనలో అంతరార్థంగా చెప్పబడిన మంచి విషయం!

– భట్టు వెంకటరావు

కొండపిలో పొగాకుకు రూ.302 గరిష్ట ధర

- వేలం కేంద్రం చరిత్రలోనే రికార్డు



సింగరాయకొండ: కొండపి పొగాకు వేలం కేంద్రం చరిత్రలోనే రికార్డు స్థాయిలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.302 పలికింది. గురువారం నిర్వహించిన వేలంలో ఈ రికార్డు నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,158 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వాటిలో 1,129 బేళ్లను విక్రయించగా, వివిధ కారణాలతో వ్యాపారులు 29 బేళ్లను తిరస్కరించారు. కాగా, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ. 277.18 పలికింది. ఈసీజన్‌లో ఇప్పటి వరకు జరిగిన వేలంలో గురువారం రైతులకు అత్యధిక ధర దక్కిందని సునీల్ కుమార్ తెలిపారు.

భార్యను బెదిరించబోయి ఉరి బిగిసి..

- జిమ్ ట్రైనర్ మృతి



అమిత్ కుమార్ (ఫైల్)

యశవంతపుర: గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్యకు వీడియో కాల్ చేసి తిరిగి రావాలని అర్థించాడు ఓ భర్త. దీనికి ఆమె నిరాకరించడంతో బెదిరించాలని ఉరేసుకోబోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు బాగలగుంటెలో చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన అమిత్‌కుమార్ సాహ (28) దాసరహళ్లిలో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం హసన్‌కు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. చదువు నిమిత్తం భార్యను నర్సింగ్ కోర్సులో చేర్చాడు. ఆమె నిరంతరం ఫోన్‌లో స్నేహితులతో మాట్లాడుతూ తనను పట్టించుకోకపోవడంతో భార్యతో గొడపడేవాడు. ఇద్దరి మధ్య గొడవలు పెరగడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో గురువారం అమిత్ భార్యకు వీడియో కాల్ చేసి ఇంటికి రావాలని బతిమాలాడు. రాకపోతే ఉరి వేసుకొని చనిపోతానని బెదిరించాడు. ఇంతలో చేతిలోని మొబైల్ ఫోన్ కింద పడటంతో పాటు గొంతుకు ఉరి బిగిసి మృత్యువాత పడ్డాడు.

డీబీటీ పథకాల చెల్లింపులు ప్రారంభం

వైఎస్సార్ ఆసరాకు రూ.1,480 కోట్లు విడుదల

- జగనన్న విద్యా దీవెనకు రూ.502 కోట్లు చెల్లింపు
- పోలింగ్‌కు ముందు నిధుల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబు బ్యాచ్
- పోలింగ్ ముగియడంతో పేద లబ్ధిదారులకు నిధులు చెల్లిస్తున్న సర్కారు
- రెండు మూడు రోజుల్లో మొత్తం పథకాల చెల్లింపులు పూర్తి



సాక్షి, అమరావతి: చంద్రబాబు అండ్ కో కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాన్ని వమ్ము చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల డీబీటీ చెల్లింపులను ప్రారంభించింది. వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా తదితర పథకాల లబ్ధిదారులకు చివరి దశ చెల్లింపులను చంద్రబాబు బృందం అడ్డుకుంది. పేదల పొట్ట కొట్టేలా పోలింగ్‌కు ముందు పచ్చ బ్యాచ్ ఫిర్యాదులు చేయడంతో డీబీటీ చెల్లింపులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నిలిపివేసింది. పోలింగ్ ముగిసిన తరువాత చెల్లింపులు చేయాలని, పోలింగ్‌కు ముందు చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకాలు గత ఐదేళ్ల నుంచి అమల్లో ఉన్నవేనని, కొత్తవి కాదని, లబ్ధిదారులు కూడా పాతవారే తప్ప కొత్తవారు కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పినప్పటికీ, చంద్రబాబు బృందానికి అనుకూలంగా ఈసీ వ్యవహరించింది. పోలింగ్ ముగియడంతో పేద లబ్ధిదారులకు మేలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డీబీటీ పథకాల చెల్లింపులను ప్రారంభించింది. పొదుపు సంఘాల మహిళల కోసం రూపొందించిన వైఎస్సార్ ఆసరా పథకం నిధులు రూ.1,480 కోట్లను డీబీటీ ద్వారా వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం జగనన్న విద్యా దీవెన కింద డీబీటీ ద్వారా రూ.502 కోట్లు చెల్లించింది. మరో రెండు మూడు రోజుల్లో మిగతా పథకాల చెల్లింపులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయనుంది.

ముందే అనుమతి కోరినా సాగదీసి..

నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న పథకాల లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ కోసం పోలింగ్ తేదీకి చాలా ముందే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి కోరింది. తెరవెనుక చంద్రబాబు అండ్ కో చేసిన మంత్రాంగంతో ఎన్నికల సంఘం ఇదిగో అదిగో అంటూ పోలింగ్ సమయం వచ్చేంతవరకూ అనుమతిపై ఎటూ తేల్చకుండా సాగదీసింది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఈ పథకాల లబ్ధిదారులకు చెల్లింపులు చేయవద్దంటూ ఉత్తర్వులిచ్చింది. దీని వెనుక పచ్చ బ్యాచ్ ఒత్తిడి ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఎన్నికల సంఘం తీరుపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఈసీ ఉత్తర్వులను ఈనెల 10వ తేదీన ఒకరోజు నిలిపివేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే పథకాల డీబీటీ చెల్లింపులకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయితే, హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరిన్ని వివరణలు కోరింది. ఈసీ తీరుపై హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, 10వ తేదీన సమయం మించిపోవడంతో లబ్ధిదారులకు పథకాల మేలు నిలిచిపోయింది. ఇప్పుడు పోలింగ్ ముగియడంతో పేదలకు నగదు చెల్లింపులను ప్రారంభించింది. దీని ద్వారా ఎన్నికల కోసం ఈ పథకాలను అమలు చేయడంలేదని రాష్ట్ర ప్రభుత్వం నిరూపించిందనే అభిప్రాయాన్ని అధికారవర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దుర్గమ్మ సేవలో హైకోర్టు జడ్జిలు



జస్టిస్ రవి, జస్టిస్ శ్యాంసుందర్‌లకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ బి.శ్యాంసుందర్ గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం న్యాయమూర్తులకు వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో కేఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

కానిస్టేబుల్‌పై టీడీపీ కార్యకర్తల దాడి.. దూషణ

డక్కిలి: పోలింగ్ డే అయిన 13వ తేదీన తిరుపతి జిల్లా డక్కిలి మండలం ఆల్తూరుపాడులో టీడీపీ కార్యకర్తలు కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు..ఆల్తూరుపాడు ప్రాథమిక పాఠశాల (పోలింగ్ స్టేషన్ 212)లో 13న ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్న తిరుపతి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఐ.జనార్థన్‌పై టీడీపీ కార్యకర్తలు కాసరం చైతన్యరెడ్డి, కె.శివయ్య, వేముల మునిబాబు, ముద్దా సురేష్‌రెడ్డి, ఎం.శివారెడ్డి, మల్లికార్జున, జి.మునయ్య, కె.వినయ్, వి.మోహన్, జయరామయ్యలు దాడి చేశారని పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ ఎన్నికల విధులు నిర్వహిస్తుండగా.. గ్రామానికి చెందిన శివయ్య పోలింగ్ కేంద్రం లోపల తిరుగుతుండగా గమనించిన కానిస్టేబుల్ శివయ్యను పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లు దూరంగా ఉండాలని ఆదేశించడంతో తాను ఏజెంట్‌ని ఏం చేస్తావ్ అని కానిస్టేబుల్‌పై శివయ్య దౌర్జన్యానికి దిగాడు. ఏజెంట్ అయితే ఐడీ కార్డు చూపించాలని కానిస్టేబుల్ నిలదీయడంతో టీడీపీ కార్యకర్తలంతా అతడిని చుట్టుముట్టి ఆపై చంపేస్తామని బెదిరించి పరుష పదజాలంతో దూషించారు. దీంతో కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఆల్తూరుపాడుకి చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చౌడయ్య చెప్పారు.

వైఎస్సార్‌సీపీదే మరోసారి అధికారం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి

ఎంవీపీ కాలనీ (విశాఖ): రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీదే అధికారమని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝూన్సీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తున్నాయ న్నారు. గత ఎన్నికల కంటే ఒక్క సీటైనా వైఎస్సార్‌సీపీ ఎక్కువ గెలుస్తుందన్నారు. ఎంపీ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఏకపక్ష విజయాన్ని నమోదు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని అమర్‌నాథ్ చెప్పారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో భారీగా ఓట్లు పోలైన అంశంపై మంత్రి అమర్‌నాథ్‌ను విలేకరులు ప్రశ్నించగా.. గడచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమం, చేసిన మేలుకు కృతజ్ఞతగా పెద్దఎత్తున గ్రామీణ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఓటేశారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజయంపై ప్రశ్నించగా.. కడపలో ఆమెకు డిపాజిట్లు కూడా రావన్నారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో అధికారం చేపట్టేందుకు ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ సీట్లు రావన్న అమర్‌నాథ్, కేంద్రంలో ప్రభుత్వాన్ని నెలకొల్పే పార్టీకి వైఎస్సార్‌సీపీ మద్దతు కచ్చితంగా అవసరమవుతుందన్నారు.

భారత మూడో ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్...'ఐఎన్ఎస్ విశాల్'

రూ.50 వేల కోట్లతో నిర్మాణం..
2030 కల్లా అందుబాటులోకి



సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు భారత్ వినూత్న వ్యూహాలతో దూసుకువెళుతోంది. యుద్ధ విమాన వాహక నౌకల విషయంలో వెనుకబడి ఉన్న భారత్..ఆ లోటును భర్తీ చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ల విషయంలో చైనా దూకుడుగా ఉన్న నేపథ్యంలో ఐఎన్ఎస్ విక్రాంత్ మాదిరిగా..మరో షిప్ ఐఎన్ఎస్ విశాల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసేందుకు ప్రణాళికలు రచించింది. దీంతో పాటు మరో 3 ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ (ఐఏసీ)లు రూపొందించేందుకు విధివిధానాల్ని రక్షణ శాఖ నిర్ణయించింది. రక్షణ వ్యవస్థకు ఎన్నడూ లేని విధంగా కేంద్రం బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో..అధునాతన ఆయుధ, నౌకా సంపత్తిని సొంతం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మూడో, అతి పెద్ద ఐఏసీకి సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత నౌకాదళం ప్రస్తుతం ఉన్న ఐఏసీ–2 విక్రాంత్ కంటే పెద్దదిగా ఉండే మూడో స్వదేశీ విమాన వాహక నౌక కోసం అధ్యయనం పూర్తయింది. ప్రస్తుతం ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లు సేవలందిస్తున్నాయి. విక్రమాదిత్య జీవితకాలం మరో నాలుగేళ్లలో ముగిసే అవకాశం ఉండటంతో ఈలోగా కొత్త ఐఏసీని అందుబాటులోకి తీసుకురావాలని నేవీ అధికారులు భావిస్తున్నారు.

విక్రాంత్ కంటే భారీగా విశాల్: తదుపరి నిర్మించబోయే యుద్ధ విమాన వాహక నౌక..దేశంలోనే అతిపెద్ద ఐఏసీగా నిర్మించాలని నేవీ నిర్ణయించింది. దీనికి ఐఎన్ఎస్ విశాల్‌గా నామకరణం చేసింది. ప్రస్తుతం ఉన్న విక్రాంత్ పరిమాణం 44,000 టన్నులు కాగా.. మూడో నౌక విశాల్‌ని 65,000 టన్నుల వరకు నిర్మించాలని భావిస్తోంది. కొత్త సాంకేతికతలతో కూడిన కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కాటాపుల్ట్ సిస్టమ్ (హైడ్రాలిక్‌తో నడిచే) ద్వారా ల్యాండింగ్ అయ్యే విధంగా నౌకా నిర్మాణ సౌకర్యాన్ని అప్‌గ్రేడ్ చేయనుంది. విక్రాంత్‌ని తయారు చేసిన కొచ్చి షిప్‌యార్డులోనే విశాల్‌ని తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి రూ.50 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. జూలై తర్వాత విశాల్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చైనాకు దీటుగా: హిందూ మహాసముద్రంలో చైనా కవ్వింపు చర్యలు దేశ రక్షణ వ్యవస్థకు కంటగింపుగా మారుతున్న నేపథ్యంలో వైమానిక శక్తిని ఒకవైపు మలక్కా జలసంధి, మరోవైపు ఏడెన్ గల్ఫ్ వంటి సుదూర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరముంది. ఈ తరుణంలో ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లని అన్ని వైపులా మోహరించాల్సి ఉంటుంది. పశ్చిమ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తోన్న విక్రమాదిత్యని, తూర్పు తీరంలో గస్తీ కాస్తోన్న విక్రాంత్‌ని మలక్కా, ఏడెన్ ప్రాంతాల్లో మోహరింపజేస్తే..భారత సముద్ర జలాల్లో మరో ఐఏసీ అవసరమవుతుంది. అందుకే..కొత్త షిప్‌ని నిర్మించాల్సి ఉంటుందని నేవీ భావిస్తోంది. చైనా అమ్ముల పొదిలో లియానింగ్, షాన్‌డాంగ్ అనే ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్స్ ఉన్నాయి. మూడో కేరియర్ ఫుజియాన్ సీ ట్రయల్స్ కూడా పూర్తి చేసుకుంది. ఇది యూకే, ఫ్రాన్స్, భారత్‌లో ఉన్న ఐఏఎఫ్‌ల కంటే అతి పెద్దది. ఈ క్రమంలో భారత్ కూడా మరో ఐఏఎఫ్ కోసం సిద్ధమవుతోంది. 2030 కల్లా విశాల్‌ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

పల్నాడులో కొనసాగుతున్న 144 సెక్షన్

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా గురువారం సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలు, సీఆర్‌పీఎఫ్ దళాలు పహారా కాశాయి. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తూ ప్రజల రాకపోకలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఉదయం కొన్ని గంటలు మాత్రమే దుకాణాలు తెరిచారు. ఆ సమయంలో ప్రజలు అవసరమైన నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. జిల్లాలోని ముఖ్యమైన నేతలు హౌస్ అరెస్ట్‌లోనే ఉన్నారు. మరోవైపు ఏ సమయంలో టీడీపీ రౌడీ మూకలు దాడులు చేస్తాయోనన్న భయంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు భయాందోళన చెందుతున్నారు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో టీడీపీకి ఓటు వేయలేదన్న అక్కసుతో ఆ పార్టీ కార్యకర్తల దాడిలో గాయపడి ఊరు వదిలి వెళ్లిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇంకా గ్రామాలకు చేరుకోలేదు.

పల్నాడు జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉంది

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. హింసాత్మక ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీపీ ఎస్.నిర్మల్‌కుమార్ కోర్టుకు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను రంగంలోకి దించామని, అన్నిచోట్లా 144 సెక్షన్ విధించామని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. శాంతి భద్రతల పరిరక్షణకు చట్ట ప్రకారం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాలంది. పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనల నేపథ్యంలో కొత్తపేటకు చెందిన నలబోతు రామకోటేశ్వరరావు దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ జరిపి ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ పరిష్కరించారు.

పులివర్తి నానికి భద్రత కల్పించాం

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేశామని, కోర్టు వారికి రిమాండ్ విధించిందని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. తనపై హత్యాయత్నం జరిగిన నేపథ్యంలో తమకు తగిన భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పులివర్తి నాని, ఆయన భార్య, కుమారుడు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ జరిపారు. నానికి భద్రత కల్పించామని, ఆయన ఇంటి వద్ద పికెట్ కూడా ఏర్పాటు చేశామని ఏజీపీ నిర్మల్‌కుమార్ కోర్టుకు తెలపగా.. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు.

గోపిరెడ్డి హత్యకు చదలవాడ కుట్ర..!

ఎమ్మెల్యే దొరక్కపోవడంతో ఆయన మామపై హత్యాయత్నం



టీడీపీ రౌడీ మూకల దాడిలో గాయపడిన ఎమ్మెల్యే గోపిరెడ్డి మామ కంజుల రామకోటిరెడ్డి



పోలింగ్ రోజున ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి చేసి కారును ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండాలు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట టౌన్: నరసరావుపేటలో రాజకీయాలను 'పచ్చ' దండు వ్యక్తిగత కక్షగా మార్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఓటమి భయంతో టీడీపీ అరాచకం సృష్టిస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు.. చివరకు ఓటు వేసిన వారి ఇళ్లపై విధ్వంసానికి పూనుకుంది. పల్నాడు ప్రాంతంలో ఎన్నికలప్పుడు ప్రధాన పార్టీల మధ్య గొడవలు ఎన్నో ఏళ్లుగా రగులుతూనే ఉంటాయి. ఎన్నికల అనంతరం ఆ పగలు చల్లారి, అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉంటారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం తెలుగుదేశం పార్టీ నాయకత్వం సరికొత్త ప్రతీకారానికి తెర తీసింది. గత ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకుని మరోసారి పోటీకి దిగిన నరసరావుపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబుకు మళ్లీ ఓటమి ఖాయమని పోలింగ్‌కు ముందే అన్ని సర్వేలు తేల్చాయి. దీంతో ఆయన వెన్నులో వణుకు పుట్టింది. ఈ క్రమంలో ప్రత్యర్థిని అడ్డు తొలగించుకుంటే తన గెలుపు ఖాయమని భావించి, నరసరావుపేటలో విధ్వంసానికి ప్రణాళిక రచించారని సమాచారం. ఇందులో భాగంగా పోలింగ్ రోజున నరసరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి సుమారు 200 మంది టీడీపీ రౌడీలు మారణాయుధాలతో పట్టపగలు దాడికి వెళ్లారు. ఆ సమయంలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటిరెడ్డిపై దాడికి తెగబడ్డారు. ఈ సంఘటనపై అరవింద్‌బాబుతో పాటు మరో 30 మందిపై నరసరావుపేట టూటౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మట్టుబెట్టాలనే పథకంతోనే ఆయన ఇంటిపైకి దాడికి వచ్చినట్లు తెలిసింది. ఈ దాడికి ఇతర రాష్ట్రాల నుంచి బౌన్సర్లు, కిరాయి రౌడీలను అరవింద్ బాబు పోలింగ్ ముందు రోజు రాత్రికే రప్పించినట్లు సమాచారం.

అరవింద బాబు ఇంట్లో పెట్రోల్ బాంబులు, వేట కొడవళ్లు

గొడవల నేపథ్యంలో పోలింగ్ అనంతరం టీడీపీ అభ్యర్థి అరవింద బాబును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో (ఇల్లు, ఆస్పత్రి ఒకచోటే) సోదాలు నిర్వహించగా.. పెట్రోల్ బాంబులు, ఇనుప రాడ్లు, వేట కొడవళ్లు, కంకర రాళ్లు, ఇతర మారణాయుధాలు దొరికాయి. పోలింగ్‌కు ముందుగానే వీటిని తీసుకొచ్చి ఉంచినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లోనూ ఓటమి ఖాయమని తేలడంతో గోపిరెడ్డిని అడ్డు తొలగించుకోవాలనే మారణాయుధాలు తెప్పించినట్లు తెలిసింది. మారణాయుధాలకు సంబంధించిన వీడియోలు రెండు రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయినా పోలీసులు ఇందుకు సంబంధించి ఎటువంటి కేసు నమోదు చేయకపోవడం గమనర్హం. పోలీసు పెద్దల అనుమతి రాకపోవడం వల్లే అరవింద్‌బాబుపై కేసు నమోదు కాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా నరసరావుపేటలో అల్లర్ల కారణంగా రెండు రోజుల పాటు దుకాణాలు బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉంది. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ స్వార్థ రాజకీయాల కోసం తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇలాగైతే తామెలా బతకాలని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంద మందికి పైగా పచ్చ గూండాలపై కేసులు

- చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లిల్లో విధ్వంసంపై చర్యలు
- అల్లరిమూకల అరెస్టుకు రంగం సిద్ధం



సోమవారం రాత్రి కూచువారిపల్లిలో దగ్ధమవుతున్న కారు (ఫైల్)

చంద్రగిరి/తిరుపతి లీగల్: ఎన్నికల నేపథ్యంలో సోమవారం తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లిల్లో టీడీపీ నాయకుల విధ్వంసకాండపై పోలీసులు కేసులు నమోదు చేశారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ బాధితుల ఫిర్యాదు మేరకు రెండు వర్గాలకు చెందిన పలువురిపై కేసులు పోలీసులు నమోదు చేసినట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్‌రెడ్డి, పీఏ వేణు గోపాల్‌రెడ్డిపై దాడి చేసి గాయపరచడంతో పాటు వారిని నిర్బంధించిన ఘటనపైనా కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇదే దుర్ఘటనలో సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు అయన అనుచరుల్ని తీవ్రంగా గాయపర్చడంతో పాటు హత్యాయత్నానికి పాల్పడి, సర్పంచ్ ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలను దోచుకెళ్లి, ఇంటిని పూర్తిగా కాల్చి ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుమారు 100 మందికి పైగా పచ్చగూండాలపై కేసులు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

విధ్వంసకాండపై కేసుల నమోదు

రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లిల్లో చోటు చేసుకున్న విధ్వంసకాండపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లు, కత్తులతో దాడులు చేసి తీవ్రంగా గాయపరచడం, వాహనాలకు నిప్పంటించడం, ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దాడులకు పాల్పడటం, ఇంట్లోని విలువైన బంగారం, వెండి, నగదుతో పాటు ఇతర వస్తువులను దోచుకెళ్లడం, ఇళ్లను ధ్వంసం చేసి, దగ్ధం చేయడం వంటి ఘటనలపై సెక్షన్ 143, 147, 452, 427, 323, 324, 380, 435, 436, ఐపీసీ రెడ్‌విత్ 149 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఆ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

హింసాకాండ ఘటనలో 13 మందికి రిమాండ్

శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వద్ద వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతల మధ్య జరిగిన ఘటన కేసులో ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు 13 మందిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఈనెల 29 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

తాడిపత్రి పల్లెల్లో భయం.. భయం

- కేసులు నమోదు చేస్తారంటూ పుకార్లు
- ఇళ్లు వదలి వెళ్తున్న యువకులు, నాయకులు, కార్యకర్తలు
- నిర్మానుష్యంగా మారిన గ్రామాలు



నిర్మానుష్యంగా మారిన వరదాయపల్లి

తాడిపత్రి టౌన్: 'ఏమ్మా.. నీకొడుకు ఇంట్లో లేడా వస్తే ఓ సారి స్టేషన్‌కు రమ్మను....ఏరా ఎక్కడున్నావ్..సార్ పిలుస్తున్నాడు స్టేషన్‌కు వచ్చి కనపడు' అని పోలీసులు చెబుతుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. పోలింగ్ తర్వాత తాడిపత్రిలో చెలరేగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం గ్రామాల్లో జల్లెడపడుతున్నారు. దీంతో పోలీస్ బూటు చప్పుళ్ల మధ్య పల్లెల్లో భయం భయంగా బ్రతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల అనంతరం తాడిపత్రి పట్టణంలో నెలకొన్న అల్లర్ల కేసులతో పల్లెల్లో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నియోజకవర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లోని గ్రామాల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు. యువకులు కనిపిస్తే చాలు పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళుతుండడంతో గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు యువకులు గ్రామాలు వదిలి పారిపోతున్నారు. దీంతో గ్రామాల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు మాత్రమే కనిపిస్తూ గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. తమ పిల్లలు ఎక్కడున్నారో..ఏం చేస్తున్నారో..ఎప్పుడు ఏం జరుగుతుందోనని వృద్ధ తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తాడిపత్రి పట్టణంలో జరిగిన అల్లర్లకు తమ పిల్లలకు ఏం సంబంధమని కొంతమంది యువకుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యం, ఏకపక్ష ధోరణి, ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే తాడిపత్రిలో అల్లర్లు జరిగాయని జనం చెబుతున్నారు. ఎప్పుడు ఈ సమస్య సద్దుమణుగుతుందో..తమ పిల్లలు ఎప్పుడు ఇంటికి వస్తారోనని పల్లెల్లో వృద్ధులు ఎదురు చూస్తున్నారు.

తాడిపత్రి ఘటనలో 91 మందికి రిమాండ్

- టీడీపీకి చెందిన 54 మంది, వైఎస్సార్‌సీపీకి చెందిన 37 మందిపై కేసు
- ఉరవకొండ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- అనంతపురం జిల్లా జైలుకు తరలించాలని జడ్జి ఆదేశం



నిందితులను కోర్టులోకి తీసుకెళ్తున్న పోలీసులు

విడపనకల్లు: పోలింగ్ అనంతరం తాడిపత్రిలో జరిగిన అల్లర్లకు సంబంధించి టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు చెందిన 91 మందిని పోలీసులు గురువారం అరెస్టు చేసి ఉరవకొండ సివిల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి ఎదుట హాజరు పరిచారు. జడ్జి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని రెడ్డిపల్లిలోని అనంతపురం జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించారు. అయితే అక్కడ సౌకర్యాలు సరిగా లేవని, శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అనంతపురం ఎస్పీ అమిత్ బర్దర్ జడ్జికి తెలిపారు. అందువల్ల నిందితులను కడప కేంద్ర కారాగానికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు జడ్జి నిరాకరించారు. జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించారు.

కోర్టు వద్ద భారీ భద్రత

అల్లర్ల ఘటనలో నిందితులను ఉరవకొండకు తీసుకువస్తున్నారన్న సమాచారంతో ఉదయం నుంచి కోర్టు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నిందితుల బంధువులు భారీగా కోర్టు వద్దకు తరలివచ్చారు. పోలీసులు ఉదయమే ఉరవకొండ కోర్టు ఆవరణను ఆధీనంలోకి తీసుకున్నారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియాను కూడా లోనికి అనుమతించలేదు. సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీకి చెందిన 37 మందిని, టీడీపీకి చెందిన 54 మందిని పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. అల్లర్లకు పాల్పడిన వారిపై ఐపీసీ 143, 147, 324, 307, 363 ఆర్‌డబ్ల్యూ149 కింద కేసులు నమోదు చేశారు.

ఎలాంటి మినహాయింపులు లేవు!

కేజ్రీవాల్‌కు బెయిల్‌పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు బెయిల్ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవని సర్వోన్నత న్యాయస్థానం గురువారం స్పష్టంచేసింది. అయితే తీర్పుపై విమర్శనాత్మకమైన సమీక్ష వైఖరిని స్వాగతిస్తున్నామని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. మరోవైపు బెయిల్ తర్వాత ఎన్నికల ర్యాలీల్లో కేజ్రీవాల్ చేస్తున్న ప్రసంగాలను తప్పుబడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన వాదనలను, ప్రసంగాలను సమర్థిస్తూ కేజ్రీవాల్ తరఫు లాయర్లు చేసి వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకునేందుకు నిరాకరించింది. '' ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. ఏదైతే న్యాయంగా తోచిందో దానిని ఉత్తర్వుల రూపంలో మేం వెల్లడించాం'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈడీ అభ్యర్థన తిరస్కరణ

'' ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తే జూన్ రెండో తేదీన తాను మళ్లీ జైలుకు వెళ్లాల్సిన అవసరం రాదని ఎన్నికల ర్యాలీల్లో కేజ్రీవాల్ చెబుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకోండి'' అని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. దీనిపై కోర్టు..' అది అంతా ఆయన ఊహ మాత్రమే. ఈ విషయంలో మేం ఇకపై ఏమీ చెప్పదల్చుకోలేదు'' అని ఈడీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ''తీర్పుపై విమర్శనాత్మకమైన సమీక్ష వైఖరికి అడ్డుచెప్పం. తీర్పుపై విమర్శలను మేం స్వాగతిస్తున్నాం. '' అని కోర్టు వ్యాఖ్యానించింది. '' ఆయన ఏ రోజున లొంగిపోవాలనేది మా ఉత్తర్వులో స్పష్టంగా ఉంది. ఇది స్వయంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్. ఈ ఉత్తర్వు ద్వారానే చట్టం అమలవుతుంది'' అని కోర్టు తెలిపింది. '' సొంత ఊహలతో బెయిల్ షరతులను ఆయన ఉల్లంఘిస్తున్నారు. ఆయన ఏం చేద్దామనుకుంటున్నారు? వ్యవస్థకు చెంపపెట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు'' అని సొలిసిటర్ జనరల్ ఆరోపించారు. '' ఆయన జూన్ రెండో తేదీన తప్పకుండా లొంగిపోవాల్సిందే. అయితే ఈ కేసు గురించి ఆయన మాట్లాడొచ్చు అనిగానీ మాట్లాడకూడదు అని గానీ మేం బెయిల్ ఉత్తర్వుల్లో పేర్కొనలేదు'' అని ధర్మాసనం వెల్లడించింది.



అమిత్ షా సంగతేంటి?: కేజ్రీవాల్ లాయర్

''సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ప్రత్యేక ట్రీట్‌మెంట్ జరిగినట్లు అనిపిస్తోంది. ఈయన బెయిల్ ఇతరుల సాధారణ బెయిల్ మాదిరి కనిపించట్లేదు. నేనే కాదు దేశంలో చాలా మంది ఇలాగే భావిస్తున్నారు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్న మాటలను కేజ్రీవాల్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు గుర్తుచేశారు. ఆయన సంగతేంటి?అని ప్రశ్నించారు. ఆ విషయం జోలికి తాము వెళ్లదల్చుకోలేదని ధర్మాసనం తెలిపింది. '' ఆప్‌కు ఓటేయకపోతే జైలుకు వెళ్లక తప్పదేమో అని కేజ్రీవాల్ అనలేదు. కావాలంటే ఆమేరకు కోర్టులో అఫిడవిట్ సైతం సమర్పిస్తాం '' అని సింఘ్వీ తెలిపారు.

మద్యం కేసులో కేజ్రీవాల్, ఆప్‌పై చార్జ్‌షీట్ వేస్తాం: ఈడీ

ఢిల్లీ మద్యం కుంభకోణంలో త్వరలోనే కేజ్రీవాల్, ఆప్‌పై చార్జ్‌షీట్ దాఖలుచేస్తామని సుప్రీంకోర్టుకు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు గురువారం తెలిపారు. మనీ లాండరింగ్ కేసులో తన అరెస్టును సవాల్‌చేస్తూ సుప్రీం కోర్టులో కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన సందర్భంగా కోర్టుకు ఈడీ ఈ విషయం తెలిపింది. ఈడీ కేసులో ఆప్‌ను నిందితుల జాబితాలో చేర్చుతామని ఇప్పటికే ఢిల్లీ హైకోర్టుకు సైతం ఈడీ తెలిపింది.

అమిత్ షా వ్యాఖ్యలు అభ్యంతరకరం: కపిల్ సిబల్

కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో స్పెషల్ ట్రీట్‌మెంట్ జరిగి ఉండొచ్చని అమిత్ షా మాట్లాడటం చాలా అభ్యంతరకరమని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. ''ఈ వ్యాఖ్యల ద్వారా అమిత్ ఏకంగా సుప్రీంకోర్టు జడ్జీల ఉద్దేశాన్నే ప్రశ్నిస్తున్నారు. జనం ఇలా అనుకుంటున్నారని ఆయన ఇంటర్వ్యూలో చెప్పారు. జనం మాటను మీరు(అమిత్) నమ్మకపోతే ఇంటర్వ్యూలో చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? జనం మాటను మీరు నమ్మితే మీ అభిప్రాయంగానే ఇంటర్వ్యూలో చెప్పాలిగానీ జనాన్ని ఎందుకు మధ్యలో లాగుతారు?'' అని నిలదీశారు.

ఎలక్షన్ బీట్



గురువారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మీడియాతో మాట్లాడుతున్న ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్

రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తోంది: కేజ్రీవాల్

లక్నో: ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400పైగా సీట్లు సాధించి రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీ చూస్తోందని ఆప్ అగ్ర నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే హోంమంత్రి అమిత్ షా ప్రధాని అవుతారని, యోగి ఆదిత్యనాథ్‌ను యూపీ సీఎం పదవి నుంచి తొలగిస్తారని పునరుద్ఘాటించారు. 'అధికారంలోకి వస్తే భారీ కార్యక్రమం ఒకటుంటుందని బీజేపీ చెబుతోంది. రిజర్వేషన్లను తొలగించడమే ఆ కార్యక్రమం. రిజర్వేషన్లకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ఎల్లప్పుడూ వ్యతిరేకమే. మళ్లీ ఆ పార్టీకే అధికార పగ్గాలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతుంది'అని ఆయన అన్నారు. గురువారం కేజ్రీవాల్ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 'బీజేపీలో 75 ఏళ్లు దాటిన ఏ నేతకు కూడా ప్రభుత్వంతోపాటు పార్టీలో ఎలాంటి పదవులు ఇవ్వబోమని, అటువంటి వారు రిటైర్ కావాల్సిందేనంటూ ప్రధాని మోదీ నిబంధన తెచ్చారు. ఈ ప్రకారమే ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి నేతలు కొందరు రిటైరయ్యారు. మరికొందరిని తొలగించడమో, ఎన్నికల్లో టికెట్ నిరాకరించమో జరిగింది. మోదీ ఈ నిబంధన అమలుకు కృషి చేస్తున్నారు'అని కేజ్రీవాల్ ఆరోపించారు. తనకు అడ్డుగా ఉంటారనుకున్న శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజె, రమణ్ సింగ్, దేవేంద్ర ఫడ్నవీస్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారి కథను మోదీ ముగింపునకు తెచ్చారని విమర్శించారు. 'అమిత్ షాకు ఆదిత్యనాథ్ అడ్డుగా ఉన్నారు. బీజేపీయే మళ్లీ అధికారంలోకి వస్తే రెండు నెలల్లోనే యూపీ సీఎం ఆదిత్యనాథ్‌ను సైతం పక్కన బెట్టడం ఖాయం'అని కేజ్రీవాల్ అన్నారు.

చీపురుకు ఓటేస్తే..జైలుకెళ్లాల్సిన పనుండదు

అమృత్‌సర్: తాను మళ్లీ జైలుకు వెళ్లరాదని భావిస్తే ఆప్‌కే ఓటేయాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రజలను కోరారు. గురువారం ఆయన పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. 'నేను జైలుకు వెళ్లాలా వద్దా అనేది మీ చేతుల్లోనే ఉంది. చీపురు గుర్తు బటన్‌ను మీరు నొక్కితే నేను మళ్లీ జైలుకెళ్లాల్సిన అవసరం ఉండదు. కేజ్రీవాల్‌కు స్వేచ్ఛా లేక జైలా అనే విషయం ఆలోచించి మీరు బటన్ నొక్కండి. చీపురు గుర్తుపై నొక్కితే దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించినట్లేనని గుర్తుంచుకోండి'అని ఆయన అన్నారు.

ఇండియా కూటమిలో మేము భాగమే

మళ్లీ మాటమార్చిన మమత

తమ్లుక్: ఇండియా కూటమికి బయటి నుంచి మద్దతు ఇస్తామని ప్రకటించిన మరుసటి రోజే తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తన మాటలను సవరించుకున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమిలో తాను ముమ్మాటికీ భాగస్వామినేనని, కూటమిలో కొనసాగుతానని మమత గురువారం ప్రకటించారు. బెంగాల్‌లో మాత్రమే సీపీఎం, కాంగ్రెస్‌తో పొత్తులు లేవని గురువారం తమ్లుక్‌లోని ఒక ఎన్నికల సభలో అన్నారు. 'కొందరు నిన్నటి నా ప్రకటనను తప్పుగా అర్థం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో నేను ఇండియా కూటమిలో భాగస్వామినే. ఇండియా కూటమి అనేది నా ఆలోచన. జాతీయ స్థాయిలో అందరం కలిసే ఉన్నాం. ఇకమీదటా ఉంటాం కూడా' అని ఆమె వ్యాఖ్యానించారు.

గోవధను అడ్డుకుంటాం: అమిత్ షా

మధుబని: 'బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం గోవధకు వ్యతిరేకం. అధికారంలోకి రాగానే మేం ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని అనుమతించం'అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)పై కేంద్రం విధించిన నిషేధాన్ని ఆయన సమర్థించుకున్నారు. గురువారం ఆయన బిహార్‌లోని మధుబని, సతామర్హి లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రచారం ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఒకరి తర్వాత ఒకరు చేపట్టేందుకు ఇండియా కూటమి నేతలు సిద్ధంగా ఉన్నారని అమిత్ వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీకి మూడోసారీ అధికారం ఇవ్వాలని ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్నారు. ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి లేనే లేరు. కూటమి తరఫున ప్రధాని అభ్యర్థి ఎవరుంటారో మీకు తెలిస్తే చెప్పండి' అని మంత్రి అమిత్ షా అన్నారు.

గోశాలల పరిస్థితి అధ్వానం: ప్రియాంక

రాయ్‌బరేలి: కాంగ్రెస్ పార్టీ గాంధీజీ విధానాలను అనుసరిస్తోందని, చనిపోయేముందు ఆయన 'హే రామ్' అని అన్నారని ప్రియాంకా గాంధీ గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హిందువులకు వ్యతిరేకమని మోదీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 'మేము హిందూ మతానికి వ్యతిరేకమని బీజేపీ ఆరోపిస్తోంది. తుదిశ్వాస విడిచేముందు హే రామ్ అన్న గాంధీజీ ఆదర్శాలను కాంగ్రెస్ పాటిస్తోందని ప్రియాంక గురువారం రాయ్‌బరేలీలోని ఒక ఎన్నికల సభలో అన్నారు. 'కాషాయ పార్టీ హిందూ ధర్మ పరిరక్షకులని చాటింపు వేసుకుంటుంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం నడిపే గోశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానాలను తిరస్కరించామని మమ్మల్ని హిందూ వ్యతిరేకులమని బీజేపీ ముద్ర వేస్తోంది. ఒకసారి యూపీలోని గోశాలల పరిస్థితి చూడండి. ఒక వీడియోలో మృత ఆవును కుక్కలు పీక్కుతింటున్నాయి. అదే ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడు గోశాలలను మెరుగుపరిచాం. గోశాలలను నడుపుతున్న స్వయం సహాయక గ్రూపులకు ఆర్థికంగా అండగా నిలవాలని పేడను ప్రభుత్వం ఖరీదు చేసింది' అని ప్రియాంక పేర్కొన్నారు.

మోదీ ప్రజా విశ్వాసం కోల్పోయారు: పవార్

నాసిక్: దేశ ప్రజలు ఈ దఫా రాజకీయ మార్పును కోరుకుంటున్నందున ప్రధాని మోదీ విశ్వాసం కోల్పోయారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం అనేక ప్రాంతాలకు వెళ్లా. రాజకీయాలపై ప్రజల ఆలోచనలు మారినట్లు గమనించా. వారు మార్పును కోరుకుంటున్నారు. అందువల్ల మోదీ ప్రజల విశ్వాసం కోల్పోయినట్లే. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి ప్రస్తుతం పరిస్థితి అనుకూలంగా ఉంది' అని పవార్ చెప్పారు. అయితే, ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనేది తాను చెప్పలేనన్నారు.

నాలుగు దశల్లో సగటున 67% పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఈ నెల 13వ తేదీన జరిగిన నాలుగో విడత పోలింగ్‌లో సవరించిన అంచనాల ప్రకారం 69.16% పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ తెలిపింది. 2019 పార్లమెంటరీ ఎన్నికలతో పోలిస్తే ఇది 3.65 శాతం ఎక్కువని తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం మూడో విడతలో 65.68%, రెండో విడతలో 66.71%, మొదటి విడతలో 66.14% పోలింగ్ నమోదైనట్లు వివరించింది. మొదటి నాలుగు దశల్లో కలిపి సగటున 66.95 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ గురువారం తెలిపింది. ఇప్పటి వరకు సుమారు 97 కోట్ల మంది ఓటర్లకు గాను 45.10 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించింది. మొత్తం 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 379 స్థానాలకు పోలింగ్ పూర్తయిందని తెలిపింది.

ఉక్రెయిన్ యుద్ధానికి రాజకీయ పరిష్కారం

- చైనా అధినేత షీ జిన్‌పింగ్ వెల్లడి
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చలు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పుతిన్, జిన్‌పింగ్

బీజింగ్: ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవడానికి త్వరలోనే రాజకీయ పరిష్కారం కనుగొంటామని చైనా అధినేత షీ జిన్‌పింగ్ సంకేతాలిచ్చారు. ఐరోపా ఖండంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. గురువారం చైనా రాజధాని బీజింగ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. చైనా–రష్యా మధ్య వ్యూహాత్మక సంబంధాలను దెబ్బతీసేందుకు అమెరికా చేసే ప్రయత్నాలను సహించకూడదని, గట్టిగా ఎదిరించాలని నిర్ణయానికొచ్చారు. తమ రెండు దేశాల సంబంధాల్లో కలుగజేసుకోవద్దని అమెరికాకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. అంతకు ముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం ఉదయం రష్యా నుంచి చైనాకు చేరుకున్న పుతిన్‌కు ఘన స్వాగతం లభించింది. ఐదోసారి రష్యా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత పుతిన్ తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. చర్చల అనంతరం జిన్‌పింగ్, పుతిన్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరగా తెరపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చైనా–రష్యా సంబంధాలను మూడోదేశం ప్రభావితం చేయలేదని పేర్కొన్నారు. అలా ప్రభావితం చేసేందుకు సాగే ప్రయత్నాలను అడ్డుకుంటామని వెల్లడించారు. తమ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని స్పష్టం చేశారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలం కంటే ఇప్పుడు తమ బంధం ఇంకా దృఢమవుతోందని పేర్కొన్నారు. తమ చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను కచ్చితంగా కాపాడుకుంటామని తేల్చిచెప్పారు. అణు ఇంధనం నుంచి ఆహార సరఫరా దాకా భిన్న రంగాల్లో చైనాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటామని పుతిన్ వెల్లడించారు. రష్యాలో చైనా కార్ల తయారీకి ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి తెరదించే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నందుకు చైనాకు పుతిన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చైనా–రష్యా మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేలా ఒకఒప్పందంపై జిన్‌పింగ్, పుతిన్ సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఇరుదేశాల అధికారుల మధ్య విస్తృత స్థాయి చర్చల తర్వాత 30 పేజీల ఈ ఒప్పందం డాక్యుమెంట్‌ను సిద్ధం చేసినట్లు రష్యా ప్రతినిధి యూరి ఉషకోవ్ చెప్పారు.

నిలకడగా స్లొవేకియా ప్రధాని ఆరోగ్యం

బన్‌స్కా బిస్ట్రికా: దుండగుడి కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్లొవేకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో(59) పరిస్థితి విషమమే అయినప్పటికీ నిలకడగా ఉంది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఆయనతో గురువారం మాట్లాడినట్లు ఎన్నికైన అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినీ చెప్పారు. ఫికో ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రధాని ఫిగోకు ఐదు గంటలపాటు ఆపరేషన్ చేసినట్లు బన్‌స్కా బిస్ట్రికాలోని ఎఫ్‌డీ రూజ్‌వెల్ట్ హాస్పిటల్ డైరెక్టర్ మిరియమ్ లపునికోవా గురువారం చెప్పారు. విషమమే అయినప్పటికీ ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. ఇలా ఉండగా, ప్రధాని ఫికోపై కాల్పులకు పాల్పడిన వ్యక్తి(71) ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు లేనట్లుగా తేలిందని ఇంటీరియర్ మంత్రి మటుస్ సుటాజ్ ఎస్టోక్ తెలిపారు. ప్రధానిపై హత్యాయత్నం రాజకీయ ప్రేరేపితమని ఆయన అన్నారు. ఫికో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు అతడు తెలిపాడన్నారు. కవి కూడా అయిన నిందితుడు గతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. అతడి పేరు, ఇతర వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. బుధవారం హాండ్లోవా పట్టణంలో ఓ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఫికోపై దుండగుడు తుపాకీతో పలుమార్లు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. మరికొద్ది రోజుల్లో యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్న వేళ చోటుచేసుకున్న ఈ ఘటన యూరప్ వ్యాప్తంగా కలకలం రేపింది. తొలుత ఉక్రెయిన్‌కు అనుకూలంగా వ్యవహరించిన స్లొవేకియా అనంతరం రష్యా అనుకూలంగా, అమెరికాకు వ్యతిరేకంగా పలు చర్యలు తీసుకుంది. ఫికో రాజకీయ ప్రత్యర్థి, మరికొద్ది రోజుల్లో పదవిని వీడనున్న అధ్యక్షురాలు జుజానా కపుటోవా గురువారం రాజధాని బ్రాటిస్లావాలో మీడియాతో మాట్లాడుతూ.. 'సమాజంలో పెరుగుతున్న విద్వేషాలకు నిదర్శనం ఈ ఘటన. రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి దేశంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నాలు చేస్తాం'అని తెలిపారు. ఈ సమయంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా మెలగాలని ఆమె కోరారు.

దేశవ్యాప్తంగా అల్లర్లకు విపక్షాల కుట్రలు

పౌరసత్వ సవరణ చట్టంపై దుష్ప్రచారం

- జూన్ 4 తర్వాత 'ఇండియా' కూటమి ముక్కలు చెక్కలే
- కేంద్రంలో వచ్చేది మళ్లీ మా ప్రభుత్వమే..
- ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లూ పనిచేస్తా..
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



అజంగఢ్: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, ఉత్తరప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి, ఈ చట్టాన్ని మాత్రం మీరు ఎప్పటికీ రద్దు చేయలేరు అని ప్రతిపక్షాలను ఉద్దేశించి తేల్చిచెప్పారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్, జౌన్‌పూర్, బదోహీ, ప్రతాప్‌గఢ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. సీఏఏ కింద కాందిశీకులకు భారత పౌరసత్వం కల్పించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, వీరంతా హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులేనని చెప్పారు. మతం ఆధారంగా భారత్‌ను విడగొట్టడంతో వీరంతా బాధితులుగా మారి మన దేశానికి వచ్చారని, చాలాఏళ్లుగా ఇక్కడే కాందిశీకులుగా బతుకుతున్నారని తెలిపారు. ప్రాణభయంతో వలస వచ్చిన బాధితులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. బహిరంగ సభల్లో ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

ఈసారి మూడు డోసుల బుజ్జగింపు విధానాలు

''ఉత్తరప్రదేశ్‌లో గతంలో భయానక పరిస్థితులు ఉండేవి. పేలుళ్లకు పాల్పడిన ఉగ్రవాదులకు క్షమాభిక్ష ప్రసాదించి వదిలేసేవారు. ముష్కరులకు రాజకీయ ముసుగేసి కాపాడుతూ ఉండేవారు. దీనివల్ల ఉగ్రవాదం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. అయినా కొందరు విపక్ష నాయకుల ధోరణిలో మార్పు రావడం లేదు. ఉగ్రవాదం పట్ల సానుభూతి చూపుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు మొదలైంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ అనేవి రెండు పార్టీలు. నిజానికి అవి ఒకే దుకాణం. అక్కడ బుజ్జగింపు రాజకీయాలు, అబద్ధాలు, కుటుంబస్వామ్యం, అవినీతిని అమ్ముతుంటారు. ఈసారి వారు మూడు డోసుల బుజ్జగింపు విధానాలతో ముందుకొస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను కాజేసి ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆస్తుల్లో సగం దోచుకొని ఓటు బ్యాంక్‌కు అప్పగించాలని కుట్రలు పన్నుతున్నారు. దేశ బడ్జెట్‌లో ఏకంగా 15 శాతం నిధులను మైనార్టీలకే కేటాయించాలని భావిస్తున్నారు.

ఎన్నికల తర్వాత రాహుల్, అఖిలేశ్ విదేశాలకు వెళ్లిపోతారు

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచక, అవినీతి పాలనను ఉత్తరప్రదేశ్‌లోనూ తీసుకురావాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు భావిస్తున్నాయి. హిందువులను హత్య చేయడం, దళితులను, ఆదివాసీలను వేధించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడమే తృణమూల్ కాంగ్రెస్ పాలన. అలాంటి పాలన మనకు కావాలా? అనేది ఉత్తరప్రదేశ్ ప్రజలు ఆలోచించుకోవాలి. జూన్ 4 తర్వాత మళ్లీ మా ప్రభుత్వమే వస్తుంది. ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లూ పని చేస్తానని గ్యారంటీ ఇస్తున్నా. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ), సమాజ్‌వాదీ పార్టీ యువరాజు(అఖిలేశ్ యాదవ్) విదేశాలకు వెళ్లిపోతారు. నోట్లో బంగారు చెంచాతో పుట్టిన బడాబాబులు ఈ దేశాన్ని సమర్థంగా నడపలేరు'' అని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ఎక్స్‌-రే యంత్రాలు

''ఈ లోక్‌సభ ఎన్నికలు మనకొక సువర్ణావకాశం. బలమైన ప్రభుత్వాన్ని నడిపించడంతోపాటు ఇండియా బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పే నాయకుడిని ఎన్నుకోవాలి. అందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలి. ప్రజలు వేసే ఓటు బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. బీజేపీ అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు నేరుగా నరేంద్ర మోదీ ఖాతాలోకి చేరుతుంది. ఇండియా కూటమి నాయకులు అధికారంలోకి వస్తే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నారు. ఇందుకోసం రాజ్యాంగాన్ని సైతం మార్చేస్తామంటున్నారు. నేను బతికి ఉన్నంత కాలం అలాంటి ఆటలు సాగనివ్వను. ఎక్స్‌-రే యంత్రాలతో ప్రజల ఆస్తులను సర్వే చేస్తామని కాంగ్రెస్ పెద్దలు చెబుతున్నారు. అందుకే మనమంతా జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్ అజెండాను నేను బయటపెట్టా. దాంతో కాంగ్రెస్ ఎక్స్‌-రే యంత్రాలు ముక్కలు ముక్కలుగా విరిగిపోతున్నాయి''.

మలివాల్ వాంగ్మూలం నమోదు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలిసేందుకు వెళ్లిన సందర్భంగా ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడి చేశారని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఆరోపించిన ఉదంతంలో పోలీసులు ముందడుగు వేశారు. ఈ విషయంలో ఇంతవరకు స్వాతి పోలీసులకు ఫిర్యాదుచేయలేదు. అయినా సరే పోలీసులే గురువారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లిమరీ ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సోమవారం కేజ్రీవాల్ నివాసానికి వెళ్లినప్పుడు జరిగిన ఘటన వివరాలను ఇద్దరు సభ్యుల ఢిల్లీ పోలీసు బృందానికి స్వాతి వివరించింది. నాలుగున్నర గంటలపాటు అదనపు పోలీసు కమిషనర్ పీఎస్ కుష్వాహా బృందం స్వాతి ఇంట్లో వివరాలు సేకరించింది. వాంగ్మూలం నమోదు పూర్తయిన నేపథ్యంలో బిభవ్‌పై పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సోమవారం దాడి ఘటన జరిగిన వెంటనే స్వాతి సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనపై జరిగిన దాడి విషయాన్ని చెప్పి వచ్చారుగానీ ఫిర్యాదుచేయలేదు. దీంతో ఇన్నిరోజులైనా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దీంతో ఈ విషయాన్ని సూమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్ శుక్రవారం తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని బిభవ్ కుమార్‌కు సమన్లు జారీచేసింది.

కేజ్రీవాల్ మౌనమేల?: బీజేపీ

సొంత ఇంట్లో జరిగిన ఘటనపై సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని బీజేపీ ప్రశ్నించింది. లక్నోలో పత్రికా సమావేశం సందర్భంగా కేజ్రీవాల్‌ను మీడియా ప్రశ్నించగా ఆయన సమాధానం చెప్పలేదు. దీంతో బీజేపీ విమర్శించింది. '' ఆయన మౌనం కూడా ఎంతో చెప్తోంది. జైలు నుంచి విడుదలయ్యాక సీఎంగా కంటే గూండాలా వ్యవహరిస్తున్నారు'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు.

బీజేపీ రాజకీయాలు ఆపాలి: స్వాతి

దాడి ఉదంతాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని బీజేపీకి స్వాతి మలివాల్ హితవు పలికారు. '' ఆరోజు నా విషయంలో జరిగింది నిజంగా బాధాకరం. అందుకే పోలీసులకు వాంగ్మూలం ఇచ్చా. సరైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. ఇందులో బీజేపీకి ఏం సంబంధం. వ్యక్తిత్వ హననం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనను రాజకీయంచేయొద్దని బీజేపీ నేతలకు ప్రత్యేకంగా విన్నవిస్తున్నా'' అని స్వాతి 'ఎక్స్'లో హిందీలో పోస్ట్‌చేశారు.

మహారాష్ట్రలో ఐటీ సోదాలు రూ.170 కోట్ల నగదు, నగలు స్వాధీనం

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో ఆదాయపు పన్ను శాఖ(ఐటీ) 72 గంటలపాటు నిర్వహించిన సోదాల్లో రూ.170 కోట్ల విలువైన సొత్తు లభ్యమైంది. పట్టణంలోని భండారీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదినాథ్ అర్బన్ మల్టీస్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకు కార్యాలయాల్లో ఐటీ అధికారులు ఈ నెల 10వ తేదీన సోదాలు ప్రారంభించారు. 12వ తేదీ ఈ సోదాలు ముగిశాయి. వందలాది మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. రూ.14 కోట్ల నగదు, 8 కిలోల బంగారం సహా మొత్తం రూ.170 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నగదును లెక్కించడానికి 14 గంటలు పట్టినట్లు సమాచారం. పెద్ద ఎత్తున పన్ను ఎగవేసినట్లు భండారీ ఫైనాన్స్, ఆదినాథ్ బ్యాంకుపై ఆరోపణలున్నాయి. నాందేడ్ టౌన్‌లో ఈ స్థాయిలో ఐటీ సోదాలు జరగడం, భారీగా సొమ్ము దొరకడం ఇదే మొదటిసారి.

ఇంటికి 100 మీటర్ల దూరంలో.. 26 ఏళ్ల పాటు చెరలో

అల్జీర్స్: టీనేజీ వయసులో పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యంలో అపహరణకు గురై ఏకంగా 26 సంవత్సరాలపాటు బందీగా ఉండిపోయిన అల్జీరియన్ వ్యక్తి వేదన ఇది. అల్జీరియా దేశంలోని డిజేఫ్లా రాష్ట్రంలో ఇటీవల కిడ్నాపర్ చెర నుంచి విముక్తుడైన 45 ఏళ్ల ఒమర్ బిన్ ఒమ్రాన్ గాథను స్థానిక అల్జీరియన్ ఎల్‌ఖబర్ వార్తాసంస్థ వెలుగులోకి తెచ్చింది.

గడ్డితో నిండిన సెల్లార్‌లో ఏళ్ల తరబడి..

ఒమర్‌కు 19 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అంటే 1998 సంవత్సరంలో ఒకరోజు ఉదయం వృత్తివిద్యా పాఠశాలకు ఒమర్ తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. కొంతదూరం వెళ్లగానే కిడ్నాప్‌కు గురయ్యాడు. కిడ్నాప్‌చేసిన వ్యక్తి ఒమర్‌ను ఒక గడ్డితో కప్పిన నేలమాళిగలో దాచిపెట్టాడు. ఎందుకు కిడ్నాప్ చేశాడో, ఎందుకు ఇన్ని సంవత్సరాలు అక్కడే ఉంచాడో ఎవరికీ తెలీదు.

తోబుట్టువు పోస్ట్‌తో వెలుగులోకి

కిడ్నాపర్‌కు ఒక తోబుట్టువు ఉన్నారు. ఆ వ్యక్తి ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో ఒక విషయం రాసుకొచ్చారు. ఊరిలో ఒక కిడ్నాప్ ఉదంతంలో తన పాత్ర కూడా ఉందని ఒక పోస్ట్‌చేశారు. ఈ పోస్ట్‌ను ఒమర్ కుటుంబం గమనించి వెంటనే దర్యాప్తు సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో నేషనల్ జెండర్‌మెరీన్(దేశ దర్యాప్తు సంస్థ) పాత కేసును తిరగతోడింది. పోస్ట్ పెట్టిన వ్యక్తిని విచారించి కిడ్నాపర్ ఇంటిని కనిపెట్టారు. అధికారులు ఆదివారం కిడ్నాపర్ ఇంటిపై మెరుపుదాడి చేసి ఇళ్లంతా వెతికారు. చివరకు గడ్డితో ఉన్న రహస్య సెల్లార్‌లో ఒమర్‌ను కనుగొన్నారు. 61 ఏళ్ల కిడ్నాపర్ పారిపోతుంటే పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాపర్ ఇల్లు.. ఒమర్ సొంత ఇంటికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉంది. ఈ సెల్లార్ ఒక గొర్రెల కొట్టం కింద ఉన్నట్లు తెలుస్తోంది.

కిటికీలోంచి చూసేవాడిని: ఒమర్

''కిడ్నాప్‌కు గురయ్యాక ఈ సెల్లార్‌లోనే ఉండిపోయా. నా కుటుంబసభ్యులు అటుగా వెళ్లేటపుడు సెల్లార్ కిటికీ నుంచి చూసేవాడిని. అరిచి పిలుద్దామని వందలసార్లు అనుకున్నా. కానీ పక్కనే కిడ్నాపర్ ఉండేవాడు. భయంతో నోరు మెదపలేదు'' అని విడుదలయ్యాక ఒమర్ చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 17 । మే । 2024

పడవలు బంద్



సముద్ర జలాల్లో ఉష్ణోగ్రతలు పెరగడంతో చేపలు దొరకడం లేదు. దీంతో గురువారం మంగళూరు పాత పోర్టులో నిలిచిపోయిన చేపల పడవలు

న్యూస్‌రీల్

అలరించే కళా మేళా



బనశంకరి: ఇండియన్ క్రాఫ్ట్ ఎక్స్ పో నగరవాసులకు కనువిందు చేస్తోంది. సర్జాపుర రోడ్డు అత్తిబెలె, ఫ్యామిలీ బిగ్‌మార్ట్ ఎదురుగా ఉన్న మైదానంలో మేళా ఏర్పాటైంది. కలంకారీ, కాశ్మీరీ చీరలు, కార్పెట్స్, సారంగపుర అలంకరణ సామగ్రి, హ్యాండ్‌బ్యాగులు, గృహాలంకరణ కళాకృతులు ఇక్కడ విక్రయిస్తున్నారు. చేనేత చీరలు, డ్రెస్‌లు, మెటీరియల్స్ స్టాల్స్ వెలిశాయి. జూన్ 10వ తేదీ వరకు మేళా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పరారీలో ఉన్న ఉగ్ర అనుమానితుడు అరెస్టు

మైసూరు: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మైసూరులో సోదాలు జరిపి పరారీలో ఉన్న అనుమానిత ఉగ్రవాదిని అరెస్టు చేసింది. నిందితుడు మైసూరు రాజీవ్‌నగరలో నివసిస్తున్న నూరుద్దీన్ అలియాస్ రఫీగా గుర్తించారు. అతని నుంచి మొబైల్ ఫోన్, పెన్‌డ్రైవ్, డ్రోన్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 2014లో బెంగళూరులోని ఇజ్రాయెల్, చెన్నైలోని అమెరికా రాయబార కార్యాలయాలపై పేలుళ్లకు కుట్ర చేశాడని అతనిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. పాకిస్తాన్ తరఫున గూఢచార్యం, భారతదేశంలో నకిలీ నోట్ల సరఫరా తదితర కేసుల్లో కూడా ఇతడు నిందితుడు. ఇదే కేసులో శ్రీలంక పౌరుడు మహమ్మద్ షాకీర్ హుస్సేన్, కొలంబోలో పాకిస్తాన్‌కు చెందిన ఉద్యోగి అమీర్ జుబేర్ సిద్ధికిని గతంలో భారతదేశంలో 2014లో అరెస్టు చేశారు. వీరిపై కేసులు నమోదు చేసి ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. 2023 ఆగస్టులో రఫీ బెయిల్‌పై బయటకు వచ్చి చెన్నైలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు వాయిదాలకు వెళ్లకుండా పరారయ్యాడు. దీంతో అతనిని గాలించి అరెస్టు చేశారు.

బాత్‌రూంలో శవమైన యువతి

- హత్యా.. ఆత్మహత్య అని అనుమానం

బనశంకరి: ఇంట్లో చేతులు, కాళ్లు కోసిన స్థితిలో విద్యార్థిని మృతిచెందిన ఘటన నగరంలో సుబ్రమణ్యపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బృందావన లేఔట్ నివాసి ప్రభుద్య (21) మృతురాలు. వివరాలు... ఆమె బీబీఏ రెండో ఏడాది చదువుతోంది. ఆమె తల్లి సౌమ్య బుధవారం ఉదయమే బయటికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. ప్రభుద్యా బాత్‌రూంలో గొంతు, కాళ్లు, చేతులు కోసుకుని రక్తపు మడుగులో పడి ఉంది. ఇరుగుపొరుగుతో కలిసి ఆమెను ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతిచెందిందని తెలిపారు. ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి ఎవరో చొరబడి హత్య చేసి ఆమె మొబైల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారని తల్లి చెబుతోంది. తన కుమార్తెను ఎవరో దుండగులు క్రూరంగా హత్య చేశారని , ఆత్మహత్య చేసుకునే మనస్తత్వం కాదని తెలిపింది. ఆమె ఎప్పుడూ విద్యావ్యవస్థలోని లోపాల గురించి ప్రశ్నించేవారని, అదే ఆమెకు సమస్య అయిందని ఆరోపించింది. స్థానిక పోలీసులు చేరుకుని పరిశీలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శవపరీక్షల నివేదిక వచ్చాకే హత్య, ఆత్మహత్య అనేది తెలుస్తుందని చెప్పారు.

మెట్రో స్టేషన్లలో కొత్త జరిమానా



శివాజీనగర: ఐటీ నగరంలో మెట్రో రైల్వేస్టేషన్లలో కొందరు పని లేకున్నా అక్కడే ఉంటూ కాలక్షేపం చేస్తుంటారు. అలాగే ప్లాట్‌ఫారంలలో తిరుగుతుంటారు. దీంతో మెట్రో సంస్థ చర్యలను తీసుకుంది. ప్లాట్‌ఫారంలలో 20 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఉండేవారికి జరిమానా విధిస్తున్నారు. ఈ నియమం కొత్త కాకపోయినా, ఇప్పుడే అమలు చేయడం మొదలైంది. విజయనగర మెట్రో స్టేషన్‌లో 25 నిమిషాల పాటు ఉన్న కొందరు ప్రయాణికులకు రూ.50 చొప్పున జరిమానా విధించారు. ఎందుకని మెట్రో సిబ్బందిని ప్రశ్నించగా ఈ నియమం గురించి తెలిపారు. మెట్రో స్టేషన్లలో జన రద్దీని అరికట్టడమే దీని ఉద్దేశమని తెలిపారు. అరుణ్ అనే ప్రయాణికుడు భారీ వర్షం వస్తున్న స్టేషన్‌లోనే ఉండిపోయి మొబైల్ ఫోన్‌ని చార్జింగ్ చేసుకోగా, జరిమానా పడింది. అతని స్మార్ట్ కార్డులో రూ. 50 ఫీజు పడింది. దీంతో ముఖ్యంగా స్మార్ట్‌కార్డుదారులు చకచకా రైలు ఎక్కి వెళ్లిపోవడం మంచిది.

నీడనిచ్చే చెట్టు..

- బెంగళూరులో వారం రోజుల్లో వెయ్యి కూలాయి
- అక్కడే విక్రయించనున్న పాలికె

గాలివానకు ఫట్

బనశంకరి: ఉద్యాననగరి పరిధిలో ఈ నెల 6 నుంచి 12 వరకు కురిసిన గాలీవానలు చెట్లకు ప్రాణాంతకంగా మారాయి. ఆ వారం రోజుల్లో వెయ్యికి పైగా చెట్లు కూలిపోయాయని బీబీఎంపీ తెలిపింది. నైరుతి రుతు పవనాలు ఇంకా రాలేదు కాబట్టి కూలిపోయిన చెట్లను తొలగించడంపై బీబీఎంపీ పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. అనూహ్యంగా గత 10 రోజులుగా కురిసిన ఈదురుగాలులతో కూడిన వానలకు బెంగళూరులో అనేక చోట్ల చెట్లు, పెద్ద పెద్ద కొమ్మలు కూలిపోయాయి. కొన్నిచోట్ల కార్లు, బైక్‌లు స్వల్పంగా దెబ్బతిన్నాయి, అదృష్టవశాత్తు ఎవరికీ హాని కలగలేదు. వర్షం వచ్చే సమయాలలో చెట్ల కింద ఉండకపోవడం శ్రేయస్కరం.



గురువారం బెంగళూరు జయనగరలో రోడ్డుపక్కన ఉంచిన కొమ్మలు

పడిపోయిన చోటే అమ్మకాలు

ఈ నేపథ్యంలో రోడ్లలో కూలిపోయిన చెట్లు, కొమ్మలను బీబీఎంపీ పరిధిలోని అటవీశాఖ డిపోలకు తరలించకుండా చెట్లు పడిన స్థలంలోనే ప్రజలకు అమ్మేయడానికి పథకం రూపొందించింది. ఈ మేరకు అటవీ విభాగం అధికారులు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కు తెలిపారు. ఇటీవల భారీ గాలులు, వర్షాలకు చెట్లు కూలిపోయాయి, వచ్చి తొలగించాలని అనేకమంది ఫిర్యాదులు చేశారు. 39 బృందాలు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై పడిపోయిన చెట్లను, కొమ్మలను కత్తిరించారు. ప్రస్తుతం వీటిని అక్కడే ఉంచి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు.

తరలించడం సాధ్యం కాదనే..

బీబీఎంపీ అటవీ విభాగం కూలిన చెట్లను కట్ చేసి డిపోలు లేదా డంపింగ్‌యార్డుల్లో నిల్వచేస్తారు. నగరంలో ఇలాంటి 8 డంపింగ్ యార్డులు ఉన్నాయి. కానీ వారం వ్యవధిలో 1,000 కి పైగా చెట్లు కూలిపోయినప్పుడు వాటిని కత్తిరించి తొలగించడం సాధ్యం కాదని పాలికె అధికారులు చెబుతున్నారు. వాటిని అక్కడే వేలం వేసి అమ్మేయాలని పాలికె తీర్మానించిందని బీబీఎంపీ అటవీశాఖ డిప్యూటీ సంరక్షణాధికారి బీఎల్‌జీ స్వామి తెలిపారు. నగరవ్యాప్తంగా కూలిపోయిన చెట్లను తొలగించే పని నత్తనడకన సాగుతోందని ఓ పాలికె అధికారి ఒప్పుకున్నారు. చెట్ల కొమ్మలు అడ్డంగా ఉంటూ అవస్థలు పడుతున్నట్లు వాహనదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.



ఆటో మీదకు కూలిన పెద్ద చెట్టు



నగరంలోని ఓ ప్రముఖ రహదారిలో కూలిన చెట్టు

చెరువు స్నానం.. తీసింది ప్రాణం



దుర్ఘటన జరిగిన తిమ్మనహళ్లి చెరువు

- నలుగురు బాలల తుదిశ్వాస
- హాసన్ జిల్లా ఆలూరు తాలూకాలో ఘోరం

సాక్షి, బళ్లారి: హాసన్ జిల్లా ఆలూరు తాలూకా కదాళ పంచాయతీ పరిధిలోని ముత్తిగి గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గురువారం స్నానానికి వెళ్లిన నలుగురు చిన్నారులు చెరువులో మునిగి మృత్యువాత పడ్డారు.

వివరాలు.. విశ్వ, పృథ్వీ, సాత్విక్, జీవన్ అనే నలుగురు స్నేహితుడు, వీరందరూ 8 నుంచి 10 ఏళ్ల లోపువారే. సమీపంలోని తురగనహళ్లి తిమ్మనహళ్లిలో చెరువులో ఈతకు వెళ్లారు. చెరువు లోతుగా ఉన్నచోట బాలలు మునిగిపోయారు. బాలలు ఎంతసేపయినా ఇళ్లకు రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా గట్టు మీద చెప్పులు, బట్టలు కనిపించాయి. దీంతో పోలీసులకు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది చెరువులో రబ్బరు బోట్లతో గాలింపు సాగించారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. రాత్రి పొద్దుపోయాక మరో ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. కంటికి దీపంలా పెంచుకుంటున్న చిన్నారులను అలా చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



బాలల కోసం ఫైర్ సిబ్బంది రబ్బరు బోటుతో అన్వేషణ

హైవేపై వాహన బీభత్సం

- వరుసగా నాలుగు వాహనాలు ఢీ
- ఒక బైకిస్టు దుర్మరణం



వరుసగా ఢీకొన్న బస్సులు, కార్లు

మైసూరు: జిల్లాలోని హుణసూరు తాలూకా అరసు కల్లళ్లి వద్ద వరుసగా నాలుగు వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఒక బైకిస్టు మరణించాడు. రెండు బస్సులు, రెండు కార్లు బాగా దెబ్బతిన్నాయి. మైసూరు-బంట్వాళ రహదారి-275పై అరసు కల్లహళ్లి గేట్ వద్ద ఈ ఘటన జరిగింది. మైసూరు తాలూకా హోటగళ్లి ఎస్ఆర్ఎస్ కాలనీ నివాసి, కూలీ కార్మికుడు కరియప్ప (40) బైక్ మీద పొరుగూరిలో జాతరకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. హుణసూరు డిపోకు చెందిన బస్సు అతన్ని వెనుక నుంచి ఢీ కొట్టి సడన్ బ్రేక్ వేసింది. వెనుకనే వచ్చిన ఇన్నోవా కారు అదుపు కాలేక బస్సును ఢీ కొట్టింది. ఆ వెనుకే మరో బెంజ్ కారు వచ్చి ఇన్నోవాను గుద్దింది. మరో ఆర్టీసీ బస్సు బెంజ్ కారును వెనుక ఢీకొట్టింది. ఇలా వరుసగా వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. బైకిస్టు కరియప్ప తీవ్ర గాయాలతో అక్కడే మరణించారు. వాహనాల్లోని మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై అర్ధగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక పోలీసులు చేరుకుని కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఇంత పెద్ద ప్రమాదం జరిగినట్లు ఇతర వాహనదారులు వాపోయారు.



31 నుంచి ముంగారు ప్రవేశం



గురువారం బెంగళూరులో ఆకాశం మేఘావృతం



ధార్వాడలో కురిసిన వర్షం

- ఊపందుకోనున్న వానలు

యశవంతపుర: భారత వాతావరణ విభాగం శుభవార్త చెప్పింది. ఈ నెల 31 నుంచి ముంగారు వానలు ప్రారంభం కానున్నట్లు ఐఎండి ఒక ప్రకటనలో తెలిపింది.

- ఈ నెల 19 నుంచి నైరుతీ ముంగారుగా మారి దక్షిణ అండమాన్, బంగాళాఖాతం, నికోబార్ ద్వీపాల్లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయి.
- 31వ తేదీకి ముందుగానే కేరళలోకి ముంగారు ప్రవేశించే అవకాశం ఉంది. మూడు నాలుగు రోజుల ముందుగానే జూన్ మొదటి వారంలో కర్ణాటకలోకి రుతుపవనాలు చేరుకొంటాయని తెలిపారు.
- జూన్ 7 లేదా 8 నుంచి ముంగారు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణశాఖ అధికారులు అంచనా వేశారు.
- ఇక గురువారం ధార్వాడలో భారీ వర్షం కురిసింది. బెంగళూరులో ఆకాశం మేఘావృతమై పగటి వెలుతురు బాగా తగ్గిపోయింది.

పెన్‌డ్రైవ్ మూలమూలనా శోధన

- హాసన్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఆప్తుల ఇళ్లలో సిట్ సోదాలు
- పెద్దసంఖ్యలో పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్కులు సీజ్



బనశంకరి/ మైసూరు: హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ నగ్న వీడియోల కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. అన్ని పార్టీల నాయకులు ఇందులో ఇరుక్కుపోతున్నారు. వీడియోల లీకేజీ వ్యవహారంలో హాసన్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్‌గౌడ ఆప్తుని ఇంట్లో 10 కి పైగా పెన్‌డ్రైవ్‌లతో పాటు ముఖ్యమైన ఆధారాలు లభించాయి. బెంగళూరు, హాసన్‌తో పాటు అనేక ప్రాంతాల్లో సిట్ అధికారులు దాడులు నిర్వహించారు. 7 పెన్‌డ్రైవ్‌లు, 6 హార్డ్‌డిస్క్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, మూడు డెస్క్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరాల స్టోరేజీని సేకరించి పరిశీలిస్తున్నారు. పెన్‌డ్రైవ్‌లు, కంప్యూటర్లలో ఉన్న వీడియోలను పరిశీలిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. వీడియోలను పెన్‌డ్రైవ్ ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌కు కాపీ చేసిన తరువాత ఇతరులకు పంపించారనే ఆరోపణ ఉంది. అందులో ప్రీతమ్‌గౌడ సన్నిహితులైన క్వాలిటీబార్ శరత్, పునీత్, హెచ్‌పీ కిరణ్, కాంగ్రెస్ కార్యకర్త పుట్టరాజు, నవీన్‌గౌడ, కారు డ్రైవరు కార్తీక్, శశి, చేతన్‌గౌడల ఇళ్లలో సోదాలు చేపట్టారు. మరోవైపు బెంగళూరుకు ఏ క్షణమైనా రావచ్చు అనుకున్న ఎంపీ ప్రజ్వల్ ఆచూకీ లేదు.

ప్రజ్వల్ ఎక్కడున్నాడో తెలియదు: జీటీ

విదేశాలకు వెళ్లిన ఎంపీ ప్రజ్వల్ ఇప్పటివరకు ఎవరికి అందుబాటులోకి రాలేదని జేడీఎస్ సీనియర్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ అన్నారు. గురువారం నగరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రజ్వల్ రేవణ్ణతో మాట్లాడేందుకు కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినప్పటికీ ఎక్కడున్నాడో తెలియరాలేదని, 196 దేశాల్లో బ్లూకార్నర్ నోటీసు జారీ చేసిన సిట్ అధికారులే ఆయన ఆచూకీ కనుగొనాలని కోరారు. పెన్‌డ్రైవ్‌లను తయారు చేసింది, అప్‌లోడ్ చేసింది చెన్నై, మలేసియాలో అని తెలుస్తోందని, అందుకే ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీతో జేడీఎస్ మైత్రి విడదీయలేనిదని చెప్పారు.

రేవణ్ణకు మరో కేసులో బెయిలు

మహిళపై లైంగిక దాడి కేసులో హెచ్‌డీ రేవణ్ణకు బెయిల్ మంజూరైంది. బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టులో రేవణ్ణ బెయిలు అర్జీపై గురువారం విచారణ సాగింది. ఆయనకు బెయిల్ ఇవ్వరాదని సిట్ న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కోర్టు ఇరు పక్షాల వాదనలను ఆలకించి బెయిలు మంజూరు చేసింది.

తిమింగలాన్ని మింగేస్తా: కుమార

మింగే కాలం వచ్చినప్పుడు పెద్ద తిమింగలాన్నే మింగేస్తానని జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి పరోక్షంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పై మండిపడ్డారు. అశ్లీల వీడియోల వెనుక ఉన్న తిమింగలం డీకేశి అని కుమార తరచూ ఆరోపిస్తున్నారు. గురువారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ ఎంపీగా అయ్యాక తమకు అందుబాటులో లేకుండా పోయాడన్నారు. ఇక విదేశాల్లో ఉంటే తనతో ఎలా మాట్లాడతాడని ప్రశ్నించారు. ప్రజ్వల్ కేసులో ప్రభుత్వానికి నిజాలు అవసరం లేదని, జేడీఎస్, దేవెగౌడ కుటుంబ మర్యాదను పాడు చేస్తే చాలనుకుంటోందని విమర్శించారు. సిట్ తనిఖీ సరిగ్గా జరగడం లేదని, న్యాయవాది దేవరాజేగౌడను కేసు నమోదు అయిన నెల రోజుల తర్వాత ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. అధికారుల బదిలీల అవినీతిపై ఆధారాల పెన్‌డ్రైవ్‌ను ఇస్తాను, విచారణకు సిద్ధమా అని అన్నారు.

మొబైల్ జామర్‌తో బతుకు నరకం

- పరప్పన అగ్రహార జైలు పరిసర ప్రాంతాలవాసుల ధర్నా



బనశంకరి: జైలుకు దగ్గరలో నివసించడం ఎవరికైనా ఇబ్బందే. పలు రకాల ఇబ్బందులు వస్తుంటాయి. ఇదే మాదిరిగా రాజధానిలో పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు చుట్టుపక్కల ఉండే భువనేశ్వరి లేఔట్, నాగనాథపుర గ్రామస్తులు గురువారం జైలు సర్కిల్ వద్ద ధర్నా చేశారు. జైలులో జామర్ వల్ల ప్రస్తుత జీవనంలో అతి ముఖ్యమైన మొబైల్‌ఫోన్ పనిచేయకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు.

ప్రాణమే పోయింది

- జైలులో ఖైదీలు సెల్‌ఫోన్లు వాడినా పనిచేయకుండా మొబైల్ జామర్‌లను అమర్చారు. కానీ అవి జైలు బయట చాలా దూరం వరకూ ప్రభావం చూపుతున్నాయి.
- తమ ప్రాంతంలో ఫోన్లు పనిచేయడం లేదని, చాలా ఇబ్బందికరంగా మారిందని లక్ష్మణ్ అనే వ్యక్తి తెలిపారు.
- బంధువులకు ఫోన్ చేయాలన్నా, ఇంట్లో అనారోగ్య సమస్య తలెత్తితే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలన్నా నెట్‌వర్క్ లభించడం లేదని గౌరమ్మఅనే మహిళ వాపోయారు.
- క్యాబ్‌లకు, పోలీసులకు, గ్యాస్ తదితర హెల్ప్‌లైన్లకు కాల్ చేయాలన్న ఫలితం లేదని శృతి అనే మహిళ తెలిపింది.
- ఒక హృద్రోగికి అమర్చిన ఉపకరణం జామర్ వల్ల పనిచేయక చనిపోయాడని ఒకరు తెలిపారు.
- వర్క్ ఫ్రం హోం చేయడానికి మొబైల్స్, ల్యాప్‌టాప్‌లకు నెట్‌వర్క్ లేక ఉద్యోగులు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో అద్దె ఇళ్లకు గిరాకీ ఉండడం లేదు.
- తమ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో హైకోర్టు కు వెళతామని ఆందోళనకారులు తెలిపారు.



జైలు జామర్లకు వ్యతిరేకంగా జనం ధర్నా

చుక్కనీటిని కూడా వదలిపెట్టం



ఎక్స్‌ప్రెస్ లింక్ కాలువ కెనాల్ పనుల వద్ద రైతుల నిరసన



ఆందోళనలో పాల్గొన్న రైతులు, వివిధ సంఘాల నాయకులు

- మా నీరు.. మా హక్కు
- హేమావతి నీటిని మాగడికి తరలించే ఎక్స్‌ప్రెస్ లింక్ కాలువవ పనులపై నిరసన వెల్లువ
- ఉద్యమించిన రైతులు, స్వామీజీలు, సంఘాల నాయకులు

తుమకూరు: జిల్లా జీవనాడి హేమావతి కాలువకు ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్‌ను నిర్మించి మాగడికి నీటిని తరలించే ఏర్పాట్లపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. గురువారం గుబ్బి తాలూకా డి.రాంపుర హేమావతి కాలువ వద్ద మాజీ మంత్రి సోగడు శివణ్ణ నేతృత్వంలో వందలాది మంది రైతులు, మఠాధిపతులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంఘాల కార్యకర్తలు ఆందోళన చేపట్టారు, మా నీరు.. మా హక్కు అని నినదించారు. ప్రతి ఒక్కరూ మూడు పిడికెల మట్టిని ఆ నిర్మాణంలోని కాలువలో వేసి తమ ఆందోళన చేపట్టారు. మాగడి, రామనగరకు నీటిని తరలించడం వల్ల జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హేమావతి నుంచి జిల్లాకు 24.5 టీఎంసీల నీటిని కేటాయించారని, అయితే ఇందులో జిల్లాకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదని మండిపడ్డారు. జిల్లాకు కేటాయించిన వాటాలోనే మాగడికి తరలించే ఏర్పాటు జరుగుతోందని మండిపడ్డారు. ఈ నిర్మాణం జరిగితే తుమకూరు జిల్లాకు మరణశాసనం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర

హేమావతి ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ పనులను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాల కార్యకర్తలు నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్‌లో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిష్టిబొమ్మ శవయాత్రను చేపట్టారు. జిల్లా కన్నడ సేన అధ్యక్షుడు ధనియాకుమార్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ దిష్టిబొమ్మను శవయాత్రగా తీసుకొచ్చారు. మాగడి తాలూకాకు హేమావతి నీటిని తీసుకెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ నిర్మాణం చేపడుతున్నారని, దాన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు,. రక్తం ధారబోసి అయినా సరే ఒక్క చుక్క నీటిని కూడా విడిచిపెట్టమని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాలువలోకి పిడికెడు మట్టి వేసి నిరసన తెలుపుతున్న రైతులు, స్వామీజీలు

క్లుప్తంగా

పార్టీ విజయానికి శ్రమిద్దాం



కార్యకర్తలతో అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు శ్రమిద్దామని డీసీసీ అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ ఇటగి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ పరంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదల అభివృద్ధికి పాటుపడిందన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతం నుంచే మరింత అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఆశీర్వదించేలా కృషి చేయాలని కోరారు.

ఫసల్‌బీమాలో 36 మందిపై కేసులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో 36 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 2020–21 రబీ సీజన్‌లో బీమా పాలసీలతో రూ.లక్షలాది అక్రమాలు జరిగిన ఆరోపణలపై దేవదుర్గ తాలూకా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ నివేదిక మేరకు జాలహళ్లి, గాణదాళల్లో 273 మంది రైతులకు బీమా డబ్బులు మంజూరయ్యాయి. 116 మంది రైతుల డబ్బుల్లో 36 మంది బినామీ రైతుల పేరుతో రూ.76,91,167ల మేర అవినీతికి పాల్పడ్డారని తెలిపారు.

టెన్త్ సీబీఎస్ఈలో అదితి ప్రథమం



అదితి సంగావి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదో తరగతి సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య టెక్నో హైస్కూలు విద్యార్థిని అదితి ఏ.సంగావి కళ్యాణ కర్ణాటకకే ప్రథమ స్థానం సంపాదించింది. మొత్తం 500 మార్కులకుగాను 485 మార్కులతో 97 శాతం ఉత్తీర్ణత సాధించి ఐదో ర్యాంక్ పొందింది.

హరిదాసుల సేవలు అనన్యం



హరిదాసుల చిత్రపటానికి పుష్పాంజలి దృశ్యం

రాయచూరు రూరల్: సమాజానికి హరిదాసులు అందించిన సేవలు అనన్యమని శృతి సాహిత్య మేళ అధ్యక్షుడు మురళీధర్ కులకర్ణి పేర్కొన్నారు. ఆయన బుధవారం బయలు ఆంజనేయ స్వామి ఆలయంలో మొదలకల్ శేషదాసుల మధ్యారాధనను ప్రారంభించి మాట్లాడారు. 1887 నుంచి 1885 వరకు పాడిన గేయాలు, పద్యాలు ప్రతి ఒక్కరి మనస్సును దోచాయన్నారు. కార్యక్రమంలో జయకుమార్ దేశాయి, రంగనాథ్, లక్ష్మీకాంత్, శ్రీనిధి, సురేష్, శ్రీనివాస్, నాగరత్న, రాఘవేంద్ర, భీమాదేవిలున్నారు.

ఆలయంలోని హుండీ చోరీ

బళ్లారిటౌన్: నగర శివార్లలోని 34వ వార్డు పరిధిలోని బత్రి గ్రామంలోని శ్రీబత్రి ఈరణ్ణ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఇద్దరు దొంగలు జొరబడి ఆలయంలోని హుండీలోని సుమారు రూ.2 లక్షల నగదును దోచుకుని వెళ్లారు. గురువారం ఉదయం ఆలయ పూజారి హుండీ చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. ఆలయంలో సీసీ టీవీ కెమెరాలను అమర్చినందున ఇద్దరు దొంగలు చొరబడి దోచుకెళ్లడాన్ని సీసీ టీవీ ఫుటేజీలో గమనించారు. ఈ ఘటనపై కౌల్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ సమర్పిస్తున్న కాశీనాథ్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి కాశీనాథ్ ఎం.గిలేరి నామినేషన్ వేశారు. గురువారం కలబుర్గి డివిజన్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కృష్ణ బాజ్‌పేయ్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. బీజేపీ నుంచి అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ నుంచి చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థిగా నారా ప్రతాప్‌రెడ్డి కూడా నామినేషన్ల సమర్పణకు చివరి రోజు కావడంతో తమ నామినేషన్లను సమర్పించారు. కాగా ఈనెల 17న నామినేషన్లను పరిశీలిస్తారు.

నిబంధనలకు విరుద్ధంగా రోడ్లలో తవ్వకాలు



కేఆర్.రోడ్డులో రోడ్డు తవ్విన దృశ్యం

బనశంకరి: కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లను ఓ సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు తమ అవసరాల కోసం తవ్వి నాశనం చేశారని బీజేపీ నేత ఎన్ఆర్.రమేశ్ ఆరోపించారు. ఆ రోడ్లను తవ్విన వారిపై , తవ్వకాలకు అనుమతి ఇచ్చిన పాలికె అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్, కమిషనర్ తుషార్‌గిరినాథ్‌కు లేఖరాశారు. పద్మనాభనగర నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.17 కోట్లతో 8 నెలలక్రితం తారువేసిన అత్తిమబ్బేరోడ్డు, పుట్టలింగయ్యరోడ్డు, బీవీ.కారంత్‌రోడ్డు, శాస్త్రీనగర 14 రోడ్డుతో పాటు చాలా రోడ్లను రాత్రికి రాత్రి గేల్ సంస్థ పైపులైన్ అమర్చడానికి కంట్రాక్టు తీసుకున్న కంట్రాక్టరు తవ్వించారన్నారు. దీంతో పాలికెకు కోట్ల రూపాయల మేర నష్టం జరిగిందన్నారు. వైట్‌ట్యాపింగ్ పనులు పూర్తయిన తర్వాత తవ్వకాలకు తవ్వడానికి అనుమతి ఇవ్వరాదన్నారు. పద్మనాభనగర నియోజకవర్గంలో కెంపేగౌడ మెడికల్‌కాలేజీ ఆసుపత్రి, పరిశోధనాకేంద్రం నుంచి మోనోటైప్ వరకు 6.3 కిలోమీటర్ల మేర కేఆర్.రోడ్డును సుమారు రూ.96 కోట్లతో, కృష్ణరావు పార్కుజంక్షన్ నుంచి సారక్కి జంక్షన్ వరకు 7.5 కిలోమీటర్ల మేర రోడ్డును సుమారు 108 కోట్లతో వైట్‌టాపింగ్ రోడ్డుగా ఇటీవల మార్చారు. ఈ రెండురోడ్లలో తవ్వకానికి అనుమతి ఇవ్వడం చట్టవ్యతిరేకమన్నారు.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి



మృతుడు పార్శ్వలాల్

పావగడ: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న మిఠాయి వ్యాపారి పార్శ్వలాల్ (30) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రాజస్తాన్‌కు చెందిన అయన 13 సంవత్సరాలుగా పావగడలో నివాసముంటూ మిఠాయి వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం మిఠాయి బండిలోని బ్యాటరీని ఛార్జింగ్ పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హోం మంత్రి రాజీనామా చేయాలి

యశవంతపుర: రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పి హత్యలు, దోపిడీలు పెరిగిపోయాయని, ఇందుకు బాధ్యత వహిస్తూ హోంమంత్రి జీ పరమేశ్వర రాజీనామా చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం బెంగళూరులోని బీజేపీ ఆఫీసులో మాజీ మంత్రి డా సీఎస్ అశ్వర్థనారాయణ, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, పార్టీ ప్రధాన కార్యదర్శి పీ రాజీవ్‌లు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 60 శాతం నేరాలు పెరిగాయన్నారు. హుబ్లీలో నేహా, అంజలి హత్య, బెంగళూరు సుబ్రమణ్యపురలో హత్యతో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కేసు దర్యాప్తులో హోంశాఖ పూర్తి విఫలమైన్నట్లు ఆరోపించారు. ఈ కేసులో ఎంత పెద్ద వ్యక్తులున్న కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అశ్లీల వీడియో వైరల్ చేశారని ఫిర్యాదు

దొడ్డబళ్లాపురం: తనతో ఏకాంతంగా గడిపిన దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ ఘటన రామనగరలో చోటుచేసుకుంది. తన భర్తను హత్య చేస్తానని బెదిరించి రామనగర తాలూకా దొడ్డమణ్ణుగుడ్డె నివాసి రాజేశ్ అనే వ్యక్తి రెండేళ్లుగా పలుసార్లు తనతో ఉన్న ఏకాంత క్షణాలను వీడియో తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది.

గెలిపిస్తే మండలిలో గళమెత్తుతా

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం నగరంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. 60 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పట్టభద్రుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. తనను గెలిపిస్తే కళ్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి విధాన పరిషత్(మండలి)లో తన గళం వినిపించి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

• తాగునీరిస్తారా, లేదా?



రాయచూరు నగరం సమీపంలోనే కృష్ణా నది ప్రవహిస్తూ ఉంటుంది. కానీ అక్కడ తాగునీటి కొరత మాత్రం తీరదు. తాగునీటి సమస్యపై 16 వార్డు ప్రజలు గురువారం ఏకంగా కలెక్టర్ ఆఫీసును ముట్టడించారు. ఖాళీ బిందెలు తీసుకుని మినీ వ్యాన్లలో డీసీ ఆఫీసుకు వెళ్లి ఆందోళన చేశారు .

హుబ్లీ హత్యలపై బొమ్మై గుర్రు

యశవంతపుర: హుబ్లీలో అంజలి అనే యువతిని ప్రేమోన్మాది హత్య చేయడంపై బీజేపీ నేత బసవరాజ బొమ్మై మండిపడ్డారు. ప్రేమించకుంటే చంపేస్తానని ఉన్మాది బెదిరించాడు, రక్షణ కల్పించాలని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు, ఇంతలో ఘోరం జరిగిందని ఆరోపించారు. గురువారం అయన గదగలో విలేకరులతో మాట్లాడారు. హుబ్లీలో నేహా, అంజలి హత్యలను చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమైనట్లు ఉందని దుయ్యబట్టారు. అంజలి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హత్యను అడ్డుకోవలసిన పోలీసులు సరైన చర్యలు తీసుకోని కారణంగా అమ్మాయి ప్రాణం పోయిందని ఆరోపించారు.

ఓటేయడానికి వెళ్లి వ్యక్తి ఆత్మహత్య

యశవంతపుర: పిల్లలు పుట్టలేదని జీవితం విరక్తి కలిగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా దొడ్డమల్లాపుర గ్రామంలో జరిగింది. దొడ్డమల్లాపురకు చెందిన సంతోషకుమార్ (35)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. భార్య బెంగళూరులో ప్రైవేట్ సంస్థలో పని చేస్తుంది. ఇద్దరు బెంగళూరులో నివాసం ఉంటూ, ఎన్నికల ఓటేయడానికి ఈ నెల 7న ఊరికి వెళ్లి అక్కడే ఉన్నారు. భార్య పుట్టింటికి వెళ్లింది. 12న సంతోష్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, 14న ఈ విషయం బయట పడింది. సంతేబెన్నూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పావగడ: మొరార్జీ దేశాయి, అటల్ బిహారీ వాజపేయి విజ్ఞాన పీయూసీ వసతి కళాశాలలలో ప్రథమ పీయూసీ విజ్ఞాన విభాగం పీసీఎంబీ, పీసీఎంసీ కోర్సులకు దరఖాస్తులు అందించాలని స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ అధికారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 15 నుంచి 23లోగా దరఖాస్తు చేసుకోవాన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న మొరార్జీ దేశాయి, అటల్ బిహారీ వాజ్‌పేయి, అంబేడ్కర్, , కిత్తూరు రాణి చెన్నమ్మ, ఇందిరాగాంధి వసతి పాఠశాలలు, కళాశాలలో దరఖాస్తులు తీసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ తదితర వసతి పాఠశాలలు, కళాశాలలలో సంప్రదించాలన్నారు.

కోలారు వార్తలు...

శుభ్రతతో డెంగీకి అడ్డుకట్ట



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: గ్రామ పంచాయతీ నుంచి ప్రతి గ్రామంలో వారానికికోసారి డ్రైడే పాటించడం ద్వారా సముదాయ సహభాగత్వంతో డెంగీ నియంత్రణ సాధ్యం అని తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ ఏవీ నారాయణస్వామి పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని టీపీ సభాంగణంలో నిర్వహించిన తాలూకా స్థాయి జాతీయ డెంగీ దినోత్సవ జాగృతి కరపత్రాలను విడుదల చేసి పీడీఓలనుద్దేశించి మాట్లాడారు. జీపీల్లో వారానికోసారి నీటి సరఫరా నిలిపివేసి వాటర్‌మెన్ల సహకారంతో ఇళ్లలో నీటి నిల్వ సాధనాల స్వచ్ఛతను పరిశీలించాలన్నారు. ఇళ్లలో ఎక్కువ నీరు నిల్వ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని నిల్వ ఉంచితే దోమల ఉత్పత్తి అధికం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను తెలుసుకుని రోగాల నుంచి దూరంగా ఉండాలన్నారు. ఇంట్లో ఉన్న నీటి తొట్టిలు, డ్రమ్ములు, సింటెక్స్‌లను తరచుగా శుభ్రం చేసుకోవాలన్నారు. డెంగీని కలిగించే ఈడిస్ దోమలు పగటిపూట కుడుతుండడం వల్ల పగటి పూట నిద్ర పోయే అలవాటు ఉన్న వారు దోమతెరలను ఉపయోగించాలని సలహా ఇచ్చారు. జిల్లా ఆశ్రిత రోగాల నియంత్రణ అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సముదాయ సహభాగిత్వంతో డెంగీ నియంత్రణ అనే నినాదంతో డెంగీపై అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఆరోగ్య నిరీక్షణ అధికారి సత్యనారాయణగౌడ, ఆరోగ్య శిక్షణ అధికారి రేణుకాదేవి, బ్లాక్ ప్రోగ్రాం అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


భారీ మెజార్టీతో గెలిపించండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీటీ శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. ఆయన గురువారం పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఉపాధ్యాయుల అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును కాంగ్రెస్ అభ్యర్థికి వేసి గెలిపించాలని విన్నవించారు. పార్టీ నాయకులు ఆనేపుర హనుమంతప్ప, మాస్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయనరసింహ, సోసగెరె జీపీ అధ్యక్షుడు వినయ్‌గౌడ, ఏవై గోవిందప్ప, ఎంవీ హనుమంతప్ప, నివృత్త ఉపాధ్యాయుడు అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

మార్పునకే ఉపాధ్యాయుల ఓటు



మాట్లాడుతున్న పూర్ణిమా శ్రీనివాస్

కేజీఎఫ్: ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో 33 తాలూకాల్లోని ఉపాధ్యాయులు ఈ సారి మార్పును కోరుకుంటున్నారని హిరియూరు మాజీ ఎమ్మెల్యే పూర్ణిమా శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆమె ఆగ్నేయ ఉపాధ్యాయ క్షేత్ర కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్ తరపున నగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే రూపా శశిధర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యా రంగానికి అపార సేవలు అందించిన శ్రీనివాస్‌పై ఉపాధ్యాయులు విశ్వాసం ఉంచి ఈసారి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తారన్నారు. ఉపాధ్యాయుల అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. 7వ వేతన సంఘం సిఫార్సులను అమలు చేస్తామన్నారు. ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జ్యోతి సంజీవిని పథకం తెచ్చామని, దీనిని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉపాధ్యాయులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపా శశిధర్ ఉన్నారు.

ఫిర్యాదు ఇచ్చే భావన పెరగాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

మాలూరు: ప్రజల్లో అవినీతి అక్రమాలపై ఫిర్యాదు చేసే ధైర్యం, మనోభావన బాగా పెరగాలని లోకాయుక్త ఎస్పీ ఉమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని టీపీ కార్యాలయ సామర్థ్య సౌధ సభాంగణంలో లోకాయుక్త అధికారులు నిర్వహించిన తాలూకా జనసంపర్క సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి, సిబ్బంది వర్గం ప్రజల సమస్యలపై ప్రామాణికంగా స్పందించి నిర్దిష్ట సమయంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలు తమ సమస్యల గురించి ఫిర్యాదు చేయడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. అక్రమాలు జరిగినప్పుడు ఫిర్యాదు చేయడానికి ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఫిర్యాదు అందనిదే అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయలేమన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై కూడా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ప్రతి నెలా తాలూకా కేంద్రాల్లో నిర్వహిస్తున్న జనసంపర్క సమావేశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోకాయుక్త డీఎస్పీ నారాయణరావ్, ఇన్‌స్పెక్టర్ యశవంతరావ్, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోలారు, చిక్కబళ్లాపుర ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పదాధికారులు కోచిముల్ మేనేజింగ్ డైరెక్టర్ కెఎన్ గోపాలమూర్తికి వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విట్టప్పనహళ్లి వెంకటేష్ మాట్లాడుతూ అన్ని రకాల ఉత్పత్తిదారులకు వెన్నశాతం ఆధారంగా ధర నిర్ణయించాలని సూచించారు. అయితే ఇటీవల పాల నాణ్యత గణనీయంగా తగ్గి కేవలం 3.5 వెన్నశాతం ఉంటోందన్నారు. దీనిని అధికారులు గుర్తించాలన్నారు. సిబ్బంది నివృత్తి అయితే కేవలం రూ.2 లక్షలు మాత్రమే ఇస్తున్నారన్నారు. బెంగళూరు, చామరాజనగర పాల సమాఖ్యల్లో గరిష్టంగా రూ.8 లక్షల వరకు పరిహారం అందిస్తున్నారన్నారు. ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యం కూడా లేదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్తులో తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నహళ్లి గోపాల్, కోశాధికారి మునిరాజు, తాలూకా అధ్యక్షుడు టీ.మంజు తదితరులు పాల్గొన్నారు.

చిల్లర దొంగ అరెస్టు

హోసూరు: నడిచి వెళుతున్న వ్యక్తి వద్ద నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు శాంతినగర్ ప్రాంతంలో ఒక వలస కార్మికున్ని బెదిరించి రూ. 2 వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లాడు. ఈ ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపగా హోసూరు సమీపంలోని శ్యానమావు గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (19) దారిదోపిడీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేశారు.

నలుగురు బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు

కోలారు: నగరంలోని రహమత్‌నగర్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్న నలుగురిని గల్‌పేటె పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని మహాలక్ష్మీ కాలనీ నివాసి సయ్యద్ నిజాముద్దీన్, ముజామిల్, రహమత్‌నగర్‌కు చెందిన కుతుబ్ పాషా, షహీన్‌షానగర్‌కు చెందిన ఇమ్రాన్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు. రహమత్‌నగర్‌లో యువకులు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి జరిపి అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3400 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పట్టు పంట బుగ్గి



పరిశీలిస్తున్న వ్యవసాయ విజ్ఞాని నరేంద్రకుమార్

కోలారు: కోతకు వచ్చిన పట్టు పంట కాలిబూడిదైన ఘటన తాలూకాలోని వేమగల్ ఫిర్కా శెట్టిహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు ఎస్ఎం శ్రీనివాసగౌడ పట్టు పంటను పండించారు. సుమారు 15 ఏళ్లుగా పంటను పండిస్తూ పట్టు పురుగుల పెంపకంతో జీవిస్తున్నారు. పట్టు పురుగులు ఇప్పటికే మూడవ జ్వరంలో ఉండగా, కోతకు వచ్చిన మల్బరీ ఆకులతో సహా ఉన్నఫళంగా కాలిబూడిద కావడంతో రైతు శ్రీనివాసగౌడ ఆందోళన చెందుతున్నాడు. రైతు మల్బరీ తోటకు ఇప్పటికే వ్యవసాయ విజ్ఞాని నరేంద్రకుమార్ వెళ్లి పరిశీలించారు. కాగా ప్రభుత్వం నుంచి తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

క్లుప్తంగా

పరిహారాన్ని రుణాలకు జమ చేయడం క్రూరం

● మాజీ సీఎం కుమారస్వామి

శివాజీనగర: కేంద్రం విడుదల చేసిన కరువు పరిహార సొమ్మును రైతుల రుణాలకు జమ చేస్తున్నారని, ఇది అత్యంత క్రూరమైన విషయమని మాజీ సీఎం హెచ్‌.డీ.కుమారస్వామి మండిపడ్డారు. అన్నదాత కన్నీరు తుడవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చేతులు కట్టుకొని కూర్చొన్నదని ధ్వజమెత్తారు. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహారం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయినా ఆ సొమ్మును బ్యాంకులు రుణాలకు జమా చేసుకుంటున్నాయన్నారు. బ్యాంకుల వైఖరి క్రూరమైన విషయమన్నారు. తీవ్ర కరువు, పంటల నాశనంతో నష్టపోయిన రైతుల కళ్లల్లో రక్త కన్నీరు తీసుకొచ్చే అమానవీయ చర్యలని అంటే తప్పు కాదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బ్యాంకు అధికారులతో సమావేశాన్ని నిర్వహించి కరువు పరిహారం రుణాలకు జమ చేయరాదని ఆదేశాలు జారీ చేయాలని కుమారస్వామి డిమాండ్‌ చేశారు.

1 నుంచి 4 వరకు మద్యం విక్రయాలు బంద్‌

దొడ్డబళ్లాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బెంగళూరులో జూన్‌ 1 నుంచి 4వ తేదీ వరకు, 6వ తేదీ మద్యం విక్రయాలు నిషేధిస్తూ బెంగళూరు సిటీ పోలీస్‌ కమిషనర్‌ బి దయానంద్‌ ఆదేశాలు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఓటింగ్‌కు 48 గంటల ముందు, ఓట్ల లెక్కింపు రోజు మద్యం విక్రయాలు నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఆదేశాలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కామాంధుడి అరెస్ట్‌

మైసూరు: చెల్లెలి కూతురిపై అత్యాచారానికి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెల్లి కూతురిని ఇంట్లో దిగబెడుతానని చెప్పి కారులో ఎక్కించుకున్న రౌడీషీటర్‌ దైత్యరాజ్‌.. తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో నగర పోలీసు స్టేషన్‌లో దైత్యరాజ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుడిని మైసూరు హారోహళ్లి గ్రామంలో అరెస్టు చేశారు.

కేఈఏ ఎండీపై బదిలీ వేటు

దొడ్డబళ్లాపురం: సీఈటీ ప్రశ్నపత్రాల వ్యవహారంలో కేఈఏ ఎండీ రమ్యపై వేటు పడింది. కేఈఏ పదవి నుంచి ఆమెను తొలగించి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ స్థానంలో టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ డిపార్ట్‌మెంట్‌లో డైరెక్టర్‌గా ఉన్న ప్రసన్నను నియమించారు. సీఈటీలో 50కి పైగా సంబంధం లేని ప్రశ్నలను పొందుపరిచారు. ఇందుకు కారణమైన కేఈఏ ఎండీని బదిలీ చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు డిమాండు చేశారు. దీంతో ప్రభుత్వం తప్పనిసరిగా ఈ నిర్ణయం తీసుకుంది.

నా గెలుపునకు కృషి చేయండి



మాట్లాడుతున్న కన్నడ చళువళి వాటాల్‌ పార్టీ అధ్యక్షుడు వాటాల్‌ నాగరాజ్‌

మండ్య: దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం పోటీ చేస్తున్నట్లు, తన గెలుపునకు కన్నడ తదితర అన్ని సంఘాలు, సంస్థల నుంచి మద్దతు కావాలని కన్నడ చళువళి వాటాల్‌ పార్టీ అధ్యక్షుడు వాటాల్‌ నాగరాజ్‌ మనవి చేశారు. నగరంలోని సర్‌ ఎంవీ విగ్రహం ఎదుట వివిధ సంఘాల ముఖ్యులను కలసి మీడియాతో మాట్లాడారు. ఈసారి విధాన పరిషత్‌ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తానని, మండ్య జిల్లాలో తన అభిమానులు, వివిధ కన్నడ సంఘాలు, కార్యకర్తలు తన తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కోరారు. కన్నడ పరిరక్షణ కోసం తనపోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించి వాటిని పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

అయోధ్యకు సైకిల్‌ యాత్ర



యువకుడిని సాగనంపుతున్న విశ్వహిందూ పరిషత్‌ సభ్యులు

గౌరిబిదనూరు: అయోధ్యలో బాలరాముడిని దర్శించుకునేందుకు మంచేనహళ్లి సమీపంలోని రాయనకల్లు గ్రామానికి చెందిన యువకుడు భానుప్రకాశ్‌ (22) సైకిల్‌ యాత్ర చేపట్టాడు. గురువారం ఆయన డీ పాళ్య (దారినాయకనపాళ్య)లో తాలూకా విశ్వహిందూ పరిషత్‌ నేతృత్వంలో సాయిబాబా, ఇతర ఆలయాల్లో పూజలు నిర్వహించి సైకిల్‌పై అయోధ్యకు బయల్దేరాడు. సుమారు 40 రోజుల్లో అయోధ్య చేరుకుంటానని యువకుడు తెలిపాడు. బాలరాముడిని దర్శించుకొని వీలైతే తిరిగి సైకిల్‌పైనే స్వగ్రామానికి వస్తానని భాను ప్రకాశ్‌ తెలిపాడు. ఆయనకు వీడ్కోలు పలికిన వారిలో విశ్వహిందూ పరిషత్‌ తాలూకా అధ్యక్షుడు సాగానహళ్లి శివకుమార్‌, హోటల్‌ రమేశ్‌బాబు, మారుతి, హరీశ్‌ శెట్టి, మైలప్ప, రవి, శ్రీనివాస కల్యాణ, ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం రోడ్డులో వేగానికి కళ్లెం



కెంపేగౌడ విమానాశ్రయం రోడ్డులో ట్రాఫిక్‌ రద్దీ



కెంపేగౌడ విమానాశ్రయం

● వేగమితి గంటకు 80 కిలోమీటర్లు మించరాదు
● 34 కిలోమీటర్ల మేర వచ్చి వెళ్లే మార్గాల్లో 8 సీసీ కెమెరాలు
● రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



బనశంకరి: బెంగళూరు నగరంలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే దారి రక్తమోడుతోంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో వాహనదారులు గాయపడుతున్నారు. అతి వేగంతోనే ఈఘటనలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఇకపై 80 కిలోమీటర్లకు మించి వేగంతో వెళ్లరాదని ఆంక్షలు విధించారు. అతివేగంగా వెళ్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానా విధిస్తారు. వేగ నియంత్రణకు స్పీడ్‌ ట్రాప్‌ పరికరం అమర్చినట్లు నగర జాయింట్‌ పోలీస్‌ కమిషనర్‌ ఎంఎన్‌.అనుచేత్‌ తెలిపారు.

తిరుగు ప్రయాణంలోనే ప్రమాదాలు అధికం..

హెబ్బాల నుంచి కెంపేగౌడ విమానాశ్రయం వరకు నాలుగు, విమానాశ్రయం నుంచి వెనక్కి వచ్చే దారిలో 34 కిలోమీటర్ల మేర నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నగర ప్రదేశం నుంచి విమానాశ్రయం వరకు వెళ్లే సమయంలో కంటే తిరుగు ప్రయాణంలో అధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డులో రోజూ లక్షకు పైగా వాహనాలు సంచరిస్తున్నాయి. రోజుకు సరాసరి 300 నుంచి 600 వరకు ట్రాఫిక్‌ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. కెంపేగౌడ విమానాశ్రయానికి వాయువేగంతో వెళ్లే వాహనాలు ఆచూకీ కనిపెట్టే కెమెరాలను అమర్చామని నగర పోలీస్‌కమిషనర్‌ బీ.దయానంద్‌ తెలిపారు.

బెంగళూరు నగరంలో రోడ్డు ప్రమాదాలు...

● 2021 సంవత్సరంలో 3,213 ప్రమాదాలు జరగ్గా 654 మంది మృతి చెందారు. 621 మందికి తీవ్రమైన గాయాలయ్యాయి, 2,820 మంది గాయపడ్డారు.
● 2022లో ప్రమాదాల సంఖ్య 3,822 కాగా 772 మంది మృతి చెందారు. 752 మందికి తీవ్ర గాయాలు, 3,189 మందికి గాయాలయ్యాయి.
● 2023 సంవత్సరంలో 4,974 ప్రమాదాలు జరిగాయి. 910 మంది మృతి చెందారు. 82 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 4191 మంది గాయపడ్డారు.
● 2024 సంవత్సరం ఏప్రిల్‌ 30వరకు 1, 633 ప్రమాదాలు జరిగాయి. 310 మంది మృతి చెందగా 304 మంది తీవ్రంగా గాయపడ్డారు. 1,376 మందికి గాయాలయ్యాయి.

కెంపేగౌడ విమానాశ్రయం రోడ్డులో ప్రమాదాలు

● 2021 సంవత్సరంలో 239 ప్రమాదాలు జరిగాయి. 43 మంది మృతి చెందారు. 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 244 మంది గాయపడ్డారు.
● 2022 సంవత్సరంలో 278 ప్రమాదాలు జరిగాయి. 73 మంది మృతి చెందగా 70 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 247 మంది గాయపడ్డారు.
● 2023 సంవత్సరంలో 322 ప్రమాదాలు జరిగాయి. 87 మంది మృతి చెందారు. 85 మందికి తీవ్రమైనగాయాలయ్యాయి. 278 మంది గాయపడ్డారు
● 2024 సంవత్సరం ఏప్రిల్‌ 30వరకు 110 ప్రమాదాలు జరిగాయి. 30 మంది మృతి చెందగా 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. 111 మంది గాయపడ్డారు.



కెంపేగౌడ విమానాశ్రయం రోడ్డులో అమర్చిన స్పీడ్‌ట్రాప్‌ కెమెరా

చెక్‌ దుర్వినియోగం.. అధికారిపై కేసు

మైసూరు: చెక్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై మైసూరు మహానగర పాలికె ఆరోగ్యాధికారిపై సరస్వతీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సరస్వతీపురంలో అన్నపూర్ణ ఆఫ్‌సెట్‌ ప్రింటర్స్‌ నిర్వహిస్తున్న మీరా అనే వ్యక్తి తన వ్యవహారాల నిమిత్తం ఇచ్చిన చెక్‌లో రూ. 4.5 లక్షలను నమోదు చేసి బౌన్స్‌కు అధికారులు యత్నించారు. పాలికె సీనియర్‌ ఆరోగ్యాధికారి వెంకటేశ్‌, హాసన్‌ నివాసి కేశవమూర్తిలు ఈ మోసానికి పాల్పడ్డారు. వారిపై మీరా ఫిర్యాదు చేశారు.

పాములు కనిపిస్తే చంపొద్దు

బనశంకరి: వేసవి తాపం తాళలేక పాములు చల్లటివాతావరణం కోసం ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లోకి రావడం సహజమని, ఇళ్లలోకి, వీధుల్లోకి పాములు వస్తే భయపడి చంపరాదని పాలికె తెలిపింది. పాములను రక్షించడానికి తక్షణం సమాచారం అందించాలని కర్ణాటక ఎక్స్‌ ఖాతాలో తెలియజేసింది. పాములు కనిపనిస్తే బీబీఎంపీ సహాయవాణి 9902794711 కు ఫోన్‌చేయాలని తెలిపింది. 1972 వన్యజీవి యాక్ట్‌ ప్రకారం పాములను చంపరాదని తెలిపింది.

జన్మదిన వేడుకలకు దేవెగౌడ దూరం

శివాజీనగర: మాజీ ప్రధాని, జేడీఎస్‌ అధినేత దేవెగౌడ 91 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఈనెల 18న 92వ వసంతంలోకి అడుగు పెట్టనున్నారు. అయితే ఈసారి జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తామున్నచోట నుంచే శుభాకాంక్షలు తెలియజేయాలని దేవెగౌడ ఒక పత్రికా ప్రకటన ద్వారా కోరారు. శుభాకాంక్షలు తెలిపేందుకు ఎవరూ తమ ఇంటికి రావద్దని సూచించారు. ఎన్నో రాజకీయ ఉన్నత పదవులు అలంకరించిన దేవెగౌడకు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ఏటా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకునేవారు. కార్యకర్తలు, నాయకులు ఆయన ఇంటి వద్దకు వచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేవారు. అయితే కొన్ని కారణాలతో ఈ ఏడాది జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు దేవెగౌడ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా విధానపరిషత్‌ ఎన్నికల్లో జేడీఎస్‌–బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి బాధ్యతలను నిర్వహించాలని ఆ ప్రకటనలో కోరారు.

డెంగీ నియంత్రణకు ముందస్తు చర్యలు



జాగృతి కార్యక్రమంలో సురళ్కర్‌వికాస్‌కిశోర్‌, ఇతర అధికారులు

బనశంకరి: డెంగీ నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్‌ సురళ్కర్‌ వికాస్‌కిశోర్‌ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం బెంగళూరు నగరంలోని తూర్పు వలయం రామస్వామిపాళ్యలో ఏర్పాటుచేసిన జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షం వచ్చినప్పుడు దోమలు ఉత్పత్తి పెరుగుతుందని, దీంతో డెంగీ కేసులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం నగరంలో వర్షాలు కురుస్తున్నందున అన్ని వార్డుల్లో నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నియంత్రణకు రసాయనాలు పిచికారీ, ఫాగింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కో వార్డులో నాలుగు పిచికారీ బృందాలను నియమించినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద పూలకుండీలు, పడేసినటైర్లు, తొట్టెల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పీహెచ్‌సీ అధికారులు, ఆశా కార్యకర్తలు, నమ్మక్లినిక్‌ డాక్టర్లు ఇంటింటి సర్వేచేపట్టి డెంగీ కేసులు ఆచూకీ కనిపెడుతున్నారన్నారు. డెంగీ ప్రబలకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాలు, లౌడ్‌స్పీకర్ల ద్వారా జాగృతం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీబీఎంపీ ప్రధాన ఆరోగ్యాధికారి డాక్టర్‌ మదని, తూర్పువలయ ఆరోగ్యాధికారిణి డాక్టర్‌ భాగ్యలక్ష్మి, డెంగీ నోడల్‌ అధికారిణి సుజాత, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

‘రాష్ట్రాన్ని దివాళా తీయించిన కాంగ్రెస్‌ సర్కార్‌’

మైసూరు: పాకిస్తాన్‌, కేరళ రాష్ట్రాల తరహాలో కర్ణాటకను ఈ రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీయిస్తోందని ప్రతిపక్ష నాయకుడు ఆర్‌.అశోక్‌ ఆరోపించారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గ విధాన పరిషత్‌ ఎన్నికలకు సంబంధించి గురువారం మైసూరులోని గోవిందరావ్‌ మెమోరియల్‌ హాల్‌లో జరిగిన మైత్రి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్‌లో కేజీ బియ్యం రూ. 2 వేలు ఉందని, టీ తాగేందుకు రూ. 500 చెల్లించాలన్నారు. అక్కడి ప్రభుత్వం ఖజానాను దివాళా తీయించడమే ఇందుకు కారణమన్నారు. కేరళ రాష్ట్రం కూడా ఆర్థికంగా దివాళ అయిందన్నారు. అలాంటి పరిస్థితి కర్ణాటకలో కూడా ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నేరాలు పెరిగాయని, నేహా, అంజలి హత్యలు ఇందుకు నిదర్శనమన్నారు. దివాళ కాంగ్రెస్‌ ప్రభుత్వానికి విధాన పరిషత్‌ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మైత్రి అభ్యర్థి వివేకానంద గెలుపునకు కృషి చేయాలని కోరారు. మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ జేడీఎస్‌ కంచుకోట అయిన ఈ నియోజకవర్గంలో మైత్రి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు.

చివరి రోజు జోరుగా నామినేషన్లు



నామినేషన్‌ దాఖలు చేస్తున్న జేడీఎస్‌, బీజేపీ కూటమి అభ్యర్థి వివేకానంద

మైసూరు: విధాన పరిషత్‌లో ఖాళీ అయిన ఆరు స్థానాలకు జరగనున్న ఎన్నికకు సంబంధించి నామినేషన్ల సమర్పణ గడువు గురువారం ముగిసింది. ఈక్రమంలో చివరి రోజు నామినేషన్ల దాఖలు జోరుగా సాగింది. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి కాంగ్రెస్‌, జేడీఎస్‌–బీజేపీ మైత్రి పక్షం అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. జేడీఎస్‌–బీజేపీ మైత్రి అభ్యర్థి వివేకానంద మైసూరు ప్రాంతీయ కమిషనర్‌ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్‌ పత్రాలను సమర్పించారు. మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి, ప్రతిపక్ష నాయకుడు ఆర్‌.అశోక్‌, జేడీఎస్‌ పార్టీ కోర్‌ కమిటీ అధ్యక్షుడు జీటీదేవెగౌడ తదితరులు ఉన్నారు. నైరుతీ గ్రాడ్యుయేట్‌ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ తరఫున ఆయనూరు మంజునాథ్‌ నామినేషన్‌ దాఖలు చేశారు. మంత్రి మధు బంగారప్ప, ఎమ్మెల్యే తన్వీర్‌ సేఠ్‌ పాల్గొన్నారు. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా కేకే మంజునాథ్‌ రెండు సెట్ల నామినేషన్‌ను సమర్పించారు. నైరుతి గ్రాడ్యుయేట్‌ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా డాక్టర్‌ ధనంజయ నామినేషన్‌ పత్రాలను అందించారు. ఆయన వెంట బీజేపీ ఎంపీ బీవై రాఘవేంద్ర, ఎమ్మెల్యే టీఎస్‌ శ్రీవత్స, జేడీఎస్‌ కార్యాధ్యక్షుడు సారా మహేశ్‌ ఉన్నారు.

రెబల్‌గా నామినేషన్‌ వేయాల్సిందే

● సమావేశంలో పట్టుబట్టిన శ్రీకంఠేగౌడ మద్దతుదారులు
● కిందపడి గాయపడిన శ్రీకంఠేగౌడ

మైసూరు: దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జేడీఎస్‌ రెబెల్‌ అభ్యర్థిగా కేటీ శ్రీకంఠేగౌడ పోటీ చేయాలని మద్దతుదారులు పట్టుబట్టారు. ఈసందర్భంగా జరిగిన తోపులాట, గలాటలో శ్రీకంఠేగౌడ కిందపడి చేతికి గాయాలయ్యాయి. కేటీ శ్రీకంఠేగౌడ జేడీఎస్‌ టికెట్‌ ఆశించి భంగపడ్డారు. దక్షిణఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి వివేకానందను జేడీఎస్‌ బరిలోకి దించింది. నిరాశలో ఉన్న కంఠేగౌడ నగరంలోని ఆలమ్మ కల్యాణ మంటపంలో గురువారం తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న జేడీఎస్‌ కోర్‌కమిటీ అధ్యక్షుడు జీటీ దేవెగౌడ, కార్యాధ్యక్షుడు సారామహేశ్‌, సీఎస్‌ పుట్టరాజు అక్కడికి చేరుకుని శ్రీ కంఠేగౌడను బుజ్జగించే ప్రయత్నం చేయగా మద్దతుదారుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ మధ్యలోనే వాగ్వాదం, తోపులాట జరిగి శ్రీకంఠేగౌడ కింద పడగా చేతికి గాయమైంది. ఆయన్ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ మద్దతుదారులు ఆయన్ను వదలలేదు. నామినేషన్‌ పత్రాలను సమర్పించాలని ఒత్తిడి చేశారు. చివరికి పుట్టరాజు, జేడీఎస్‌ నాయకలు శ్రీకంఠేగౌడ మద్దతుదారులను ఒప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఎక్స్‌రే తదితర పరీక్షలను శ్రీకంఠేగౌడకు చేశారు. అంతలోనే నామినేషన్ల సమర్పణ గడువు కూడా ముగిసింది.

స్వచ్ఛతతో డెంగీని పారదోలుదాం



శిడ్లఘట్ట సర్కిల్‌లో మానవహారం

చిక్కబళ్లాపురం: ప్రాణాలు కబలించే డెంగీని పారదోలుదామని డీహెచ్‌ఓ మహేష్‌కుమార్‌ ప్రజలకు పిలుపునిచ్చారు. డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని డెంగీ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా పాలక మండలి, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పగటిపూట కరిచే ఈడీస్‌ దోమల ద్వారా డెంగీ వ్యాపిస్తుందన్నారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచిన ప్రాంతాల్లో ఈ దోమ ఉత్పత్తి అవుతుందన్నారు. పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం ద్వారా డెంగీని అరికట్టవచ్చన్నారు. డ్రమ్ములు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ శిడ్లఘట్ట సర్కిల్‌ వరకు సాగింది. అక్కడ పారామెడికల్‌ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు మానవహారం ఏర్పాటు చేసి డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఆరోగ్య శిక్షణ అధికారి హరీశ్‌, వైద్యాధికారులు ఉమా కృష్ణప్రసాద్‌, ప్రకాశ్‌ పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారం.. యువకుడి హత్య

బనశంకరి: ప్రేమ వ్యవహారం యువకుడి హత్యకు దారి తీసింది. ఈఘటన బెళగావి మాళమారుతి పోలీస్‌స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలు..గాంధీనగర నివాసి ఇబ్రహీంగౌస్‌(22) ఇదే ప్రాంతంలోని ముజమిల్‌సత్తగేరి అనే వ్యక్తి సహోదరితో ప్రేమలో ఉన్నాడు. ఇదే విషయం పై ఇద్దరిమధ్య గొడవ చోటుచేసుకుంది. గతంలో ఇబ్రహీంకు ముజమిల్‌సతేగేరి వార్నింగ్‌ కూడా ఇచ్చాడు. గురువారం ఆ యువతితో కలసి బైకులో ఇబ్రహీం వెళ్లడాన్ని ముజమిల్‌సత్తగేరి గమనించాడు. వారిని వెంబడించి స్క్రూడ్రైవర్‌తో ఇబ్రహీంపై దాడిచేసి హత్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై మాళమారుతి పోలీసులు కేసు నమోదు చేసుకుని ముజమిల్‌సత్తగేరిని అరెస్ట్‌చేశారు.

దావణగెరె వద్ద హత్య

యశవంతపుర: దావణగెరె నగరానికి చెందిన యువకుడు సమీపంలో ఓబజ్జిహళ్లి వద్ద హత్యకు గురయ్యాడు. బూదాళ్‌కు చెందిన సుదీష్‌ (24) హతుడు. ఘటనాస్థలిని ఎస్పీ ఉమా ప్రశాంత్‌, సీఐ కిరణ్‌కుమార్‌లు పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియటంలేదు. బుధవారం రాత్రి హత్య జరిగింది.

బాలికకు వేధింపులు

బాలికను మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అడ్డగించి వేధించిన ఘటన హాసన్‌ జిల్లాలో జరిగింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో బాలిక అంగడికి వెళ్లి కొనుక్కుని వెళ్తుండగా తాగుబోతు అడ్డగించి పట్టుకోవడానికి యత్నించాడు. పాప గట్టిగా కేకలు వేయడంతో ప్రజలు అతన్ని పట్టుకోవడానికి యత్నించగా పారిపోయ్యాడు.

కడుపునొప్పితో ఆత్మహత్య

మైసూరు: కడుపు నొప్పిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడో వ్యక్తి. ఈ ఘటన జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా ఒకటో బ్లాక్‌ దొడ్డ హరవే గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ (40) తరచూ కడుపు నొప్పి తో బాధపడేవాడు. దీంతో విసిగిపోయిన శ్రీనివాస్‌ ఆ బాధను భరించలేక పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి వెంటనే మడికెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మరణించాడు. మృతుని తండ్రి మటగిరి బైలకుప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజ్వల్‌ బ్లూ టిక్‌ పోయింది

దొడ్డబళ్లాపురం: లైంగిక వేధింపులు, లైంగిక దౌర్జన్యం కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్న ఎంపీ ప్రజ్వల్‌కు ఎక్స్‌లో బ్లూ టిక్‌ పోయింది. ప్రముఖులకు వెరిఫైడ్‌ అకౌంట్‌గా పేర్కొంటూ ఎక్స్‌ కొందరికి బ్లూ టిక్‌ను ఇస్తుంది. అయితే కొన్నిరోజుల నుంచి అతని ఖాతాలో బ్లూ టిక్‌ మాయమైంది. దీనిపై ఎక్స్‌ ఎటువంటి కారణాలు పేర్కొనలేదు. కొందరు వినియోగదారులు బ్లూటిక్‌ కోసం ఎక్స్‌కు డబ్బులు కూడా చెల్లిస్తారు.

పలువురికి కస్టడీ

వీడియోల కేసులో బాధిత మహిళను కిడ్నాప్‌ చేశారనే ఆరోపణపై అరెస్టైన సతీష్‌బాబును కోర్టు మే 24 వరకూ జ్యుడీషియల్‌ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో ఎమ్మెల్యే రేవణ్ణకు బెయిలు వచ్చింది. మరో నిందితుడు కీర్తిని పోలీసు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.

హోసూరు వార్తలు..

కారు ఢీకొని బైకిస్టు మృతి

కెలమంగలం: రోడ్డు పక్కన నిలిచి మిత్రునితో మాట్లాడుతున్న సమయంలో కారు ఢీకొనడంతో ఏర్పడిన ప్రమాదంలో బస్సు కండక్టర్‌ మృతి చెందిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని కళుగోపసంద్రం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి (45) బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో డెంకణీకోట వైపు వెళుతూ మార్గమధ్యలో మిత్రుడు కనిపించడంతో నిలిపి మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

వేసవి దుక్కులపై జాగృతి



రైతులకు చైతన్యం కల్పిస్తున్న అధికారులు

హోసూరు: వేసవి దుక్కితో ఉపయోగాలపై వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు చైతన్యం కల్పించారు. హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్‌ భువనేశ్వరి ఆధ్వర్యంలో గురువారం బేగేపల్లిలో వేసవి దుక్కి, మట్టిసేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంగారు వర్షాలు కురవడంతో రైతులు వేసవి దుక్కి ప్రారంభించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి వేసవి దుక్కి దున్నే విధానం, మట్టి పరీక్షల విధానాలపై చైతన్యం కల్పిస్తున్నారు. వీటి ద్వారా అదనపు దిగుబడులు పొందవచ్చునని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నష్టాల్లో మామిడి రైతులు

హోసూరు: మామిడి రైతులకు తమిళనాడు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సాగుదారులు డిమాండ్‌ చేశారు. మామిడి సాగులో క్రిష్ణగిరి జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లావ్యాప్తంగా రైతులు ఎక్కువ విస్తీర్ణంలో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంతంలో రైతులు పండించే మామిడి దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గతేడాది వర్షాలు అంతంత మాత్రమే ఉండడంతో 80 శాతం దిగుబడి పడిపోయిందని తెలిపారు. ఇప్పుడు వడగండ్లు, గాలీవానల వల్ల పంట రాలిపోతోందని వాపోయారు. తీవ్రంగా నష్టపోయామని, తమిళనాడు ప్రభుత్వం బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీనరసింహ విగ్రహ ప్రతిష్టాపన



అలంకరణలో శ్రీ లక్ష్మీదేవి ఉత్సవమూర్తి

హోసూరు: హోసూరు సమీపంలోని పాత కోట గ్రామంలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి ప్రతిష్టాపన గురువారం ఘనంగా జరిగింది. వేద పండితులచే వివిధ పూజలు, హోమాలను నిర్వహించారు. తర్వాత లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా



ఆందోళన చేస్తున్న అన్నానగర్‌ ప్రాంతవాసులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్‌ పరిధిలో గత రెండు నెలలుగా తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కార్పొరేషన్‌ యంత్రాంగం పరిష్కరించాలని అన్నానగర్‌ ప్రాంతవాసులు గురువారం ఉదయం సిటీ కార్పొరేషన్‌ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. గత ఫిబ్రవరి నుంచి వేసవి ఎండల వల్ల బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో పట్టణంలోని 45 వార్డుల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. కార్పొరేషన్‌ యంత్రాంగం కొన్ని వార్డులకే నీటిని అందిస్తున్నారు, మా పరిస్థితి ఏమిటని నిరసనకారులు ప్రశ్నించారు. పెద్దఎత్తున మహిళలు ఖాళీ బిందెలతో కార్పొరేషన్‌ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేపట్టారు. అధికారులు ఆందోళనకారులతో చర్చించి వెంటనే తాగునీరు అందే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సిడి వేడుక సందడి



సిడి ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీలో వెలసిన గ్రామదేవత పటాలమ్మ ఆలయ రథోత్సవం మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రథోత్సవం, బుధవారం పల్లక్కీ ఉత్సవం జరిగాయి. గురువారం సిడి ఉత్సవాలలో పిల్లలు పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కెలమంగలం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

నల్లత్రాచు నుంచి 'అప్సరస' వరకు..

హిమాచల్ ఎన్నికల ప్రచారంలో సరికొత్త తిట్ల దండకం

సిమ్లా: ఎన్నికలన్నాక పరస్పర విమర్శలు సహజమే. కానీ హిమాచల్‌ప్రదేశ్ ప్రచారంలో అభ్యర్థులు విమర్శలు దాటి.. వ్యక్తిగత తిట్ల వరకూ వచ్చేశారు. ఈ దండకంలో కాంగ్రెస్ నుంచి బీజేపీ వరకూ అందరూ ఆ తాను ముక్కలే. ఒకరు 'కాలే నాగ్' అంటే.. మరొకరు 'బిగ్డా షెహజాదా' అంటూ ప్రచార పదజాలంలో కొత్త తిట్లను చేరుస్తున్నారు.

ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటేసిన విషయం తెలిసిందే. వారిపై అనర్హత వేటు పడి ఆ ఆరుస్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు.. పార్టీ తిరుగుబాటుదారులను 'కాలే నాగ్'(నల్లత్రాచు)లు, బికావు (అమ్ముడుపోయినవాళ్లు) అంటూ విమర్శించారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి దేవేందర్ కుమార్ భుట్టో నియోజకవర్గమైన కుట్లేహార్‌లో సీఎం మాట్లాడుతూ.. 'భుట్టో కో కూటో' (భుట్టోను కొట్టండి) అంటూ పిలుపునిచ్చారు. సుఖూ వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయంటూ బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. ఇక 'మండీ మే భావ్ క్యా చల్ రహా హై' అంటూ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. నేను రెండాకులు ఎక్కువే చదివానంటూ రనౌత్ చెలరేగిపోయారు. రాహుల్‌గాంధీ, విక్రమాదిత్య పేర్లు చెప్పకుండా.. 'బడా పప్పు', 'ఛోటా పప్పు' అని పదేపదే వాడారు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ.. ఈ దేశానికి బ్రిటిష్ వాళ్లు వదిలి వెళ్లిన 'రోగం' అంటూ వ్యాఖ్యానించారు. 2014 వరకు చెద పురుగుల్లా దేశాన్ని తినేశారన్నారు. విక్రమాదిత్యను.. 'బిగ్డా షెహజాదా' (చెడిపోయిన యువరాజు) అంటూ సంబోధించారు. ఇక కంగనాను 'ఆమె హుస్న్ కి పరి' (అప్సరస) అని, ప్రజలు ఆమెను చూడటానికి మాత్రమే వస్తారు.. ఓట్లేయరని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రతిభా సింగ్ వ్యాఖ్యానించారు. దీనిపై కంగనా తల్లి ఆశా రనౌత్ స్పందించారు. తన కూతురును 'అప్సరస', 'క్యా చీజ్ హై' అంటున్నవాళ్లు తమ ఇళ్లలో ఆడపిల్లలున్నారన్న విషయం మరుస్తున్నారని మండిపడ్డారు.

నాసిక్



● హేమంత్ గాడ్సే

ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం, ఎగుమతి సుంకాల పెంపు తదితరాలపై ఇక్కడి రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇది అభ్యర్థులందరికీ పరీక్షగా మారింది. అధికార మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థి హేమంత్ గాడ్సే బరిలో ఉన్నారు. విపక్ష ఎంవీఏ కూటమి నుంచి శివసేన (ఉద్ధవ్) అభ్యర్థి రాజాభావు వాజే పోటీలో ఉన్నారు. దేశవ్యాప్తంగా 111 ఆశ్రమాలు, ఏడు గురుకులాలతో ప్రజల్లో బాగా పేరున్న శాంతిగిరి మహారాజ్ ఇండిపెండెంట్‌గా వీరిద్దరికీ పెను సవాలు విసురుతున్నారు. ఉల్లి రైతులను ప్రసన్నం చేసుకునేందుకు గాడ్సే, వాజే శ్రమిస్తున్నారు. సీఎం షిండే ముమ్మరంగా ప్రచారం చేశారు. వంచిత్ బహుజన్ అగాడీ నుంచి కరణ్ గైకర్ కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది.



● రాజాభావు వాజే

పాల్గఢ్



● భారతి కామ్డి

ఈ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి మహాయుతి కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి హేమంత్ విష్ణు సవర బరిలో ఉన్నారు. శివసేన (ఉద్ధవ్) నుంచి భారతి భరత్ కామ్డి పోటీ చేస్తున్నారు. బీఎస్పీ, వంచిత్ బహుజన్ అగాడీ, స్థానికంగా బలమున్న బహుజన్ వికాస్ అగాడీ కూడా పోటీలో ఉన్నాయి. దాంతో బహుముఖ పోటీ నెలకొంది. నిరుద్యోగం, వైద్య సౌకర్యాల లేమి ఇక్కడి ప్రధాన సమస్యలు. ఈ ప్రాంతానికి చెందిన ఓ మత్స్యకారుడు ఇటీవలే పాక్ జైల్లో మరణించడం, ఇక్కడ ఇద్దరు సాధువులను కొట్టి చంపడం ఎన్నికల అంశాలుగా మారాయి. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, బీజేపీ అగ్ర నేతలు సాధువుల హత్యను పదేపదే ప్రస్తావించారు. రూ.76,000 కోట్లతో ప్రతిపాదించిన వాద్వాన్ పోర్టుపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శివసేన (షిండే)కు చెందిన సిట్టింగ్ ఎంపీ రాజేంద్ర దేద్య గవిట్ బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.



● హేమంత్ విష్ణు

భివండి



● కపిల్ పాటిల్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ పాటిల్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇక్కడ ఆయనే గెలిచారు. ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఎన్సీపీ (ఎస్పీ) నుంచి సురేశ్ మాత్రే (బాల్యా మామ), స్వతంత్ర అభ్యర్థి నీలేశ్ సంబారే పాటిల్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. నియోజకవర్గంలోని 21 లక్షల ఓటర్లలో 5 లక్షల మంది ముస్లింలే. 4.5 లక్షలు కుంబి, 3 లక్షలు అగ్ర వర్గీయులున్నారు. పాటిల్, మాత్రే ఇద్దరూ అగ్ర కులస్తులు. సంబారే కుంబి వర్గానికి చెందినవారు. మాత్రే గెలుపు కోసం శరద్ పవార్ తన పలుకుబడినంతా ఉపయోగిస్తున్నారు. తమకు బాగా పట్టున్న ఈ స్థానాన్ని ఎన్సీపీకి ఇవ్వడంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తితో ఉన్నాయి. ఇది మాత్రే విజయావకాశాలపై ప్రభావం చూపేలా ఉంది.



● సురేశ్ మాత్రే

దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించే మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 48 స్థానాలకు గాను నాలుగు విడతల్లో 35 సీట్లకు ఎన్నిక ముగిసింది. మిగతా 13 నియోజకవర్గాలకు ఐదో విడతలో భాగంగా ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. రెండుగా చీలిన శివసేన, ఎన్సీపీల్లో అసలు పార్టీగా ప్రజలు దేన్ని గుర్తిస్తున్నదీ ఈ ఎన్నికలతో తేలనుంది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ పాటిల్, సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తదితరులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో తుది దశలో పోలింగ్ జరగనున్న కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

చివరి పంచ్ ఎవరిదో!



మహారాష్ట్రలో తుది అంకానికి పోరు

13 లోక్‌సభ స్థానాలకు 20న ఎన్నిక ● బరిలో కేంద్ర మంత్రులు, సీఎం కుమారుడు

ముంబై నార్త్



● పీయూష్ గోయల్

ఇక్కడ కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను బీజేపీ బరిలోకి దింపింది. రాజ్యసభ ఎంపీగా ఉన్న ఆయన ఎంపికకు ముందు గట్టి కసరత్తే చేసింది. గోయల్ కోసం తొలుత దక్షిణ ముంబై స్థానాన్ని పరిశీలించినా చివరికి ముంబై నార్త్ వైపే మొగ్గుచూపించింది. ఇది ఒకప్పుడు కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న స్థానం. 1989లో బీజేపీ నుంచి రాం నాయక్ విజయం సాధించాక పరిస్థితులు మారాయి. 2008లో లోక్‌సభ స్థానాల పునర్విభజన తర్వాత ఇక్కడ మరాఠీయేతర మధ్య తరగతి ఓటర్లు పెరిగారు. దాంతో బీజేపీ మరింత బలపడింది. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ నిరుపమ్‌పై బీజేపీ నేత గోపాల్ చిన్నయ్య శెట్టి 4.47 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో నెగ్గారు. 2019 ఎన్నికల్లో ఆయన మెజారిటీని మరింతగా పెంచుకున్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, నటి ఊర్మిళా మతోండ్కర్‌ను ఓడించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి భూషణ్ పాటిల్ పోటీ చేస్తున్నారు.



● భూషణ్ పాటిల్

ఐదో విడత పోలింగ్ జరిగే స్థానాలు

ధూలే, దిండోరి, నాసిక్, పాల్ఘర్, భివండి, కల్యాణ్, థానే, ముంబై నార్త్, ముంబై నార్త్-వెస్ట్, ముంబై నార్త్-ఈస్ట్, ముంబై నార్త్-సెంట్రల్, ముంబై సౌత్-సెంట్రల్, ముంబై సౌత్

థానే



● రాజన్ బాబూరావు

ఇక్కడ రెండు శివసేనల మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ఇతరులు పోటీలో ఉన్నా నామమాత్రమే. 2019 ఎన్నికల్లో శివసేన అభ్యర్థి రాజన్ బాబూరావు విచారే 4.12 లక్షల ఓట్ల మెజారిటీతో ఎన్సీపీ నేత ఆనంద్ పరాంజపేపై ఘన విజయం సాధించారు. ఈ విడత విచారే శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఇక మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థిగా నరేశ్ గణపత్ మాస్కే బరిలో ఉన్నారు. విచారే ముందునుంచీ ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. మాస్కేకు మద్దతుగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సేన, బీజేపీ అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. కానీ ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ కార్యకర్తలు వ్యతిరేకిస్తుండడం ప్రతికూలంగా మారింది. విచారే, మాస్కే ఇద్దరూ థానే మేయర్లుగా పనిచేసిన వారే. కానీ నగర పరిసర ప్రాంతాలు సరైన అభివృద్ధికి నోచుకోలేదన్న అసంతృప్తి స్థానికుల్లో బాగా ఉంది.



● నరేశ్ గణపత్

కల్యాణ్

అధికార మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) అభ్యర్థిగా సీఎం కుమారుడు శ్రీకాంత్ షిండే బరిలో ఉండటంతో ఆసక్తి నెలకొంది. 2014, 2019 ఎన్నికల్లోనూ శివసేన టికెట్‌పై శ్రీకాంత్ ఎన్సీపీని ఓడించారు. విపక్ష అగాడీ కూటమి నుంచి శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా వైశాలి దారేకర్ రాణే బరిలో నిలిచారు. దాంతో ఇంతకాలంగా శివసేనను ఆదరిస్తున్న ఓటర్లకు పరీక్ష ఎదురైంది. సంప్రదాయ ఓటర్లు ఈ రెండు పార్టీల మధ్య చీలితే ఎవరు గెలుస్తారన్న ఆసక్తి నెలకొంది. గత రెండుసార్లూ రెండో స్థానంలో నిలిచిన ఎన్సీపీ (ఎస్పీ) మద్దతు ఉద్ధవ్ వర్గం అభ్యర్థికి కలిసొచ్చే అంశం. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధికి తన కుమారుడు ఎంతో చేశాడని, ఈసారీ గెలిపిస్తే మిగతా పనులన్నీ పూర్తి చేస్తాడని సీఎం షిండే భరోసా ఇస్తున్నారు.



● వైశాలి దారేకర్



● శ్రీకాంత్ షిండే

అసలే ఇది ఎన్నికల సీజన్. ప్రచారం దుమ్మురేగుతోంది. మైకు దొరికితే చాలు.. నేతల హామీలకు, విమర్శల ధాటికి అడ్డూఅదుపూ ఉండటం లేదు. ఆ క్రమంలో కొన్నిసార్లు తాము ఏ పార్టీలో ఉన్నాం, ఎవరి తరఫున ప్రచారం చేస్తున్నామన్న స్పృహ లేకుండా నేతలు నోరు జారుతున్నారు. సొంత పార్టీ అభ్యర్థినే చిత్తుచిత్తుగా ఓడించండనీ, ప్రత్యర్థి పార్టీకి ఓటేయాలనీ పిలుపిస్తున్నారు! జరగాల్సిన నష్టం జరిగాక తీరిగ్గా నాలుక్కరుచుకుంటున్నారు. ఇలా టంగ్ స్లిప్పవుతున్న వారిలో కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టినవారే గాక కాకలు తీరిన నేతలు కూడా ఉండటం విశేషం. కుడిఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నారు గానీ, రాజకీయాల్లో మాత్రం నోరుజారితే నవ్వులపాలే...!!

- సాక్షి, నేషనల్ డెస్క్

నోరుజారె... పరువు పోయె..!

ప్రచారంలో నవ్వుల పాలవుతున్న నేతలు

శివపాల్.. శివ శివా!

బీజేపీని గెలిపించాలన్న సమాజ్‌వాదీ నేత

అది ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి ఒకప్పుడు గట్టి పట్టున్న ఇటావా లోక్‌సభ స్థానం. జస్వంత్ నగర్‌లో ఎన్నికల ప్రచార సభ. జనం భారీగా హాజరయ్యారు. పార్టీ చీఫ్ అఖిలేశ్ బాబాయి, సమాజ్‌వాదీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్ మాట్లాడుతున్నారు. వేదికపై ఉన్న అఖిలేశ్, ఇటావా ఎస్పీ అభ్యర్థి జితేంద్ర దోహారే తదితరులు ఆసక్తిగా వింటున్నారు. ఇంతలో శివపాల్ ఉన్నట్టుండి, 'అందుకే నేను కోరేదొక్కటే! బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించండి!!' అంటూ పిలుపునిచ్చారు. అంతటితో ఆగలేదు. 'ప్రజలంతా అఖిలేశ్ చెప్పినట్టు విని, భారతీయ జనతాపార్టీకి భారీ మెజారిటీతో విజయాన్ని అందించండి' అన్నారు. దాంతో అఖిలేశ్ బిత్తరపోగా ఇతర ఎస్పీ నేతలంతా గతుక్కుమన్నారు. నోరు జారానని గమనించిన శివపాల్ కాసేపు బీజేపీపై విరుచుకుపడ్డా జనమంతా గోలగోలగా నవ్వుకున్నారు!




అందిపుచ్చుకున్న మోదీ...

ఈ ఉదంతాన్ని తర్వాత ఇటావాలోనే జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ ప్రచారాస్త్రంగా మలచుకున్నారు. 'చూశారా! స్వయంగా ములాయం సింగ్ యాదవ్ సోదరుడు, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ బాబాయ్ కూడా బీజేపీని గెలిపించాలని కోరుతున్నారు' అంటూ చెలరేగిపోయారు. 2019లో ములాయం కూడా బీజేపీని ఆశీర్వదించారని గుర్తు చేశారు. ''2019 ఎన్నికలకు ముందు పార్లమెంట్ చివరి సెషన్లో ములాయం మాట్లాడుతూ, మీరు మళ్లీ విజయం సాధించబోతున్నారని నన్నుద్దేశించి నిండు సభలో అన్నారు. ఆ ఆశీర్వాదం ఫలించింది. ఇప్పుడు ములాయం మన మధ్య లేకున్నా ఆయన సోదరుడు బీజేపీని గెలిపించాలని కోరుతున్నారు. ఇది యాదృచ్ఛికమని నేననుకోవడం లేదు. శివపాల్ మనసులో ఉన్నదే బయటికొచ్చింది'' అంటూ చెణుకులు విసిరారు!

లోగుట్టు 'బోరా'కే ఎరుక...

స్వపక్ష ఎంపీనే ఓడించాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే!

అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే శిబమణి బోరా కూడా ఇలాగే నోరు జారారు. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారామె. జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నట్టుండి, 'ప్రద్యుత్‌ను భారీ మెజారిటీతో ఓడించాలని మీ అందరినీ అభ్యర్థిస్తున్నా. ఓడిస్తారో లేదో చెప్పండి. ఈవీఎం బటన్‌ను నొక్కి నొక్కి ప్రద్యుత్ కచ్చితంగా ఓడేలా చూడండి'' అంటూ పిలుపునివ్వడంతో అంతా ముక్కున వేలేసుకున్నారు. పొరపాటున అన్నారా, కావాలనే అన్నారా అంటూ దీనిపై తీవ్ర చర్చ కూడా జరిగింది.



అధిర్.. అయ్యో రామా!

బీజేపీకి ఓటేయడం మేలన్న కాంగ్రెస్ దిగ్గజం

వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ దిగ్గజం అధిర్ రంజన్ చౌదరి ఇటీవల ఎన్నికల ర్యాలీలో మళ్లీ నోరుజారారు. 'బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు ఓటేసే కంటే బీజేపీకి వేయడం నయం' అన్నారు! జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థి అయిన పార్టీకి ఓటేయాలని పిలుపివ్వడం పట్ల సొంత నేతలే తీవ్రంగా మండిపడ్డారు. దాంతో తాననలా అన్లేదంటూ అధిర్ మాట మార్చారు. కానీ అధికార తృణమూల్ దీన్ని మంచి అస్త్రంగా అందిపుచ్చుకుంది. బెంగాల్‌లో అధిర్ బీజేపీకి తొత్తుగా పనిచేస్తున్నారంటూ చెలరేగిపోయింది.

లాలు కూతుర్ని ఓడించండి!

సొంత పార్టీ ఎమ్మెల్సీ పిలుపు

బిహార్ రాజకీయ దిగ్గజం లాలు ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య సరన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆమెను గెలిపించుకునేందుకు అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా లాలు స్వయంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా కూతురితో పాటు పాల్గొన్న తొలి సభలోనే హంసపాదు ఎదురైంది! సొంత పార్టీ ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ మాట్లాడుతూ ''ఓటర్లు, పార్టీ కార్యకర్తలందరినీ ఒకటే కోరుతున్నా. రోహిణీ ఆచార్యను భారీ మెజారిటీతో ఓడించండి' అంటూ పిలుపునిచ్చారు. దాంతో లాలుతో పాటు వేదికపై ఉన్న ఆర్జేడీ నేతలంతా అవాక్కయ్యారు. వెంటనే తేరుకున్న సునీల్ క్షమించాలంటూ వేడుకున్నారు.





కంగనా... కన్ఫ్యూజన్!

గురి తప్పిన 'నాన్ వెజ్' విసుర్లు

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ బీజేపీలో చేరి హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తుండటం తెలిసిందే. స్టార్ క్యాంపెయినర్ అయిన ఆమె బిహార్ ఎన్నికల ర్యాలీలో ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్‌కు బదులు పొరపాటున బెంగళూరు సౌత్ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యను విమర్శించి నవ్వులపాలయ్యారు. ''దారి తప్పిన యువరాజులున్న పార్టీలకు మన దేశంలో కొదవ లేదు. చంద్రుడిపై బంగాళదుంపలు పండించాలనుకునే రాహుల్ గాంధీ కావచ్చు. నవరాత్రుల సందర్భంగా కూడా చేపలు తినే తేజస్వీ సూర్య కావచ్చు. అంతా అదే బాపతు' అంటూ కంగన విరుచుకుపడ్డారు. దాంతో భారీగా ట్రోలింగ్‌కు గురయ్యారు. తేజస్వీ యాదవ్ కూడా, 'ఇంతకీ ఎవరీ అమ్మగారు?!' అంటూ ఎద్దేవా చేశారు. దేశ తొలి ప్రధాని సుభాష్ చంద్ర బోస్ అన్న కంగనా వ్యాఖ్యల పైనా విపరీతంగా ట్రోలింగ్ జరిగింది.

కిశోరీ లాల్ శర్మ.. అమేథీలో కాంగ్రెస్ తురుపు ముక్క. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఊహించని ప్రత్యర్థి. రాజీవ్‌గాంధీ నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్‌కు నమ్మిన బంటు ఈ 63 ఏళ్ల కేఎల్ శర్మ. ఇన్నాళ్లు తెరవెనుక చక్రం తిప్పిన శర్మ ఇప్పుడు నేరుగా బరిలోకి దిగి బీజేపీతో అమీతుమీ తేల్చుకోనున్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయన బలం. గాంధీలతో మైత్రి సహా.. పలు అంశాలపై ఆయన పంచుకున్న ముచ్చట్లివి..

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇన్నాళ్లు తెర వెనుక ఉన్నారు. ఇప్పుడు తెరమీదకు వచ్చారు. ఈ మార్పు ఎలా ఉంది?

ఎన్నికలకు సంబంధించి పెద్దగా మార్పు లేదు. నేనెప్పుడూ ఒంటరిగా ఏమీ చేయలేదు. 25-30 ఏళ్లుగా నాతో కలిసి పనిచేస్తున్నవారున్నారు. కాలం మారింది.. కొత్తగా చేయాలి. టీమ్ అదే.. పని తీరే మారింది.

ఐదేళ్ల కిందట రాహుల్ ఓడిపోయిన చోట నుంచి పోటీని ఎలా చూస్తున్నారు?

గతంలో పొరపాట్లు జరిగాయి. దాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకు? ఎలా? అన్న అంతర్మథనం జరిగింది. రెండు విషయాలు బలంగా పనిచేశాయి. బీజేపీ ప్రభుత్వం నుంచి ఎదురైన ఒత్తిడితోపాటు మా వైపు నుంచి కూడా లోపాలు జరిగాయి. ఆ ఎన్నికల్లో దిశా నిర్దేశం చేసే నాథుడు లేరని కార్యకర్తలు వాపోయారు. బీజేపీ గెలిచింది 55,000 ఓట్ల తేడాతోనే. అది పెద్ద నంబర్ కాదు.



ఆమె నాకు పోటీయే కాదు!

కిశోరీ లాల్ శర్మ

ఓటమికి కారణమైన వారినే అభ్యర్థిగా నిలబెట్టారని బీజేపీ ఆరోపణ కదా!

2019 ఎన్నికల్లో నేను అమేథీలో లేను. రాయ్‌బరేలీలో పోలింగ్, ఎన్నికల నిర్వహణ చూస్తున్నాను. ఇప్పుడు నేను, నా ప్రత్యేక బృందం ఇక్కడ పనిచేస్తోంది. తేడా అదే!

'గాంధీ కుటుంబ చప్రాసి' వ్యాఖ్యలను ఎలా ఎదుర్కొంటారు?

నేనెవరినో అమేథీ, రాయ్‌బరేలీ ప్రజలందరికీ తెలుసు. 1980లో యువజన కాంగ్రెస్ కార్యకర్తగా నా రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1983లో రాజీవ్ గాంధీ జీ 20 ప్రోగ్రామ్‌ను పర్యవేక్షించడానికి కొంతమంది యువ నాయకులను ఎంపిక చేశారు. వారిలో నేను ఒకడిని. ఒకటిన్నర బ్లాకులు చూసుకోవాల్సిన బాధ్యత నాకు అప్పచెప్పారు. 'అమేథీ మే దిల్ లగ్ గయా' (అమేథీ మీద మనసు పారేసుకున్నా). ఇక్కడే ఉండిపోయాను. కొందరు నన్ను సోనియాగాంధీకి పీఏ అంటారు. ఎవరేమనుకున్నా.. నేను ప్రజాప్రతినిధిని. పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిని. స్టార్ క్యాంపెయినర్‌ని. 2013లో ఏఐసీసీ కార్యదర్శిగా, సీపీ జోషితో కలిసి బిహార్‌కు కో-ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. బిహార్‌లో కూటమి ఏర్పాటు చేసినప్పుడు 27 స్థానాల్లో విజయం సాధించాం. ఏం తెలియకుండా మాట్లాడేవారికి నేనేం చెప్పగలను?

మీ కుటుంబం?

భార్య. ఇద్దరు కూతుళ్లు. ఒకరు ఎంబీఏ చేసి మార్కెటింగ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. రెండో కూతురు వ్యాపారవేత్త.

మీ పోటీతో పార్టీలో అంతర్గత విభేదాలు పెరిగాయని భావిస్తున్నారా?

పార్టీలో అంతర్గత పోరు ఉంది. కానీ నా విషయానికి వస్తే అది లెక్కలోకి రాదు. నేను వాళ్ళ అన్నయ్య లాంటివాడిని. తిట్టగలను, ప్రేమగా మాట్లాడగలను. వాళ్లూ నాతో అలాగే ఉంటారు. పోటీకి గ్రూపులు మంచివే. కానీ పార్టీని దెబ్బ తీసే గ్రూపులు ఉండొద్దని చెబుతుంటా.

ఎన్నికల్లో పోటీ చేయమని మిమ్మల్ని ఎవరు అడిగారు?

అమేథీలోని ఇతర కార్యకర్తలు కోరుకున్నట్లే నేను కూడా రాహుల్‌జీ పోటీ చేయాలని కోరుకున్నా. కానీ నామినేషన్లకు ముందు ప్రియాంక 'కిషోరీ జీ మా కుటుంబం కోసం మీరు ఎన్నో ఎన్నికల్లో పోరాడారు. ఈ ఎన్నికల్లో మేం మీకోసం పోరాడాలనుకుంటున్నాం' అని చెప్పారు. నేను అంగీకరించాను.

మీ ప్రచారానికి చాలా తక్కువ సమయం ఉంది!

స్మృతి ఇరానీ ఎంత ప్రచారమైనా చేసుకోనీ. ఆమె అసలు నాకు పోటీయే కాదు. కష్టపడి పని చేయడమే నాకు తెలుసు. ఇక నిర్ణయం ప్రజలది. స్మృతి ఇరానీ చేస్తున్న ఆరోపణల విషయానికొస్తే, ఆమెను కించపరిచేలా నేనెప్పుడూ మాట్లాడలేదు. నాపై నోరు పారేసుకోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా.



వంటిల్లు

ఆవురావురుగా... ఆవకాయ

ఎండాకాలం... మే నెల సగం అయిపోయింది.
మామిడి కాయలు టెంక కట్టి ఎదురు చూస్తున్నాయి.
జాడీలు స్నానాలు చేసి ఎండలో సేదదీరుతుంటాయి.
ఇంట్లో మిక్సీలు గిర్ర్ర్ అంటూ గోల చేస్తుంటాయి.
మామిడి కాయలు కొట్టే కత్తి పుల్లబారి పదునుదేలింది.
ముక్కలు కొట్టండి... పళ్లెంలో వేయండి... కారం కలపండి.
జాడీలకెత్తండి... పళ్లెంలో వేడి వేడి అన్నం వేసి కలపండి.
ఇంటిల్లిపాదీ ఆవురావురుమని తినకపోతే అడగండి.



ఆంధ్రా ఆవకాయ



కావలసినవి: పచ్చి మామిడి ముక్కలు – కేజీ; పచ్చి శనగలు – 50 గ్రాములు ; సన్న ఆవాలు – పావు కేజీ ; మెంతులు – రెండు టేబుల్ స్పూన్లు ; గుంటూరు మిరప్పొడి – పావు కేజీ ; ఉప్పు – నూట యాభై గ్రాములు ; పసుపు – టేబుల్ స్పూన్ ; నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె – పావు కేజీ.

తయారీ: ● ఆవకాయ పెట్టడానికి ముందు రోజు మిరపకాయలు, ఆవాలు, మెంతులను విడిగా ఎండబెట్టాలి. మరునాడు ఉదయం ఆవాలను మిక్సీలో పొడి చేయాలి. మిరప్పొడి రెడీమేడ్‌ది కూడా తీసుకోవచ్చు. కానీ ఆవాలు స్వయంగా చేసుకోవాలి ● మామిడి కాయలను కడిగి తేమ పోయే వరకు తుడిచి ఆరబెట్టాలి. బాగా ఆరిన తర్వాత కాయలకున్న తొడిమ తొలగించాలి. అప్పటికీ సొన కారుతుంటే శుభ్రమైన నూలు వస్త్రంతో తుడిచేయాలి. ఇలా సిద్ధం చేసుకున్న మామిడి కాయలను టెంకతో సహా చిన్న ముక్కలు చేసుకోవాలి ● శనగలను శుభ్రమైన వస్త్రంతో తుడిచి పక్కన పెట్టాలి● వెడల్పుగా ఉన్న పెద్ద పాత్రలో మామిడి ముక్కలు వేయాలి. అందులో శనగలు, ఆవాల పొడి, మిరప్పొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. మెంతులు కూడా వేసి బాగా కలపాలి. చివరగా నూనె పోసి ముక్కలకు ఒత్తిడికి కలగకుండా అడుగు నుంచి కలిపితే ఆవకాయ రెడీ. దీనిని పింగాణి జాడీలో పెట్టి అంచులకు తెల్లని శుభ్రమైన నూలు వస్త్రాన్ని కట్టాలి. ఆ పైన మూత పెట్టాలి. ఈ జాడీలోని ఆవకాయను రోజూ మూత తీయకూడదు. రోజువారీ వాడుకకు అవసరమైనంత చిన్న జాడీలోకి తీసుకుంటూ ఉంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.



బెల్లం ఆవకాయ

కావలసినవి: మామిడి ముక్కలు – అర కేజీ; బెల్లం – అర కేజీ; మిరప్పొడి– 200 గ్రాములు ; ఉప్పు – 200 గ్రాములు ; ఆవ పిండి– 100 గ్రాములు ; నూనె – 200 గ్రాములు.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి తుడిచి టెంకతో సహా ముక్కలు చేసుకోవాలి ● బెల్లాన్ని తురిమి వెడల్పు పాత్రలో వేసి అందులో మామిడికాయ ముక్కలు, ఆవ పిండి, మిరప్పొడి, ఉప్పు, కప్పు నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు రోజుల పాటు ఎండలో పెట్టాలి. బెల్లం కరిగి పాకంలా జిగురుగా వచ్చినట్లనిపిస్తే సరే, లేకపోతే మూడవ రోజు కూడా ఎండలో పెట్టాలి. పాకం వచ్చిన తర్వాత మిగిలిన నూనె కూడా వేసి బాగా కలిపి జాడీలోకి తీసుకోవాలి. ఈ బెల్లం ఆవకాయను పిల్లలు బాగా ఇష్టపడతారు. ఐరన్ రిచ్ ఫుడ్ కాబట్టి మహిళలు రోజూ తీసుకోవచ్చు.

నువ్వుల ఆవకాయ



కావలసినవి: మామిడి కాయ ముక్కలు – 3 కప్పులు ; నువ్వులు – ఒకటిన్నర కప్పులు ; మిరప్పొడి– ముప్పావు కప్పు ; ఉప్పు– పావు కప్పు ; పసుపు – అర టీ స్పూన్ ; వేరు శనగ నూనె – ఒకటిన్నర కప్పులు.

తయారీ: ● నువ్వులను తయారీ దోరగా వేయించి చల్లారిన పొడి చేయాలి ● మామిడి ముక్కలను వెడల్పు పాత్రలో వేసి అందులో నువ్వుల పొడి, మిరప్పొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. ఉప్పు, కారం, నువ్వుపిండి సమంగా కలిసిన తర్వాత కప్పు నూనె పోసి మళ్లీ కలపాలి. ఈ మిశ్రమాన్ని జాడీలోకి తీసుకుని, మిగిలిన నూనెను పైన తేలేటట్లు పోయాలి. ఇందులో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



వెల్లుల్లి ఆవకాయ

కావలసినవి: మామిడి కాయ ముక్కలు – పావు కేజీ లేదా (మీడియం సైజు కాయలు 3) ; వెల్లుల్లి – 200 గ్రాములు ; ఉప్పు – 100 గ్రాములు ; మిరప్పొడి– 200 గ్రాములు ; ఆవాలు – 150 గ్రాములు (ఎండబెట్టి పొడి చేయాలి) ; పసుపు – టీ స్పూన్ ; మెంతులు – టేబుల్ స్పూన్ ; నువ్వుల నూనె లేదా వేరు శనగ నూనె – కిలో.

తయారీ: ● ఒక పాత్రలో నూనె పోసి మామిడి ముక్కలను వస్త్రంతో తుడిచి నూనెలో వేయాలి ● వెల్లుల్లి పాయలను పొట్టు వలిచి ఒక ప్లేట్‌లో వేసి గాలికి ఆరనివ్వాలి ● మరొక పాత్రలో మిరప్పొడి, ఆవపిండి, ఉప్పు, పసుపు, మెంతులు వేసి సమంగా కలిసేవరకు కలపాలి. ఇప్పుడు వెల్లుల్లి రేకలను వేసి కలపాలి ● మామిడి ముక్కల లోని నూనెను ఒక జాడీలోకి వంపాలి. ఇప్పుడు మామిడి ముక్కలలో ముందుగా కలిపి సిద్ధంగా ఉంచిన ఉప్పు, వెల్లుల్లి ఇతర పొడుల మిశ్రమాన్ని వేసి పొడులన్నీ మామిడి ముక్కలకు పట్టేలా కలపాలి. మామిడి ముక్కలను పట్టి ఉన్న నూనె ఈ పొడులను పీల్చుకుని కొంత తడి పొడిగా మారుతుంది. ఈ మిశ్రమాన్ని నూనె వంపుకున్న జాడీలో వేసి అదమాలి. నూనె పైకి తేలుతుంది. వెల్లుల్లి బ్లడ్ థిన్నర్. రక్తాన్ని పలచబరిచి రక్త నాళాల్లో పూడికలు ఏర్పడకుండా నివారిస్తుంది. కాబట్టి పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ హాయిగా తినవచ్చు.





ఫ్యాషన్

వస్త్రాలంకరణలో ప్రతీ అంశం అందంగా రూపుకట్టాల్సిందే అనే ఆలోచనల్లో నుంచి పుట్టుకు వచ్చిందే కొంగు డిజైన్. చీరకట్టులో కుచ్చిళ్లకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో పల్లూ డిజైనింగ్‌కీ అంతే ప్రత్యేకత ఉంటుంది. దారాల అల్లికలైనా.. అద్దాల అమరిక అయినా పూసల పనితనమైనా, ప్రింట్ల మెరుపు అయినా కొంగు కొత్తగా సింగారించుకుని వేడుకలలో బంగారంలా మెరిసిపోతుంది.

కొంగు సింగారం







రంగు రంగుల ఫ్యాబ్రిక్

చీరలోని రంగులతో పోటీ పడుతూ ఉండేలా ఫ్యాబ్రిక్‌తో చేసిన టాజిల్స్ కొంగుకు ప్రధాన ఆకర్షణగా మారుతుంది.

దారపు పోగులతో

ఊలు, సిల్క్, జరీ దారాలతో అల్లిన టాజిల్స్ కాటన్ చీరలకూ, పట్టు చీరల కొంగులకు ప్రత్యేక అందాన్ని తీసుకువస్తున్నాయి.

పూసల కొంగు

చీర రంగు కాంబినేషన్‌లో పూసలతో కొంగును డిజైన్ చేస్తే ఆ ప్రత్యేకత గురించి చెప్పడానికి మాటలు చాలవు. అలా డిజైనర్లు తమదైన సృజనకు మెరుగుపెడుతున్నారు. వాటిని ధరించిన వారు వేడుకలలో హైలైట్‌గా నిలుస్తున్నారు.





గవ్వలు, అద్దాలు

గిరిజన అలంకరణను అధునికపు హంగుగా మార్చడానికి గవ్వలు, అద్దాలు, ఊలు దారాల డిజైన్లను కొంగుకు అందంగా సింగారిస్తున్నారు. ఇవి ఎక్కువగా కాటన్ శారీస్ అలంకరణలో చూడవచ్చు. క్యాజువల్ వేర్‌గా నప్పే చీరలు ఈ డిజైన్ వల్ల ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.

కుచ్చుల కొంగు

చందేరీ, నెటెడ్ మెటీరియల్‌తో చీరకు జత చేసిన కొంగు కుచ్చుల అమరికతో వెస్ట్రన్ పార్టీ వేర్‌గా అలరిస్తుంది. అమ్మాయిలను అమితంగా ఈ తరహా డిజైన్స్ ఆకట్టుకుంటున్నాయి.

రెడీమేడ్..

సాదా సీదాగా కనిపించే చీర కొంగు డిజైన్‌ను మార్చాలనుకుంటే మార్కెట్లో రెడీమేడ్ పల్లూ డిజైన్స్ లభిస్తున్నాయి. హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, పూసలు, దారాల అల్లికలతో ఉన్న పల్లూ డిజైన్స్‌ని తెచ్చి చిన్న కుట్టుతో కొంగును కొత్తగా మెరిపించవచ్చు.







వెట్టి నుంచి విముక్తి వరకు

స్ఫూర్తి

మైసూరు చుట్టుపక్కల చెరుకు తోటల్లో వెట్టి పాలేర్లను పెట్టుకోవాలని చూస్తారు కొంతమంది. అప్పులిచ్చి వాళ్లను పాలేర్లుగా మారుస్తారు. తాయమ్మ కూడా ఒక వెట్టి పాలేరు. కానీ, ఆమె వెట్టి నుంచి బయట పడింది. సొంత ఉపాధి పొందింది. అంతే కాదు అప్పులపాలై వెట్టికి వెళ్లే దిగువ వర్గాల స్త్రీల విముక్తికి పోరాడుతోంది. మైసూరుకు చెందిన తాయమ్మ ఒక యోధురాలు. ధీర.



తాయమ్మ

‘అదంతా ఎలా తట్టుకున్నానో. ఇప్పుడు తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది’ అంటుంది తాయమ్మ. 33 ఏళ్ల ఈ ముగ్గురు పిల్లల తల్లి చేసిన నేరం ఏదైనా ఉంటే వెనుకబడిన వర్గాల్లో పుట్టడం. పేదరికంలో ఉండటం. ‘మా పేటల్లో సరైన ఇళ్లు ఉండవు. పరిశుభ్రత ఉండదు. మా కాలంలో మమ్మల్ని చదివించకుండా పొలాల్లో పని చేసే కూలీలను చేశారు. నేనూ నా భర్త మూర్తి ఇద్దరం పాలేరు పనులు చేస్తూనే పెళ్లి చేసుకున్నాం. ముగ్గురు పిల్లల్ని కన్నాం. వారి భవిష్యత్తు కోసం ఆరాట పడటమే మేము చేసిన నేరం’ అంటుంది తాయమ్మ.

మైసూరు జిల్లాలోని లోపలి ప్రాంతమైన హన్సూర్ అనే ఊరిలో చెరకు పండిస్తారు. రోజువారీ కూలీల కంటే వెట్టి కూలీలుగా కొందరిని పెట్టుకోవడానికి యజమానులు ప్రయత్నిస్తారు. దిగువ వర్గాల వారి ఆర్థికస్థితిని అవకాశంగా తీసుకుని వారి చేత వెట్టి చేయించుకుంటారు.

‘నా భర్త మూర్తి మాకున్న కొద్ది స్థలంలో ఒక చిన్న ఇల్లేదైనా వేసుకుందామని అనుకున్నాడు. మా ముగ్గురు పిల్లల్ని శుభ్రమైన వాతావరణంలో పెంచాలని అనుకున్నాము. అందుకు 60 వేలు అప్పు తీసుకున్నాం. ఆ కొద్ది అప్పు వడ్డీతో కలిసి మా జీవితాలను తల్లకిందులు చేసింది. అప్పు తీర్చలేకపోవడం వల్ల నేను, నా భర్త వెట్టికి వెళ్లాల్సి వచ్చింది. 2015 నుంచి 2017 వరకు మూడేళ్ల పాటు నేను, నా భర్త చెరుకు తోటల్లో వెట్టి చాకిరీ చేశాం. ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు మాకు పని ఉండనే ఉండేది. నేను నా చిన్న కొడుకును వీపున కట్టుకుని, ఇద్దరు పిల్లల్ని చెరో చేత్తో పట్టుకుని, కూడు నెత్తిన పెట్టుకుని పనికి వెళ్లేదాన్ని. పిల్లలకు ఆరోగ్యం బాగలేకపోయినా ఒకరు పొలంలో ఉండి ఒకరు ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అంత ఘోరమైన వెట్టి అది. నా పిల్లలు బాగా చదువుకుంటేనే ఇలాంటి వెట్టి నుంచి బయటపడగలరనుకున్నాను. మూడేళ్లు కష్టపడి పని చేసినా మాకు విముక్తి రాకపోయేసరికి ఎవరో అధికారులకు చెప్పి మాకు విముక్తి కలిగించారు.’ అని చెప్పింది తాయమ్మ.

స్వేచ్ఛ పొందిన తాయమ్మ, ఆమె భర్త వాళ్లకు ఉన్న ఒక కొబ్బరి చెట్టు కాయలతో చిన్న షాప్ పెట్టుకున్నారు. కర్నాటకలో వెట్టి పాలేర్ల విముక్తి కోసం పని చేసే ‘ఉదయోన్ముఖ ట్రస్ట్’ తాయమ్మకు లోన్ ఇప్పించింది– కుట్టు మిషన్ల కోసం. తాయమ్మకు కుట్టు పనిలో ఉన్న ప్రావీణ్యం ఇప్పుడు ఆమెనే కాదు, ఆమెలా వెట్టి నుంచి విముక్తి పొందిన మరికొందరు మహిళలకు కూడా ఉపాధి కలిగిస్తోంది.

‘ఇంటిని ముందుకు నడపడంలో స్త్రీ కీలకం. ఆమె ఓడిపోకూడదు. కుటుంబం కోసం పోరాడాలి. అడ్డంకులను అధిగమించాలి. అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇవాళ నా పిల్లలు బాగా చదువుకుంటున్నారు. ఈ హక్కు అందరు పిల్లలకు దొరకాలి. వలస వచ్చే కూలీలు, దిగువ కులాల పేదలు వెట్టిలో చిక్కుకుంటున్నారు. వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వారి పిల్లలకు సరైన చదువు అందేలా ప్రభుత్వాలు పని చేయాలి’ అంటోంది తాయమ్మ.

● టెక్.. టాక్



యాపిల్ ఐ ప్యాడ్ ఎయిర్

యాపిల్ ఐ ప్యాడ్ ఎయిర్ రెండు సైజులతో వచ్చింది.
11 అంగుళాల మోడల్: 2,360×1,640 పిక్సెల్ రిజల్యూషన్
ఇంటర్నల్: 128 జీబి 8జీబి ర్యామ్/256 జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 8జీబి ర్యామ్
బరువు: 462 గ్రా. కలర్స్: స్పేస్ గ్రే, స్టార్‌లైట్, పర్పుల్, బ్లూ
13 అంగుళాల మోడల్: 2,732×2.048 పిక్సెల్ రిజల్యూషన్
ప్రాసెసర్: యాపిల్ 2 ఫ్రంట్ కెమెరా: 12–మెగా పిక్సెల్స్

రియల్‌మీ 12 ప్రో



సైజ్: 6.7 అంగుళాలు
సెల్ఫీ కెమెరా: 16 ఎంపీ
రిజల్యూషన్: 2,412×1,080 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
కలర్: బ్లూ, గోల్డెన్ కలర్

గూగుల్ ఆడియో ఇమోజీ




ఆండ్రాయిడ్ యూజర్‌లకు కోసం ఆడియో ఇమోజీని పరీక్షిస్తోంది గూగుల్. ఈ ఫీచర్ ద్వారా ఫన్ సౌండ్ ఎఫెక్ట్స్‌లను ఫోన్ కాల్స్‌లో ఇంజెక్ట్ చేయవచ్చు. లాఫ్, క్లాపింగ్, అప్లాజ్, సెలబ్రేషన్‌లాంటి సౌండ్స్‌కు సంబంధించిన యానిమేషన్ ఇమోజీలను యూజర్‌లు స్క్రీన్‌పై ప్లే చేయవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్ ‘రివీల్’ స్టిక్కర్ ఉపయోగించడానికి...

ఇన్‌స్టాగ్రామ్ ‘రివీల్’ అనే కొత్త ఫీచర్‌ని రిలీజ్ చేసింది. ఫాలోవర్స్, ఫ్రెండ్స్‌కు హిడెన్ స్టోరీని పోస్ట్ చేయడానికి ఉపకరించే ఫీచర్ ఇది...
● ‘స్టోరీ’ ఆప్షన్ యాక్సెస్ కోసం లెఫ్ట్ స్వైప్ చేయాలి ● ‘స్టోరీ’ని క్రియేట్ చేయాలి ● ‘రివీల్’ స్టిక్కర్: సెర్చ్ అండ్ సెలక్ట్ ● ‘రివీల్’ స్టిక్కర్‌ను సెలెక్ట్ చేసుకున్న తరువాత మీ స్టోరీకి సంబంధించి హింట్‌ను టైప్ చేయాలి ● స్టోరీ పోస్ట్ చేసిన తరువాత మీ ఫ్రెండ్స్ మాత్రమే స్టోరీ కంటెంట్‌ను చూడగలుగుతారు.





హెడ్స్ విల్ రోల్

పొరపాటు జరిగినప్పుడు లేదా ఇతరత్రా సందర్భాలలో ఉద్యోగి చేత బలవంతంగా రాజీనామా చేయించే, డిస్మిస్ చేసే సందర్భంలో వాడే మాట...హెడ్స్ విల్ రోల్.
ఉదా: హెడ్స్ ఆర్ గోయింగ్ టు రోల్ వెన్ ది బాస్ ఫైండ్స్ ఔట్ ఎబౌట్ ది మిస్సింగ్ స్టాక్

హకునా మటాటా

‘నో ట్రబుల్. నో వర్రీస్, నో ప్రాబ్లం....అంతా నిశ్చింతం’ అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట...హకునా మటాటా. ఉదా: డోన్ట్ వర్రీ సో మచ్ ఎబౌట్ ది ఫ్యూచర్. హకునా మటాటా.

మూలం: ‘లయన్ కింగ్’ సినిమాతో హకునా మటాటా పాపులర్ అయినప్పటికీ దీని మూలం ఆఫ్రికన్ తత్వశాస్త్రంలో ఉంది. తూర్పు ఆఫ్రికాలోని స్వాహిలీ మాట్లాడే ప్రజలకు సంబంధించిన ఉటుంటు తత్వశాస్త్రం నుంచి పుట్టింది. మొదట ఈ ఎక్స్‌ప్రెషన్‌ను కెన్యా బ్యాండ్ ‘జంబో బవానా’ అనే పాటతో ప్రాచుర్యంలోకి తెచ్చింది.

● మ్యూజిక్ వరల్డ్

ముంబై మ్యాజిక్


● 1. నతనియ 2. సుభి 3. షల్మాలి

‘దేశీ ట్రిల్’ మ్యూజిక్ బ్యాండ్‌లోని ముగ్గురు గాయకులు... నతనియ లాల్వాని, సుభి, షల్మాలి ఖోల్గాడేలు ‘వావ్’ అనుకునే పాటను తీసుకువచ్చారు. ఈ కొత్త సాంగ్ ‘ముంబై మ్యాజిక్’ నిజంగానే మ్యాజిక్ చేసింది. హెరిటేజ్, హసల్, హోప్ అనే మాటలతో రూపుదిద్దుకున్న పాట ఇది. ‘ముంబైవాసిగా ఈ పాట నన్ను ఎన్నో జ్ఞాపకాల్లోకి తీసుకువెళ్లింది’ అంటుంది నతనియ. ‘దేశీ ఎట్ హార్ట్’ అని తన గురించి పరిచయం చేసుకునే సుభి న్యూయార్క్, షికాగో, లాస్ ఏంజిల్స్‌లాంటి ఎన్నో ప్రాంతాలలో నివసించింది. అయినప్పటికీ స్వదేశీ మూలాలకు ఎప్పుడూ దూరం కాలేదు. బ్రాడ్‌వే, జాజ్ లాంటి డిఫరెంట్ మ్యూజిక్ జానర్స్‌కు దేశీ టచ్ ఇచ్చింది.‘ఎన్నో విలువైన జ్ఞాపకాలకు పాట రూపం ఇచ్చే అవకాశం దక్కింది’ అంటుంది ‘ముంబై మ్యాజిక్’ గురించి. ‘ముంబై మహానగరంతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరు రిలేట్ అయ్యే పాట ఇది. ముంబై నగర ముఖచిత్రాన్ని వివిధ వర్ణాలలో అందంగా చూపిన పాట. నగరంలోని వేగాన్ని, నిశ్శబ్దాన్ని, వెలుగు, నీడలను పట్టించే పాట ఇది’ అంటుంది షల్మాలి.

యుద్ధంలో ఒకరోజు...

రియల్–టైమ్ టాక్టిక్స్, రియల్–టైమ్ స్ట్రాటజీ గేమ్ మెన్ ఆఫ్ వార్–2. 2011లో వచ్చిన మెన్ ఆఫ్ వార్: అసల్ట్ స్క్వాడ్ సీక్వెల్‌గా వస్తున్న ఈ గేమ్ వరల్డ్ వార్–2 నేపథ్యంలో సాగుతుంది. 2016లో వచ్చిన ‘మెన్ ఆఫ్ వార్’కు ఇది మోడ్రన్ రీమాస్టర్. లార్జ్ స్కేల్ టాంక్ కంబాట్ చేసే ప్లేయర్స్ కోసం స్కిమిష్ మోడ్ ఉంది.
ఇంజిన్: జెమ్ 2 ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్
జానర్స్: రియల్–టైమ్ టాక్టిక్స్, రియల్–టైమ్ స్ట్రాటజీ
మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్

● గేమింగ్



యువర్స్

ఇన్నోవేషన్

పర్యావరణధీరులు


● రాఘవ్ అరోర ● అక్షిత్ బన్సాల్ ● భాగ్యశ్రీ జైన్

‘30 అండర్ 30 ఆసియా’ తాజా జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. ఈ జాబితాలో ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండస్ట్రీస్ విభాగంలో మన దేశం నుంచి ఈవీ చార్జింగ్ కంపెనీ ‘స్టాటిక్’ ఫౌండర్స్ అక్షిత్ బన్సాల్, రాఘవ్ అరోర, ‘ది డిస్పోజల్ కంపెనీ’ ఫౌండర్ భాగ్యశ్రీ జైన్‌లు చోటు సాధించారు....

బాల్యస్నేహితులైన అక్షిత్ బన్సాల్, రాఘవ్ అరోరాలు పట్టణ వాయు కాలుష్యం గురించి ఎన్నోసార్లు మాట్లాడుకునేవారు. కాలుష్య స్థాయిలను తగ్గించడంలో ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) ప్రధాన పాత్ర పోషించడంపై కూడా మాట్లాడుకునేవారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ)కి సంబంధించిన మౌలిక చార్జింగ్ సదుపాయాలపై దృష్టి పెట్టారు. తమ పొదుపు మొత్తాలను ఉపయోగించి 2019లో ఇంట్లో తొలి ఈవీ చార్జర్‌ను తయారుచేయడంతో ‘స్టాటిక్’ ప్రయాణం ప్రారంభమైంది.

వినియోగదారులు తమ ఎలక్ట్రిక్ వాహనాలను చార్జ్ చేయడానికి సమీపంలోని చార్జింగ్ స్టేషన్‌ను గుర్తించడానికి ‘స్టాటిక్’ యాప్ ఉపయోగపడుతుంది. అగ్రశ్రేణి ఈవీ చార్జర్లు, అడ్వాన్స్‌డ్ మొబైల్ అప్లికేషన్‌లను కూడా ‘స్టాటిక్’ డెవలప్ చేసింది. ఈ స్టార్టప్ కార్పొరేట్ ఆఫీసులు, రెసిడెన్సెస్, హోటల్స్, సినిమా హాలు...మొదలైన వాటికి సంబంధించిన యజమానులతో టై అప్ అయింది. ఈ ప్రాపర్టీ వోనర్స్‌ను ‘చార్జర్ హోస్ట్స్’గా వ్యవహరిస్తారు.

హరియాణాలోని హిసార్‌లో పుట్టి పెరిగిన అక్షిత్ బన్సాల్ మణిపాల్ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఏదైనా సాధించాలనే పట్టుదలతో 2018లో ‘డెలాయిట్‌లో’ చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశాడు. స్నేహితుడు రాఘవ్ అరోర అతడికి వెయ్యి ఏనుగుల బలం అయ్యాడు. ‘విప్రో’లో డేటా సైంటిస్ట్‌గా పనిచేసిన రాఘవ్ బాల్య స్నేహితుడికి తోడుగా నిలిచాడు. ఇద్దరి కృషి ‘స్టాటిక్’కు అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

‘స్టాటిక్’ యూఎస్పీలలో ఒకటి...సింగిల్ రెవెన్యూ మోడల్‌పై మాత్రమే కంపెనీ దృష్టి పెట్టకపోవడం. సొంతంగా చార్జర్స్‌ను ఇన్‌స్టాల్ చేయడంతో పాటు. హెచ్‌పీసీఎల్, షెల్‌లాంటి పెద్ద కంపెనీల కోసం చార్జర్లను బిల్డ్ చేయడం, ఇన్‌స్టాల్, మెయింటెయిన్ చేయడం లాంటివి చేస్తోంది స్టాటిక్.

వివిధ బ్రాండ్‌లు ‘ప్లాస్టిక్ న్యూట్రల్’గా మారడానికి తన స్టార్టప్ ‘ది డిస్పోజల్ కంపెనీ’తో సహాయపడుతోంది ఢిల్లీకి చెందిన భాగ్యశ్రీ జైన్. ఈ స్టార్టప్ ద్వారా ఏడాదికి 750 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తున్నారు. నోయిడా యూనివర్శిటీలో బిబిఏ చేసిన భాగ్యశ్రీ కొన్ని సంవత్సరాలు వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇండస్ట్రీలో పనిచేసింది.

వివాహానంతరం రాజస్థాన్‌కు మకాం మార్చింది. వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫీల్డ్‌లో ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో రాష్ట్రంలో ఒక్క రీసైక్లింగ్ యూనిట్ లేదనే విషయం గ్రహించింది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలపై దృష్టి పెట్టి ‘ది డిస్పోజల్ కంపెనీ’ అనే రీసైకిలింగ్ కంపెనీ మొదలుపెట్టింది.

ఏదైనా బ్రాండ్ తమ కంపెనీలో క్లయింట్‌గా సంతకం చేసిన తరువాత ఆ బ్రాండ్‌కు సంబంధించిన ప్లాస్టిక్ ఫుట్‌ప్రింట్‌ను అంచనా వేయడానికి వన్–టైమ్ వేస్ట్ ఆడిట్ నిర్వహిస్తారు. ‘ది డిస్పోజల్ కంపెనీ’కి దేశవ్యాప్తంగా రీసైక్లర్ పాట్నర్స్, రాగ్‌పికర్స్, ఆగ్రిగేటర్స్ ఉన్నారు. 75 లక్షల రూపాయల పెట్టుబడితో ఈ రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఎక్సెంచర్, సస్టైనబిలిటీ, యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన ఈ స్టార్టప్‌కు 60 లక్షల రూపాయల సీడ్ ఫండ్ లభించింది.

పర్యావరణం, మనుషుల ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం చూపుతున్న ప్రభావం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకునే పద్ధతుల గురించి రచనలు, ఉపన్యాసాల రూపంలో ప్రజలకు అవగాహన కలిగిస్తోంది భాగ్యశ్రీ జైన్.

సినిమా

సత్యభామ నాకు స్పెషల్ - కాజల్ అగర్వాల్


● కాజల్ అగర్వాల్

‘‘సత్యభామ పాత్రలో నటించడం సవాల్‌గా అనిపించింది. ఇలాంటి పాత్ర నా కెరీర్‌లో ఇదే తొలిసారి. ఇది నా కెరీర్‌లో స్పెషల్ ప్రాజెక్ట్‌గా భావిస్తున్నాను’’ అన్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఆమె లీడ్ రోల్‌లో నటించిన సినిమా ‘సత్యభామ’. నవీన్ చంద్ర కీలక పాత్ర చేశారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ మూవీకి సమర్పకులుగా వ్యవహరించడంతో పాటు స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ‘సత్యభామ’ మ్యూజికల్ ఈవెనింగ్ పేరుతో నిర్వహించిన ఈవెంట్‌లో ఈ మూవీలోని ‘వెతుకు వెతుకు..’ అంటూ సాగే పాట రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పాడారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ‘‘నేను ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత చేసిన సినిమా ‘సత్యభామ’. మన అమ్మాయిలు క్షేమంగా ఉండాలనే పాయింట్ ఈ కథలో నన్ను ఆకట్టుకుంది’’ అన్నారు. ఈ వేడుకలో శశికిరణ్ తిక్క, శ్రీ చరణ్ పాకాల తదితరులు పాల్గొన్నారు.


● ఎన్టీఆర్

ప్రపంచ ఫిల్మ్ మేకర్స్‌ను ఏకం చేసే వేదిక ఇది

- కాన్స్ చిత్రోత్సవాల్లో భారత రాయబారి జావేద్ అష్రఫ్


● భారత్ పెవిలియన్ ప్రారంభోత్సవంలో ఓ దృశ్యం

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘భారత్ పర్వ్’ వేడుకలను తొలిసారిగా నిర్వర్తిస్తోంది భారత ప్రభుత్వం. ఈ వేడుకల్లో భాగంగానే ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘భారత్ పెవిలియన్’ను ‘ఫ్రాన్స్‌లోని భారత రాయబారి’ జావేద్ అష్రఫ్, ఎమ్ఐబీ (మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్) సెక్రటరీ సంజయ్ జాజు ప్రారంభించారు. తొలుత ఈ పెవిలియన్‌కు ‘ఇండియన్ పెవిలియన్’ పేరు అనుకున్నారట. ఆ తర్వాత ఈ పేరును ‘భారత్ పెవిలియన్’గా మార్చారు. భారత్ పెవిలియన్ ప్రారంభం సందర్భంగా... ‘‘ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్’ సినిమాతో మళ్లీ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలో నిలిచినందుకు సంతోషంగా ఉంది’’ అన్నారు సంజయ్. ‘‘కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అంటే కేవలం ఫ్యాషన్, రెడ్ కార్పెట్ మాత్రమే కాదు.. వరల్డ్ సినిమా ఫిల్మ్ మేకర్స్‌ను ఏకం చేస్తుంది. భవిష్యత్ ఫిల్మ్ మేకింగ్‌కు ఓ వేదిక అవుతుంది’’ అని పేర్కొన్నారు జావేద్ అష్రఫ్. ఈ కార్యక్రమంలో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ డిప్యూటీ ఆర్టిస్టిక్ డైరెక్టర్ క్రిస్టియన్ జ్యూన్, ఇండియన్–కెనడియన్ ఫిల్మ్‌మేకర్ రిచీ మెహతా పాల్గొన్నారు.


● కుమార్తె ఆరాధ్యతో ఐశ్వర్యా రాయ్

చేతికి ఏమైంది?... కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు రెండు దశాబ్దాలుగా తప్పకుండా హాజరవుతున్నారు ఐశ్వర్యా రాయ్. ఈ ఏడాది చిత్రోత్సవాల్లోనూ ఆమె మెరవనున్నారు. ఐశ్వర్యారాయ్, ఆమె కుమార్తె ఆరాధ్య ఫ్రాన్స్ చేరుకున్నారు. తొలిసారిగా ఐశ్వర్యా రాయ్ 2002 కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై నడిచిన విషయం గుర్తుండే ఉంటుంది. అలాగే తల్లి ఐశ్వర్యతో కలిసి 2012లో ఆరాధ్య తొలిసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిసింది. తాజాగా తన కుమార్తెతో కలిసి ఐశ్వర్య కాన్స్ చిత్రోత్సవాలకు వెళ్లిన ఫొటోలు బయటికి వచ్చాయి. ఆ ఫొటోలను గమనిస్తే.. ఆమె చేతికి కట్టు కట్టుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దాంతో ఆమెకు ఏమైంది? గాయంతో ఐశ్వర్యా రాయ్ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై ఎలాంటి కాస్ట్యూమ్‌లో కనిపించనున్నారు? అనే ఆసక్తి నెలకొంది.

కాండ్రకోటలో ఏం జరిగింది?

‘జీవితంలో కొన్నిసార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు’ (తనికెళ్ల భరణి) అనే డైలాగ్‌తో మొదలవుతుంది ‘నింద’ సినిమా టీజర్. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన ఈ సినిమాను రాజేశ్ జగన్నాథం స్వీయదర్శకత్వంలో నిర్మించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను హీరో నవీన్ చంద్ర విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. లవ్, మర్డర్ మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలు ఈ సినిమాలో ఉన్నట్లుగా తెలుస్తోంది. కాండ్రకోట మిస్టరీ అంటూ వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించినట్లుగా చిత్ర యూనిట్ పేర్కొంది. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంతు ఓంకార్ మ్యూజిక్ డైరెక్టర్.


● రాజేశ్, వరుణ్ సందేశ్, నవీన్ చంద్ర

దేవర ముంగిట నువ్వెంత!

ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు శుభవార్త. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డేని పురస్కరించుకుని ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘దేవర’ నుంచి 19న ‘ఫియర్’ అనే తొలి సాంగ్ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ‘జనతా గ్యారేజ్ ’(2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం ‘దేవర’. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు.

నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ‘దేవర’ నుంచి ‘ఫియర్..’ అంటూ సాగే పాట ఈ నెల 19న విడుదల కానుంది. ఈ పాటలో ‘దేవర ముంగిట నువ్వెంత..’ అనే పదాలు ఉన్నట్లు సమాచారం. రెండు భాగాలుగా రూపొందుతోన్న ‘దేవర’ చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ కానుంది. సైఫ్ అలీ ఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్ నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు.

ఎమర్జెన్సీ వాయిదా


● కంగనా రనౌత్

భారతదేశంలో అమలు చేయబడిన ఎమర్జెన్సీ కాలం (1975 జూన్ 25–1977 మార్చి 21) నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం ‘ఎమర్జెన్సీ’. భారత దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం ఇది. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పాడే, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, సతీష్ కౌశిక్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాను జూన్‌లో విడుదల చేయాలనుకున్నారు. కానీ విడుదల వాయిదా పడింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కంగనా రనౌత్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారామె. దాంతో కంగనా రనౌత్ రాజకీయాల పరంగా బిజీగా ఉన్న నేపథ్యంలో ‘ఎమర్జెన్సీ’ సినిమాను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర యూనిట్ వెల్లడించింది.

బస్తీ ప్రేమకథ

‘బందూక్, శేఖరంగారి అబ్బాయి’ చిత్రాల ఫేమ్ అనురూప్ రెడ్డి హీరోగా నటించిన మూడో చిత్రం ‘ప్రేమించొద్దు’. దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటించారు. శిరిన్ శ్రీరామ్ స్వీయ దర్శకత్వంలో 5 భాషల్లో నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుకలో శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ– ‘‘బస్తీ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. తెలుగులో జూన్ 7న విడుదల చేస్తాం. ఆ తర్వాత తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తాం’’ అన్నారు. ‘‘తల్లిదండ్రులు, పిల్లలు చూసేలా మా సినిమా ఉంటుంది’’ అన్నారు సూపర్ వైజింగ్ ప్రొడ్యూసర్ నిఖిలేష్ తొగరి. ‘‘ఈ సినిమా ఎంతో వాస్తవంగా ఉంటుంది’’ అన్నారు అనురూప్ రెడ్డి. నటీమణులు సంతోషి, సోనాలీ గర్జె, మానస మాట్లాడారు.


● అనురూప్, సోనాలి

సింగిల్ స్క్రీన్స్ నిండిపోతాయి - ఆశిష్

‘‘లవ్ మీ’ వంటి మంచి కథలో నటించే అవకాశం ఇచ్చిన అరుణ్, నాగలకు థ్యాంక్స్. టీజర్, ట్రైలర్ బాగుంటే సినిమాకి వస్తారు.. కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. మా చిత్రంతో మళ్లీ థియేటర్లకు కళ వస్తుంది.. సింగిల్స్ స్క్రీన్స్ అన్నీ నిండిపోతాయి’’ అని హీరో ఆశిష్ అన్నారు. అరుణ్ భీమవరపు దర్శకత్వంలో ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం ‘లవ్ మీ’. శిరీష్ సమర్పణలో ‘దిల్’ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత ‘దిల్’ రాజు మాట్లాడుతూ– ‘‘ఇంతవరకు ఎందరో దర్శకుల్ని పరిచయం చేశాను. మొదటిసారి నాగను నిర్మాతగా పరిచయం చేస్తున్నాను. న్యూ ఏజ్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ మూవీ పెద్ద హిట్టవుతుంది’’ అన్నారు. ‘‘సీతమ్మ, సతీదేవీ.. ఇలా అందరూ చనిపోయి దేవతలు అయ్యారు. దివ్యవతి చనిపోయి దెయ్యం ఎందుకు అయింది? అంటూ అర్జున్ (ఆశిష్) చేసే ప్రయాణమే ఈ చిత్రం’’ అన్నారు అరుణ్ భీమవరపు. వైష్ణవీ చైతన్య, సిమ్రాన్ చౌదరి, రవి కృష్ణ, హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి పాల్గొన్నారు.


● సిమ్రాన్, ఆశిష్, వైష్ణవీ చైతన్య

ధర్మం ముఖ్యం


● రాజ్ తరుణ్, హాసినీ సుధీర్

రాజ్‌తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘పురుషోత్తముడు’. రామ్ భీమన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హాసినీ సుధీర్ హీరోయిన్. డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ‘ఒక యుగంలో నాన్న మాట విన్న రాముడు దేవుడు అయితే... మరో యుగంలో నాన్న మాట వినని ప్రహ్లాదుడు మహనీయుడు అయ్యాడు.. ఇక్కడ మాట కాదు నాన్న... ధర్మం ముఖ్యం’ వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ‘పురుషోత్తముడు’ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ‘‘మా సినిమాను జూన్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం’’ అన్నారు. ‘‘రాజ్ తరుణ్ మా సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. ప్రమాదం జరిగినా కూడా సెట్స్‌కు వచ్చారు రామ్ భీమన. 102 డిగ్రీల జ్వరంతో కూడా హీరోయిన్ షూట్‌లో పాల్గొన్నారు. టీమ్ అంతా సహకరించారు. అతి త్వరలోనే ట్రైలర్‌ను, ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్ డేట్ చెబుతాం’’ అన్నారు నిర్మాతలు. ‘‘రాజ్ తరుణ్‌ని కొత్తగా ప్రజెంట్ చేసిన మూవీ ఇది. సినిమాకు పెద్ద నటీనటులును ఇచ్చినందుకు నిర్మాతలకు థ్యాంక్స్’’ అన్నారు రామ్ భీమన.

సాక్షి బిజినెస్
శుక్రవారం
17-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	677	73,664
నిఫ్టీ ▲	203	22,404

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,743	▲ 10
డోజోన్స్	39,939	▲ 31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,438	▼ 7
డాక్స్	18,879	▼ 131
షాంఘై	3,122	▲ 2
నికాయ్	38,920	▲ 535

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారట్)	72,170 ▲	740
బంగారం (22 క్యారట్)	68730 ▲	720
వెండి (కేజీ)	92,500 ▲	1,500

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్నింటి	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎన్నింటి	104.77	107.33
€	యూరో	ఎన్నింటి	89.80	92.16
¥	జపాన్ ఎన్ (100)	ఎన్నింటి	53.68	54.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎన్నింటి	54.62	56.56
S$	సింగపూర్ డాలర్	ఎన్నింటి	59.95	64.27
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.44	12.51

వెండి వెలుగులు @ 88,700

ఆల్‌టైం గరిష్టానికి చేరిక



న్యూఢిల్లీ: భారత్‌లో వెండి రికార్డు ధరను అందుకుంది. న్యూఢిల్లీలో ధర కేజీకి గురువారం ఒకేరోజు రూ.1,800 ఎగసి, రూ.88,700కు ఎగసింది. ఇక పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.650 ఎగసి రూ.74,050కి చేరింది. అమెరికాలో తక్కువ ద్రవ్యోల్బణం గణాంకాలు నమోదుకావడం, దీనితో సెప్టెంబర్‌లోనే ఫెడ్ ఫండ్ రేటు తగ్గించవచ్చన్న అంచనాలు మెటల్స్ ధరల పటిష్టతకు ఊతం ఇచ్చాయి. కాగా, ఈ వార్త రాస్తున్న 10 గంటల సమయంలో దేశీయ ఫ్యూచర్స్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో వెండి జూలై కాంట్రాక్ట్ ధర కేజీకి క్రితం ముగింపుతో పోల్చితే ఒక శాతం లాభంతో రూ. 87,390 వద్ద ట్రేడవుతోంది.

సెమీకండక్టర్స్ తయారీలోకి జోహో

700 మిలియన్ డాలర్ల పెట్టుబడి యోచన

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ జోహో తాజాగా సెమీకండక్టర్ల తయారీలోకి ఎంట్రీ ఇవ్వనుంది. దీనిపై 700 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే యోచనలో సంస్థ ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి కంపెనీ ప్రోత్సాహకాలు కోరుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుతం జోహో ప్రతిపాదనను ఐటీ శాఖ కమిటీ పరిశీలిస్తోందని, వ్యాపార ప్రణాళికలపై మరింత స్పష్టతనివ్వాలని కంపెనీని కోరిందని వివరించాయి. జోహో ఇప్పటికే టెక్నాలజీ భాగస్వామిని కూడా ఎంచుకున్నట్లు తెలిపాయి. 1996లో ఏర్పాటైన జోహో .. గత ఆర్థిక సంవత్సరం 1 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం నమోదు చేసింది. తమిళనాడులో చిప్ డిజైన్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీధర్ వెంబు మార్చిలో వెల్లడించిన నేపథ్యంలో తాజా వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశీయంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్, సీజీ పవర్ తదితర సంస్థలకు కేంద్రం ఫిబ్రవరిలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్‌లో సెమీకండక్టర్ల మార్కెట్ 2026 నాటికి 63 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

బ్రూక్‌ఫీల్డ్ రీట్ ఆదాయం రూ. 461 కోట్లు



న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ (బిరెట్) గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమసికంలో రూ. 461 కోట్ల నికర నిర్వహణ ఆదాయం ప్రకటించింది. గత క్యూ4తో పోలిస్తే ఇది 89 శాతం అధికం. తాజాగా రూ. 208.6 కోట్లు యూనిట్ హోల్డర్లకు పంపిణీ చేయనున్నట్లు తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ. 961 కోట్ల నుంచి రూ. 1,506 కోట్లకు పెరిగింది. మరోవైపు, భారతి గ్రూప్ నుంచి నాలుగు కమర్షియల్ ప్రాపర్టీల్లో 50 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు బిరెట్ తెలిపింది. సంస్థ విలువను రూ. 6,000 కోట్లుగా లెక్కగట్టి ఈ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీనితో బిరెట్‌లో భారతి ఎంటర్‌ప్రైజెస్ 8.53 శాతం వాటాతో రెండో అతిపెద్ద యూనిట్‌హోల్డరుగా మారనుంది.

వినీత్ నయ్యర్ కన్నుమూత



ముంబై: ఐటీ పరిశ్రమ దిగ్గజంగా పేరొందిన వినీత్ నయ్యర్ గురువారం కన్నుమూశారు. ఆయనకు 85 ఏళ్లు. ఐఏఎస్ అధికారి అయిన నయ్యర్ గెయిల్ తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు సారథ్యం వహించారు. టెక్ మహీంద్రా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నయ్యర్ మరణవార్తను మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో వెల్లడించారు. నయ్యర్ సారథ్యంలో తమ గ్రూప్ సత్యం కంప్యూటర్స్‌ను 'సాహసోపేతంగా' దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. నయ్యర్ తనకు మిత్రుడు, సోదరుడు, మార్గదర్శకుడిలాంటి వారని టెక్ మహీంద్రాకు సుదీర్ఘకాలం సీఈవోగా పని చేసిన సీపీ గుర్నాణీ పేర్కొన్నారు. ఆయన మృతిపై జీ20 షెర్పా అమితాబ్ కాంత్ సంతాపం వ్యక్తం చేశారు.

ఎంఅండ్‌ఎం లాభం ప్లస్

- క్యూ4లో రూ. 2,754 కోట్లు
- షేరుకి రూ. 21.10 డివిడెండ్
- ఈవీపై భారీ పెట్టుబడులకు సై



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్‌ఎం) గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 2,754 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 2,637 కోట్లు ఆర్జించింది. ఆటోమోటివ్, వ్యవసాయ విభాగాలు ఇందుకు సహకరించాయి. మొత్తం ఆదాయం సైతం 9 శాతం బలపడి రూ. 35,452 కోట్లకు చేరింది. వాటాదారులకు షేరుకి రూ. 21.10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి ఎంఅండ్‌ఎం నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 11,269 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 9,025 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం ఎగసి రూ. 1,39,078 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది రూ. 1,21,362 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా ఎలక్ట్రానిక్ వెహికల్స్(ఈవీ) భారీ పెట్టుబడులకు సంస్థ ప్రణాళిక రూపొందిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు బీఎస్‌ఈలో 3 % ఎగసి రూ. 2,373 వద్ద ముగిసింది.

క్రాంప్టన్ గ్రీవ్స్ ఫ్లాట్ ..

లాభం రూ. 133 కోట్లు



న్యూఢిల్లీ: క్రాంప్టన్ గ్రీవ్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 133 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 132 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,791 కోట్ల నుంచి రూ. 1,961 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 3 డివిడెండ్ ప్రకటించింది. ఆదాయంలో ఎలక్ట్రిక్ కన్జూమర్ డ్యురబుల్స్ వాటా రూ. 1,516 కోట్లుకాగా, లైటింగ్ ప్రొడక్టుల నుంచి రూ. 281 కోట్లు లభించింది. కాగా.. గతేడాది కొనుగోలు చేసిన బటర్‌ఫ్లై ఆదాయం రూ. 187 కోట్ల నుంచి రూ. 164 కోట్లకు క్షీణించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 476 కోట్ల నుంచి రూ. 442 కోట్లకు నీరసించింది. మొత్తం ఆదాయం రూ. 6,870 కోట్ల నుంచి రూ. 7,313 కోట్లకు ఎగసింది.

బీఎస్‌ఈలో క్రాంప్టన్ గ్రీవ్స్ షేరు స్వల్ప లాభంతో రూ. 339 వద్ద ముగిసింది.

గెయిల్ లాభం @ రూ. 2,177 కోట్లు



ముంబై: గెయిల్ (ఇండియా) చివరి త్రైమాసిక స్టాండెలోన్ నికర లాభం 261 శాతం దూసుకెళ్లి రూ. 2,177 కోట్లకు చేరింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం ఫ్లాట్‌గా రూ. 32,335 కోట్లను తాకింది. పూర్తి ఏడాది (2023–24)కి గెయిల్ నికర లాభం రూ. 5,302 కోట్ల నుంచి రూ. 8,836 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1.44 లక్షల కోట్ల నుంచి రూ. 1.3 లక్షల కోట్లకు క్షీణించింది.

గెయిల్ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం నష్టంతో రూ. 196 వద్ద ముగిసింది.

పోకర్ణ డివిడెండ్ 60 పైసలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పోకర్ణ లిమిటెడ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 60 పైసల డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 50 శాతం ఎగసి రూ.15 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్‌లో ఎటువంటి మార్పు లేకుండానే రూ.164 కోట్లు సాధించింది. 2023–24లో రూ.699 కోట్ల టర్నోవర్‌పై రూ.87 కోట్ల నికర లాభం దక్కించుకుంది. ఫలితాల నేపథ్యంలో పోకర్ణ షేరు ధర బీఎస్‌ఈలో గురువారం 0.62 శాతం ఎగసి రూ.502.35 వద్ద స్థిరపడింది.

బుల్ బ్యాక్ ర్యాలీ

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు ● 40 వేల పాయింట్ల పైకి డోజోన్స్



ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల మద్దతుకు తోడు బ్యాంకింగ్, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు గురువారం దాదాపు ఒక శాతం ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 677 పాయింట్లు పెరిగి 73,664 వద్ద నిలిచింది. నిఫ్టీ 203 పాయింట్లు లాభపడి 22,404 వద్ద స్థిరపడింది. అమెరికాలో ద్రవ్యోల్బణం ఊహించిన దానికంటే తక్కువగానే నమోదవడంతో ఈ ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ కనీసం రెండు సార్లు వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలు తెరపైకి వచ్చాయి. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లపై కూడా సానుకూల ప్రభావం చూపింది. ఒక దశలో సెన్సెక్స్ 762 పాయింట్లు బలపడి 73,749 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు పెరిగి 22,432 ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.07%, 0.85% లాభపడ్డాయి.

- ఇన్వెస్టర్ల సంపద గురువారం ఒక్కరోజే రూ.3.1 లక్షల కోట్లు పెరిగి బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 407.35 లక్షల కోట్లకు చేరుకుంది. మొత్తం 30కి గానూ 25 షేర్లు లాభపడ్డాయి.
- అమెరికాలో పారిశ్రామిక రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే డోజోన్స్ సూచీ తొలిసారి 40వేల పాయింట్ల పైకి చేరింది.

4 ట్రిలియన్ డాలర్లకు భారత్ ఎకానమీ: సన్యాల్



న్యూఢిల్లీ: భారత్ 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాన మంత్రికి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ–పీఎం) సభ్యుడు సంజీవ్ సన్యాల్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని విశ్లేషించారు. మరో రెండేళ్లలో జర్మనీని అధిగమించి మూడవ స్థానాన్ని ఆక్రమిస్తుందన్నారు.

42 కోట్లకు విమాన ప్రయాణికుల ట్రాఫిక్

2024–25పై ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య వార్షికంగా సుమారు 8–11 శాతం వృద్ధితో 40.7 కోట్లు–41.8 కోట్ల రికార్డు స్థాయిని తాకే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. అలాగే నిర్దిష్ట ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ల ఆదాయాలు 15–17 శాతం మేర పెరగొచ్చని ఒక నివేదికలో వివరించింది. గత ఆర్థిక సంవత్సరం విమాన ప్రయాణికుల రద్దీ కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 10 శాతం పెరిగి 37.64 కోట్లుగా నమోదైంది.

వొడాఫోన్ ఐడియా మళ్లీ డీలా



న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా మరోసారి డీలా పడింది. చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం మరింత పెరిగి రూ. 7,675 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 6,419 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తం ఆదాయం ఫ్లాట్‌గా రూ. 10,607 కోట్లకు చేరింది. వెరసి పూర్తి ఏడాదిలోనూ నష్టం పెరిగి రూ. 31,238 కోట్లను దాటింది. 2022–23లో రూ. 29,301 కోట్ల నష్టం ప్రకటించింది.

బీఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేరు దాదాపు యథాతథంగా రూ. 13.15 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్లో నిఖత్ జరీన్

ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ నిఖత్ జరీన్ (52 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లింది. కజకిస్తాన్‌లోని అస్తానా నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ చాంపియన్ నిఖత్ 5–0తో తొమిరిస్ మిర్జాకుల్ (కజకిస్తాన్)పై ఘన విజయం సాధించింది. భారత్‌కే చెందిన మీనాక్షి (48 కేజీలు), అనామిక (50 కేజీలు), మనీషా (60 కేజీలు) కూడా ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో మీనాక్షి 5–0తో గుల్నాజ్ బురిబయేవా (కజకిస్తాన్)పై, మనీషా 5–0తో టాంగటార్ అసెమ్ (కజకిస్తాన్)పై గెలిచారు. మరోవైపు సోనూ (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు) సెమీఫైనల్లో నిష్క్రమించి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల విభాగంలో భారత బాక్సర్లు సొయిబమ్ సింగ్ (48 కేజీలు), అభిషేక్ యాదవ్ (67 కేజీలు), విశాల్ (86 కేజీలు), గౌరవ్ చౌహాన్ (ప్లస్ 92 కేజీలు) నేడు సెమీఫైనల్స్‌లో పోటీపడనున్నారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు సునీల్ ఛెత్రి గుడ్‌బై

జూన్ 6న కువైట్‌తో చివరిసారి టీమిండియా తరఫున బరిలోకి

ప్రొఫెషనల్ లీగ్‌లలో కొనసాగనున్న భారత స్టార్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. వచ్చే నెల 6న ప్రపంచకప్ ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా కువైట్‌తో జరిగే మ్యాచే తన కెరీర్‌లో చివరిదని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా భావోద్వేగపు వీడియోలో సునీల్ ఛెత్రి ప్రకటించాడు. అయితే ప్రైవేట్, క్లబ్, ఫ్రాంచైజీ లీగ్‌లలో కొనసాగుతానని 39 ఏళ్ల ఛెత్రి స్పష్టం చేశాడు. 2005లో అరంగేట్రం చేసిన ఈ స్టార్ ఫుట్‌బాలర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు (19 ఏళ్లు) భారత జట్టుకు సేవలందించాడు. ఢిల్లీకి చెందిన ఆర్మీ అధికారి కేబీ ఛెత్రి, సుశీల దంపతులకు 1984, ఆగస్టు 3న సికింద్రాబాద్ (తెలంగాణ)లో జన్మించిన ఛెత్రి భారత ఫుట్‌బాల్‌లో అసాధారణ ఫార్వర్డ్ ఆటగాడిగా ఎదిగాడు. తదనంతరం నాయకత్వ పటిమతో విజయవంతమైన సారథి అయ్యాడు. భారత ఫుట్‌బాల్ చరిత్రలో చురుకైన దిగ్గజంగా వెలుగొందుతున్నాడు.

ఇవి ఘనతలు

- 150 అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన సునీల్ 94 గోల్స్ కొట్టాడు. భారత్ తరఫున టాప్ స్కోరర్ కాగా... ఓవరాల్‌గా ఫుట్‌బాల్ చరిత్రలో జాతీయ జట్టు తరఫున ఎక్కువ గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో టాప్–3లో ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో (128 గోల్స్; పోర్చుగల్), మెస్సీ (106 గోల్స్; అర్జెంటీనా) తర్వాతి స్థానం మన ఛెత్రిదే!
- మూడు సార్లు భారత జట్టు నెహ్రూ కప్ అంతర్జాతీయ టోర్నీ (2007, 2009, 2012) టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు.
- దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) చాంపియన్‌షిప్‌ల్లో భారత్ మూడు (2011, 2015, 2021) టైటిల్ విజయాలకు కృషి చేశాడు.
- 2008లో ఏఎఫ్‌సీ చాలెంజ్ కప్‌ను గెలిపించిన ఛెత్రి, ఏడుసార్లు 'ఏఐఎఫ్‌ఎఫ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు. భారత్‌లోని ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్‌లైన ఈస్ట్ బెంగాల్, డెంపో, ముంబై సిటీ ఎఫ్‌సీ, బెంగళూరు ఎఫ్‌సీలకు ప్రాతినిధ్యం వహించాడు. ఆయా జట్లకు లీగ్ ట్రోఫీలు అందించాడు.

'అతనో ఫుట్‌బాల్ శిఖరం'

భారత బ్యాటింగ్ కింగ్ కోహ్లి, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా తదితరులంతా ఛెత్రి ఘనతల్ని కొనియాడారు. సోషల్ మీడియా వేదికగా వారంతా అతనొక రియల్ లెజెండ్‌గా కితాబిచ్చారు. బీసీసీఐ, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ సైతం ఛెత్రి సేవలకు సెల్యూట్ చేశాయి.





సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్, కోచ్ వెటోరి

ప్లే ఆఫ్స్‌కు సన్‌రైజర్స్

- 15 పాయింట్లతో మూడో స్థానానికి హైదరాబాద్
- గుజరాత్‌తో మ్యాచ్ రద్దు
- భారీ వర్షంతో సాధ్యం కాని ఆట
- ఆదివారం పంజాబ్‌తో ఆఖరి పోరు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరాన్ని ముంచెత్తిన వాన దెబ్బ ఐపీఎల్ మ్యాచ్‌పై కూడా పడింది. గురువారం కురిసిన భారీ వర్షానికి ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ రద్దయింది. వాన తెరిపినివ్వకపోవడంతో కనీసం టాస్ కూడా వేసే అవకాశం రాలేదు. మధ్యాహ్నం తర్వాత కురిసిన వానకు నగరం మొత్తం జలమయమైంది. రాజీవ్‌గాంధీ స్టేడియంలో కూడా అవుట్‌ఫీల్డ్‌ను కవర్స్‌తో కప్పేశారు. అయితే ఏ దశలోనూ వాన పూర్తిగా ఆగలేదు. టాస్ కాస్త ఆలస్యం కాగా... నిర్ణీత రాత్రి 7:30 గంటల సమయంలో కాస్త తగ్గినట్లు అనిపించింది. కానీ వెంటనే చిరు చినుకులతో మొదలై మళ్లీ విరామం లేకుండా కురిసింది. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ నిర్వహించాలన్నా రాత్రి 10:15 గంటలకు పూర్తిగా వాన ఆగాలి. కానీ అలా జరగలేదు. దాంతో అంపైర్లు గ్రౌండ్‌ను పరిశీలించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గుజరాత్ జట్టు వరుసగా రెండో మ్యాచ్ కూడా రద్దు కావడం గమనార్హం. ఈ ఫలితంతో సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌ల తర్వాత 15 పాయింట్ల వద్ద మూడో స్థానంలో నిలిచింది. దాంతో టీమ్‌కు ప్లే ఆఫ్స్ స్థానం ఖాయమైంది. ఆదివారం సన్‌రైజర్స్ సొంతగడ్డపైనే పంజాబ్ కింగ్స్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ గెలిచి... అదే రోజు రాత్రి కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తమ చివరి మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ ఓడితే సన్‌రైజర్స్‌కు రెండో స్థానం ఖాయమవుతుంది. 2020లో చివరిసారి ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 2021, 2022, 2023 సీజన్లలో వరుసగా 8వ, 8వ, 10వ స్థానాల్లో నిలిచింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X లక్నో
వేదిక: ముంబై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఒలింపిక్స్‌కు శ్రీజ

'పారిస్' విశ్వ క్రీడల్లో పాల్గొనే భారత టీటీ జట్ల ప్రకటన



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లను అఖిల భారత టేబుల్ టెన్నిస్ సంఘం (టీటీఎఫ్‌ఐ) గురువారం ప్రకటించింది. మే 16న అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్ ప్రకారం భారత్ నుంచి టాప్–3లో ఉన్న క్రీడాకారులను జట్లలోకి ఎంపిక చేశారు. తొలిసారి టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడనుంది. పురుషుల, మహిళల టీమ్ విభాగంలో ముగ్గురి చొప్పున ఎంపిక చేయగా... ఈ ముగ్గురిలో టాప్–2లో ఉన్న ఇద్దరు సింగిల్స్ విభాగాల్లోనూ పోటీపడతారు. ఒక్కొక్కరిని రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. తుది జట్టులో ఎవరైనా గాయపడి అందుబాటులో లేకపోతే రిజర్వ్ ప్లేయర్‌ను ఆడిస్తారు. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్‌గా ఉన్న ఆచంట శరత్ కమల్ ఐదోసారి ఒలింపిక్స్‌లో పాల్గొనుండటం విశేషం. పారిస్ ఒలింపిక్స్ జూలై 24 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

భారత పురుషుల జట్టు: శరత్ కమల్, హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్, సత్యన్ జ్ఞానశేఖరన్ (రిజర్వ్). **భారత మహిళల జట్టు:** మనిక బత్రా, శ్రీజ, అర్చన కామత్, అహిక ముఖర్జీ (రిజర్వ్).

మనిక పరాజయం



కపాడోసియా (టర్కీ): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 24వ ర్యాంకర్ మనిక 11–5, 4–11, 5–11, 11–13తో హిటోమి సాటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. భారత్‌కే చెందిన కృత్విక రాయ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో కృత్విక 12–10, 11–4, 11–7తో వెరోనికా (ఉక్రెయిన్)పై నెగ్గింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సానిల్ శెట్టి–హర్మీత్ దేశాయ్ (భారత్) ద్వయం 8–11, 11–6, 6–11, 6–11తో ఎస్టెబన్ డోర్–ఫ్లోరియన్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో పోమంతి బైస్యా–కృత్విక రాయ్ (భారత్) జంట 11–7, 11–1, 14–12తో ఫ్రాన్‌జిస్కా (జర్మనీ)–యశస్విని (భారత్) జోడీపై గెలిచి ఫైనల్ చేరింది.



క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం మరో విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్–చిరాగ్ జోడీ 21–16, 21–11తో జి సావో నాన్–జెంగ్ వె హాన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మైస్నం మిరాబా లువాంగ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ మణిపూర్ ఆటగాడు 21–14, 22–20తో మాడ్స్ క్రిస్టోఫెర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన అశ్విని–తనీషా ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–19, 21–17తో హంగ్ ఎన్ జు–లిన్ యు పె (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అష్మిత (భారత్) 15–21, 21–12, 12–21తో హాన్ యువె (చైనా) చేతిలో ఓడిపోయింది.

అర్జున్‌కు రెండో గెలుపు



న్యూఢిల్లీ: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్‌కు రెండో విజయం లభించింది. గురువారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో అర్జున్ 44 ఎత్తుల్లో నికోలోజి కచరావా (జార్జియా)పై గెలుపొందాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశాడు. సేతురామన్ (భారత్)తో జరిగిన గేమ్‌ను రిత్విక్ 61 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు.

విత్తనాలు రెడీ

ఖరీఫ్ కోసం సబ్సిడీపై 6.19 లక్షల క్వింటాళ్ల విత్తనాలు • పంపిణీకి అనుమతి ఇచ్చిన ఎన్నికల కమిషన్

ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టిన వ్యవసాయ శాఖ • రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం సబ్సిడీ విత్తనాల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఇప్పటికే పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేశారు. గురువారం నుంచే విత్తనాలు కోరే రైతుల వివరాల నమోదు మొదలవగా, 20వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. జూన్ 5వ తేదీ నుంచి వరి, ఇతర విత్తనాల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన సబ్సిడీ విత్తనం పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇండెంట్ మేరకు సేకరించిన విత్తనాలను మండల కేంద్రాల్లో నిల్వ చేశారు. అయితే.. పోలింగ్ ముగిసే వరకు పంపిణీ చేపట్టవద్దంటూ ఈసీ ఆంక్షలు విధించడంతో బ్రేకులు పడ్డాయి. పోలింగ్ ప్రక్రియ ముగియటంతో ఈసీ ఆంక్షలు సడలించింది. దీంతో విత్తనాల పంపిణీకి ఏపీ విత్తనాభివృద్ధి సంస్థతో కలిసి వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది.


ఆర్బీకేల ద్వారా పంపిణీకి సిద్ధం చేసిన పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాలు

ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం



ఖరీఫ్ సీజన్‌కు సర్టిఫై చేసిన విత్తనాలను సిద్ధం చేశాం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. ప్రస్తుతం ఆంక్షలు సడలించడంతో ఆర్బీకేల ద్వారా విత్తన పంపిణీకి చర్యలు చేపట్టాం. ఆర్బీకేల్లో రైతుల రిజిస్ట్రేషన్ మొదలైంది.

– ఎం.శివప్రసాద్, ఎండీ, ఏపీ సీడ్స్

పంపిణీకి విత్తనాలు సిద్ధం



సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన విత్తనాలను ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టాం. రైతుల ద్వారా సేకరించిన విత్తనంతో పాటు అవసరం మేరకు ఏపీ సీడ్స్ ద్వారా ప్రైవేట్ కంపెనీల నుంచి సేకరించి అగ్రి ల్యాబ్‌లలో వాటి నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతే రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

– చేవూరు హరికిరణ్, ప్రత్యేక కమిషనర్, వ్యవసాయ శాఖ

కేవీకే, ఏఆర్‌ఎస్‌లలో ఫౌండేషన్, సర్టిఫైడ్ సీడ్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే), వ్యవసాయ పరిశోధనా స్థానాలు (ఏఆర్‌ఎస్) కేంద్రాల్లో 7,941.35 క్వింటాళ్ల వరి, 2,404.50 క్వింటాళ్ల వరి విత్తనాన్ని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సిద్ధం చేసింది. బ్రీడర్ సీడ్ కిలో రూ.77.80 చొప్పున, ఫౌండేషన్ సీడ్ (ఎన్‌డీఎల్ఆర్7) కిలో రూ.50 చొప్పున, సర్టిఫైడ్, నమ్మదగిన సీడ్ (ఎన్‌డీఎల్ఆర్–7) కిలో రూ.42 చొప్పున ధర నిర్ణయించి అందుబాటులో ఉంచారు. బీపీటీ 5204, 2270, 2782, 2595, 2846, 2841, ఎన్‌డీఎల్ఆర్ 8, ఎంటీయూ 1262, 1271, 1224, ఎంసీయూ 103, ఆర్‌జీఎల్ 2537 వంటి ఫైన్ వెరైటీస్‌కు చెందిన ఫౌండేషన్ సీడ్ కిలో రూ.45, సర్టిఫైడ్ సీడ్ కిలో రూ.42, ఇతర వరి రకాల ఫౌండేషన్ సీడ్ కిలో రూ.40, సర్టిఫైడ్ సీడ్ కిలో రూ.38 చొప్పున ధర నిర్ణయించి రైతులకు అందుబాటులో ఉంచారు. కనీసం 25–30 కేజీల ప్యాకింగ్‌తో విత్తనం సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీనివాస్ తెలిపారు.

రూ.450 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం

ఖరీఫ్ కోసం 6.19 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేశారు. వీటిలో ప్రధానంగా 2.26 లక్షల క్వింటాళ్ల వరి, 2.99 లక్షల క్వింటాళ్ల వేరుశనగ, 69 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నాయి. గతంలో మాదిరిగానే 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 50 శాతం సబ్సిడీపై చిరుధాన్యాలు, 40 శాతం సబ్సిడీపై వేరుశనగ, నువ్వులు, 30 శాతం సబ్సిడీపై అపరాల విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. వరి విత్తనాలకు మాత్రం జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) పరిధిలోని జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.1,000, మిషన్ పరిధిలో లేని జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో విత్తన పంపిణీ కోసం రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. రూ.195 కోట్లను సబ్సిడీ రూపంలో భరించనుంది.

క్లుప్తంగా...

గిరిజన కాలేజీల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన 19 జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కార్యదర్శి ఎస్.భార్గవి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుల గడువును ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు. వివరాలకు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

24న డీఎడ్ ప్రవేశ పరీక్ష
నేటినుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

సాక్షి, అమరావతి: జిల్లా విద్య అండ్ శిక్షణ సంస్థ (డైట్)ల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'డీ-సెట్-2024' ఈ నెల 24న నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. హాల్‌టికెట్లను అధికారులు కమిషనరేట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. హాల్‌టికెట్లలో తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రత్యేక హెల్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి హాల్‌టికెట్లను https://cse.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. హాల్‌టికెట్లలో తప్పులుంటే 81250 46997, 8121947387కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తప్పులను సవరించి హాల్‌టికెట్లను తిరిగి వెబ్‌సైట్‌లో ఉంచుతారని తెలిపారు. కాగా, డీఎడ్ కోర్సుకు గతేడాది 3,000 మంది దరఖాస్తు చేసుకోగా, ఈసారి ఆ సంఖ్య 4,950కి పెరిగింది.

తొలి రోజు ఈఏపీ సెట్‌కు 90.61% హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఈఏపీ సెట్-2024 పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ప్రసాదరాజు గురువారం తెలిపారు. అగ్రికల్చర్-ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 44,017 మందికి గాను 39,886 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. 2 సెషన్లలో కలిపి 90.61% హాజరు నమోదైందన్నారు. సెట్ కన్వీనర్ వెంకటరెడ్డి, కో-కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించినట్లు చెప్పారు.

జీఎస్టీ ట్రిబ్యునల్‌లో టెక్నికల్ మెంబర్ నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రెండో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో రాష్ట్రం నుంచి టెక్నికల్ మెంబర్ నియామకం కోసం వాణిజ్య పన్నుల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జీఎస్టీ చెల్లింపుల్లో తలెత్తే వివాదాలను పరిష్కరించడం కోసం విశాఖ, విజయవాడల్లో రెండు అప్పిలేట్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో వ్యాట్, ఎస్‌జీఎస్టీ, ఆల్ ఇండియా సర్వీసెస్‌లో అడిషనల్ కమిషనర్ ఆపై స్థాయి ఉద్యోగులు ట్రిబ్యునల్ మెంబర్‌గా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. 50 ఏళ్ల లోపు వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 12 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేయాల్సిందిగా వాణిజ్యపన్నుల శాఖ తెలిపింది.

ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం

• సుప్రీం కోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ : ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని వివరించింది. రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను సవాల్ చేస్తూ దండ నాగేంద్రకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) విచారణ జరిపింది. పర్యావరణ అనుమతులు తీసుకునేంత వరకు తవ్వకాలు నిలిపివేయాలంటూ గత ఏడాది మార్చిలో తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ జైప్రకాష్ పవర్ వెంచర్స్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది అహ్మదీ హుజేఫా తొలుత వాదనలు వినిపిస్తూ.. గత నెలలో కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. ప్రతివాది నాగేంద్ర కుమార్ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. తమకు 6వ తేదీన ఫిర్యాదు వచ్చిందని, చర్యలు తీసుకుంటున్నామని హుజేఫా తెలిపారు. ఈ అంశంపై కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నివేదిక ఎందుకు సమర్పించలేదని న్యాయమూర్తి జస్టిస్ ఓకా ప్రశ్నించారు. తాము అఫిడవిట్ దాఖలు చేయడానికి మరో నాలుగు వారాలు సమయం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. వాదనలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం .. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. జిల్లాల్లో కమిటీలు వేయాలని సూచించింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో జిల్లా కమిటీలు తనిఖీలు చేసి జులై 8వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

పాలన బాగుంటే పోలింగ్ పెరుగుతుంది

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన మాట నెరవేర్చితే నిస్సంకోచంగా మళ్లీ అదే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని పేర్కొంటున్నారు.

ఈ మంచి కొనసాగేలా..

సీఎం వైఎస్ జగన్ 99 శాతం హామీలను అమలు చేయడంతోపాటు పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రజల్లో విశ్వాసం కల్పించడంతో పెద్ద ఎత్తున పోలింగ్‌కు తరలి వచ్చారని, ఈ మంచి కొనసాగాలని కోరుకుంటున్నారనేందుకు పోలింగ్ శాతం పెరగడమే రుజువని సీనియర్ రాజకీయవేత్తలు స్పష్టం చేస్తున్నారు. 2019లో కంటే 2024లో పోలింగ్ శాతం పెరగడం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చూడాలన్న ఆకాంక్షలకు సంకేతమని పేర్కొంటున్నారు.

వైఎస్సార్ పాలనే రుజువు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2004 అసెంబ్లీ ఎన్నికల్లో 69.8 శాతం పోలింగ్‌తో దివంగత వైఎస్సార్ అధికారం చేపట్టారు. 2004 నుంచి 2009 వరకు ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఈ క్రమంలో 2009 ఎన్నికల్లో 72.7 శాతం పోలింగ్‌తో ప్రజలు మరోసారి వైఎస్సార్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు. విద్య, వైద్య రంగాలలో తొలిసారిగా పెను మార్పులు తెచ్చిన వైఎస్సార్‌కు జేజేలు పలికారు. పోలింగ్ శాతం పెరగడం వల్ల వైఎస్సార్‌కు ప్రజల మద్దతు పెరిగినట్లు స్పష్టంగా కళ్లెదుట కనిపించిన వాస్తవమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2004కు మించి 2009లో పోలింగ్ 2.9 శాతం పెరిగింది.

కేసీఆర్‌కు రెండుసార్లు అధికార పగ్గాలు..

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో 2014 ఎన్నికల్లో 69.5 శాతం పోలింగ్ నమోదు కాగా కేసీఆర్ అధికారం చేపట్టారు. కేసీఆర్ పాలన నచ్చడంతో 2018 ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్‌తో మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

సానుకూల ప్రచారంతో..

ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 79.77 శాతం పోలింగ్‌తో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా దీవించారు. ఐదేళ్ల సీఎం జగన్ పాలన నచ్చడంతో పాటు పథకాలన్నీ కొనసాగాలని ప్రజలు కోరుకోవడంతో ఈదఫా పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓట్లు వేశారని, అందుకే పోలింగ్ శాతం 81.86 శాతానికి పెరిగిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మళ్లీ సీఎంగా జగనే ఉండాలని ప్రజలు భావిస్తున్నారనేందుకు గత ఎన్నికల కంటే పోలింగ్ అదనంగా 2.09 శాతం పెరగడం సంకేతమని స్పష్టం చేస్తున్నారు. ఐదేళ్లుగా మీ బిడ్డ పాలనలో మీ ఇంటికి మంచి జరిగిందని భావిస్తే ఓటుతో ఆశీర్వదించాలని, సైనికులుగా తోడుగా నిలవాలని, పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని సీఎం జగన్ ఎన్నికల్లో సానుకూల ప్రచారం చేయడం ప్రజలకు నచ్చిందని, అందుకే ఓట్ల రూపంలో జేజేలు పలికారని సీనియర్ రాజకీయ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

త్వరలో ఏపీఎల్ మూడో సీజన్

ఉత్సాహంగా సాగిన క్రికెటర్ల మినీ వేలం

• ఐపీఎల్‌లో సత్తా చాటిన నితీష్‌కు అత్యధిక ధర
• రూ.15.50 లక్షలకు దక్కించుకున్న గోదావరి టైటాన్స్ జట్టు
• విశాఖపట్నం, కడపలో ఏపీఎల్ మూడో సీజన్ పోటీలు


మాట్లాడుతున్న ఏపీఎల్ నిర్వాహక కమిటీ సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యంలో త్వరలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) మూడో సీజన్ ప్రారంభం కాబోతోంది. జూన్ 30 నుంచి జులై 13వ తేదీ వరకు జరిగే మూడో సీజన్‌లో పాల్గొనే ఆరు జట్ల కోసం గురువారం విశాఖపట్నంలో మినీ వేలం జరిగింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున సత్తా చాటుతున్న నితీష్‌కుమార్‌రెడ్డికి ఏపీఎల్ చరిత్రలోనే అత్యధిక మొత్తం 15.60 లక్షలు లభించాయి. ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్వహించిన ఈ మినీ వేలంలో పలుస్థాయిల్లో ఆంధ్రాకు ఆడిన 408 మంది ఆటగాళ్లు నాలుగు కేటగిరీల్లో అందుబాటులో ఉండగా.. ఆరు ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. ప్రతి జట్టూ గతంలో తమకు ఆడిన ఏడుగురు చొప్పున ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా.. మిగిలిన 13 మంది కోసం ఈ మినీ వేలం నిర్వహించారు. గోదావరి టైటాన్స్ జట్టు నితీష్‌కుమార్‌రెడ్డిని సొంతం చేసుకుంది. గోదావరి టైటాన్స్‌తో పాటు రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ ఫ్రాంచైజీలు ఈ ఏపీఎల్‌లో పోటీపడుతున్నాయి. ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లు కడపలోని వైఎస్సార్ స్టేడియంలో, 12 మ్యాచ్‌లు విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

ఎదిగేందుకు చక్కటి అవకాశం..

ఇప్పటి వరకు వివిధ జోన్ స్థాయిల్లో ఆడిన వారు తమ ప్రతిభను చాటడానికి ఏపీఎల్ చక్కటి ప్లాట్‌ఫాం అని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి చెప్పారు. మినీ వేలం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'మేజర్ టోర్నీల్లో ఆడటానికి ఒత్తిడి లేని ఆటను ప్రదర్శించడం చాలా ముఖ్యమైన అంశం. ఏపీఎల్ ద్వారా దానిని అధిగమించవచ్చు. ఐపీఎల్, జాతీయ జట్లకు ఏపీ నుంచి ఆరుగురు క్రికెటర్లతో పాటు ఇద్దరు మహిళా క్రికెటర్లు స్థానం దక్కించుకోవడమే నిదర్శనం. అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి సూచనల మేరకు క్రికెటర్లకు తగిన తోడ్పాటునందిస్తున్నాం. వచ్చే సీజన్‌కల్లా మంగళగిరిలోని స్టేడియాన్ని అందుబాటులోకి తెస్తాం. వేలంలో ఫ్రాంచైజీలు 20 మంది చొప్పున ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాయి. వారికి ఏపీలోని ఒక్కో స్టేడియం వేదికగా నెలన్నర పాటు శిక్షణా శిబిరం నిర్వహిస్తాం. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడేందుకు సబ్ సెంటర్ల నుంచే కాకుండా అకాడమీల ద్వారా ఎదిగిన 18 నుంచి 25 ఏళ్ల క్రికెటర్లను రైజింగ్ స్టార్స్ పేరిట ఈ వేలంలో అనుమతించాం' అని చెప్పారు. సమావేశంలో గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధి జితేంద్రశర్మ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కోశాధికారి ఏపీ చలం తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పార్టీ విజయానికి శ్రమిద్దాం



కార్యకర్తలతో అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు శ్రమిద్దామని డీసీసీ అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ ఇటగి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ పరంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదల అభివృద్ధికి పాటుపడిందన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతం నుంచే మరింత అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఆశీర్వదించేలా కృషి చేయాలని కోరారు.

ఫసల్‌బీమాలో 36 మందిపై కేసులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో 36 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 2020–21 రబీ సీజన్‌లో బీమా పాలసీలతో రూ.లక్షలాది అక్రమాలు జరిగిన ఆరోపణలపై దేవదుర్గ తాలూకా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ నివేదిక మేరకు జాలహళ్లి, గాణదాళల్లో 273 మంది రైతులకు బీమా డబ్బులు మంజూరయ్యాయి. 116 మంది రైతుల డబ్బుల్లో 36 మంది బినామీ రైతుల పేరుతో రూ.76,91,167ల మేర అవినీతికి పాల్పడ్డారని తెలిపారు.

టెన్త్ సీబీఎస్ఈలో అదితి ప్రథమం



అదితి సంగావి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదో తరగతి సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య టెక్నో హైస్కూలు విద్యార్థిని అదితి ఏ.సంగావి కళ్యాణ కర్ణాటకకే ప్రథమ స్థానం సంపాదించింది. మొత్తం 500 మార్కులకుగాను 485 మార్కులతో 97 శాతం ఉత్తీర్ణత సాధించి ఐదో ర్యాంక్ పొందింది.

హరిదాసుల సేవలు అనన్యం



హరిదాసుల చిత్రపటానికి పుష్పాంజలి దృశ్యం

రాయచూరు రూరల్: సమాజానికి హరిదాసులు అందించిన సేవలు అనన్యమని శృతి సాహిత్య మేళ అధ్యక్షుడు మురళీధర్ కులకర్ణి పేర్కొన్నారు. ఆయన బుధవారం బయలు ఆంజనేయ స్వామి ఆలయంలో మొదలకల్ శేషదాసుల మధ్యారాధనను ప్రారంభించి మాట్లాడారు. 1887 నుంచి 1885 వరకు పాడిన గేయాలు, పద్యాలు ప్రతి ఒక్కరి మనస్సును దోచాయన్నారు. కార్యక్రమంలో జయకుమార్ దేశాయి, రంగనాథ్, లక్ష్మీకాంత్, శ్రీనిధి, సురేష్, శ్రీనివాస్, నాగరత్న, రాఘవేంద్ర, భీమాదేవిలున్నారు.

ఆలయంలోని హుండీ చోరీ

బళ్లారిటౌన్: నగర శివార్లలోని 34వ వార్డు పరిధిలోని బత్రి గ్రామంలోని శ్రీబత్రి ఈరణ్ణ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఇద్దరు దొంగలు జొరబడి ఆలయంలోని హుండీలోని సుమారు రూ.2 లక్షల నగదును దోచుకుని వెళ్లారు. గురువారం ఉదయం ఆలయ పూజారి హుండీ చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. ఆలయంలో సీసీ టీవీ కెమెరాలను అమర్చినందున ఇద్దరు దొంగలు చొరబడి దోచుకెళ్లడాన్ని సీసీ టీవీ ఫుటేజీలో గమనించారు. ఈ ఘటనపై కౌల్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ సమర్పిస్తున్న కాశీనాథ్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి కాశీనాథ్ ఎం.గిలేరి నామినేషన్ వేశారు. గురువారం కలబుర్గి డివిజన్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కృష్ణ బాజ్‌పేయ్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. బీజేపీ నుంచి అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ నుంచి చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థిగా నారా ప్రతాప్‌రెడ్డి కూడా నామినేషన్ల సమర్పణకు చివరి రోజు కావడంతో తమ నామినేషన్లను సమర్పించారు. కాగా ఈనెల 17న నామినేషన్లను పరిశీలిస్తారు.

చరిత్రాత్మకం.. దశరథ రామాలయం

- దశరథుడు ప్రతిష్టాపించిన అత్యంత ప్రాచీన పుణ్యక్షేత్రం
- అయోధ్యతో ఈ ఆలయానికి అవినాభావ సంబంధం

సాక్షి,బళ్లారి: రామాయణ పురాణాల్లో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల్లో ఒకటిగా దక్షిణ భారతదేశంలోని కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ పట్టణం నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని గుడ్డదనేరళకెరె గ్రామంలో వెలిసిన దశరథ రామలింగేశ్వరాలయం అత్యంత ప్రాచీనమైనది. తాలూకాలోని దశరథ రామేశ్వర పుణ్యక్షేత్రానికి ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉంది. ఇది అత్యంత ప్రాచీన, ఆధ్యాత్మిక క్షేత్రంగా, పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. దశరథ రామేశ్వర క్షేత్రానికి ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య పుణ్యక్షేత్రానికి ఎంతో అవినాభావ సంబంధం ఉందని నేటికీ పురాణ కథలు, స్థానిక మహిమ గాథలు చాటి చెబుతున్నాయి. ఈ ఆలయ మహిమను తెలుసుకున్న శ్రీరామ సంస్కృతి పరిశోధన సంస్థానం సంబంధిత బృందం 2017లో ఈ ఆలయాన్ని సందర్శించి చారిత్రాత్మక గుర్తులు, ఆనవాళ్లపై కూడా పరిశోధనలు జరిపింది. దశరథుడు ప్రతిష్టాపించిన శివలింగం ఇక్కడ కొలువుదీరి ఉందని, శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చి వెళ్లారన్న సమాచారాన్ని ధృవీకరించుకున్న సదరు బృందం అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీరామ మందిరం శంకుస్థాపనకు దశరథ రామేశ్వరం నుంచి పవిత్ర జలంతో మట్టిని సేకరించి తీసుకెళ్లి రామమందిర కట్టడానికి కూడా వినియోగించారు.

దశరథుని వేటతో వెలుగులోకి

త్రేతాయుగంలో అయోధ్యను పాలించిన దశరథ మహారాజు తన సేనతో గొండా ఆరణ్యంలో వేట కోసం సంచరిస్తూ, ఇక్కడ వజ్రగిరికి వచ్చి చేరుకున్నారు. వజ్రగిరి అప్పట్లో చాలా పెద్ద క్రూరమృగాల స్థావరంగా ఉండేది. దశరథ మహారాజు ఒకరోజు వేటాడుతూ వజ్రగిరి సరోవరం వద్దకు వచ్చినప్పుడు క్రూరమృగాలను వేటాడేందుకు కాపు కాచాడు. అయితే అదే సమయానికి సుదూర ప్రాంతం నుంచి పుట్టుకతోనే గుడ్డివారైన తన తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టుకుని వారిని భుజాల మీద మోసుకుని సంచరిస్తూ వచ్చిన శ్రవణకుమారుడనే రాజకుమారుడు తనకు, తల్లిదండ్రులకు నీటిదప్పిక కావడంతో ఆ సరోవర ప్రాంతంలోనే తమ తల్లిదండ్రులను దింపి, పొరుగున ఉన్న సరోవరంలోని నీటిని తాగి, తల్లిదండ్రులకు నీటిని తేవడానికి నీటిని నింపుకుంటుండగా గలగలా శబ్దం వచ్చింది. ఈ శబ్దం విన్న దశరథుడికి ఏదో పెద్ద క్రూరమృగం వచ్చి నీళ్లు తాగుతోందని భ్రమిస్తాడు. దీంతో తక్షణమే అప్రమత్తుడై విల్లును తీసుకుని శబ్దవేధి విద్యజ్ఞానంతో శబ్దం వచ్చిన దిక్కుకు గురిపెట్టి బాణాన్ని సంధించాడు. దశరథుడు వదిలిన ఆ బాణం శ్రవణకుమారుడికి తగలడంతో గట్టిగా ఆర్తనాదం చేస్తూ కుప్పకూలిపోతాడు.



అలంకరణలో దశరథ రామలింగేశ్వరుని విగ్రహం



గుహాలయంలోని ఈశ్వరుని మూలవిరాట్

శ్రవణుడి మరణంతో శాపం

కుమారుడి ఆర్తనాదం విన్న వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారుడికి ఏదో ప్రాణాపాయం సంభవించిందని ఆందోళనకు గురవుతున్న వేళ అక్కడికి వచ్చిన దశరథుడు తన వల్ల కలిగిన ఘోర తప్పిదం వల్ల శ్రవణకుమారుడు ప్రాణాలు కోల్పోయాడని చెప్పి ఆవేదన చెందాడు. చేసిన తప్పు, పొరపాటుకు ఎంతో బాధపడుతూ దశరథుడు సరోవరం వద్ద నుంచి తాగునీటిని తీసుకుని శ్రవణకుమారుడి తల్లిదండ్రుల వద్దకు వచ్చి నీటిని అందించి జరిగిన విషయాన్ని వివరించి తన వల్ల జరిగిన అపరాధాన్ని మన్నించాలని కోరాడు. అయితే కుమారుడు హతుడయ్యాడని తెలుసుకున్న ఆ అంధ తల్లిదండ్రులు ఆగ్రహంతో కన్నీరుమున్నీరుగా విలపించి దశరథుడిని శపిస్తారు. కుమారుడి వియోగం, బాధ తట్టుకోలేక వారిద్దరూ కూడా అక్కడే ప్రాణాలు వదులుతారు. దశరథుడు శాప విమోచనం కోసం సమీపంలోని గుహలో ఓ శివలింగాన్ని ప్రతిష్టాపించి ఆరాధిస్తాడు. దశరథుడు ప్రతిష్టాపించిన శివలింగాన్ని ఆ తర్వాత శ్రీరాముడు కూడా అటుగా వచ్చినప్పుడు పూజిస్తాడు.



గుడ్డదనేరళకెరెలోని దశరథ రామలింగేశ్వరాలయం ఇదే

అందుకే ఆ పేరు వచ్చింది

దశరథుడు, శ్రీరాముడు ఇద్దరూ కలిసి పూజించడం వల్లనే ఈ ఆలయానికి దశరథ రామలింగేశ్వర అని పేరు వచ్చింది. దీనికి ప్రతీకగా నిలిచేలా క్షేత్ర శాసనంలో నేటికీ గుహ ముందున్న పర్వతాన్ని శ్రవణకుమార పర్వతమని భక్తులు పిలుచుకుంటారు. గుహలో ప్రతిష్టాపించిన శివలింగం కొలువై ఉండగా, గుహను అనుకుని ఇక్కడ నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. శ్రవణకుమారుడి సమాధితో పాటు అతడి తల్లిదండ్రుల సమాధులు ఇక్కడ నెలకొన్నాయి. శ్రవణకుమారుడు తల్లిదండ్రులను మోసే కావడితో కూడిన విగ్రహాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దశరథ రామేశ్వర ఆలయాన్ని దర్శించుకుని పునీతులవుతున్నారు. దశరథుడు, శ్రీరాముడు ఇద్దరూ కలిసి పూజలు చేసినందున ఆ లింగానికి శ్రీదశరథ రామలింగేశ్వర అనే పేరు వచ్చిందని చరిత్ర ఆధారాలు, పురాణ కథలు వెల్లడిస్తున్నాయి.

గెలిపిస్తే మండలిలో గళమెత్తుతా



అభ్యర్థిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జూన్ 3న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం నగరంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. 60 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పట్టభద్రుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. తనను గెలిపిస్తే కళ్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి విధాన పరిషత్(మండలి)లో తన గళం వినిపించి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లికార్జున(ఫైల్)

బళ్లారి అర్బన్: స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కప్పగల్ రోడ్డు శివలింగమ్మ మఠం సమీపంలో నివాసం ఉండే కాంగ్రెస్ కార్యకర్త, ఆటో డ్రైవర్ మల్లికార్జున అనే 42 ఏళ్ల వయస్సుగల వ్యక్తి కనిపించడం లేదని అతని భార్య మీనా రూరల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ నెల 6వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు లేదా 9480803049, 9980187669 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రెండిళ్లలో వరుస చోరీలు

- బంగారు, వెండి, నగదును ఎత్తుకెళ్లిన దుండగులు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణ శివారులోని చోరనూరు రోడ్డులోని రెండు ఇళ్లలో వరుస చోరీలు జరిగిన ఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకొంది. ప్రజాపనుల శాఖ ఉద్యోగి, ఫస్ట్ క్లాస్ అసిస్టెంట్ హైదర్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ఈ విషయాన్ని గ్రహించిన దొంగల ముఠా ఇంటి తాళాన్ని పగలగొట్టి అల్మారాలోని కంప్యూటర్ హార్డ్ డిస్క్‌తో పాటు 4 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.50 వేల నగదు, 6 పట్టుచీరలను అపహరించారు. అదే విధంగా పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఉద్యోగి సోమశేఖర్ ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. అదే రోజు దొంగలు ఇంటి ప్రధాన తలుపు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి 4 తులాల బంగారం, కిలో వెండి, రూ.10 వేల నగదును దొంగలించి పరారయ్యారు. ఈ ఘటనలపై కూడ్లిగి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



అల్మారాలోని వస్తువులను చెల్లాచెదురుగా పారేసిన దృశ్యం

వర్షంతో బస్టాండ్ జలమయం



వర్షంతో జలావృతమైన కొట్టూరు బస్టాండ్



విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

హొసపేటె: విజయనగర జిల్లా కొట్టూరు తాలూకాలో బుధవారం సాయంత్రం గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో నీరు చొరబడి బస్టాండ్ జలమయంగా మారింది. భారీ వర్షానికి వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రధాన వీధులు, బస్టాండ్ పూర్తిగా జలమయమై గంట పాటు ట్రాఫిక్ నిలిచి పోయింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఈ భారీ వర్షం కారణంగా పలు ఇళ్లలోకి నీరు చేరగా, కొన్ని ఇళ్లలోని ధాన్యం గింజల బస్తాలు సైతం తడిసిపోయాయి. భారీ వర్షం కురవడంతో కొట్టూరు నగరం చల్లబడింది.

అభ్యర్థి గెలుపే అభివృద్ధికి మలుపు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న పట్టభద్రులు

సాక్షి,బళ్లారి: ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న అమరనాథ్ పాటిల్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లాలోని సండూరు నియోజకవర్గంలో అభ్యర్థి తరపున విస్తృత ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి గెలుపొందితేనే పట్టభద్రుల సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడూ నెరవేర్చడం లేదన్నారు. పట్టభద్రుల విషయంలో కూడా ఇదే ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన ఎమ్మెల్సీ ఈ ప్రాంతంలో పట్టభద్రుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ నాయకుడు కే.ఎస్ దివాకర్, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సంప్రదాయాలు పదిలం



జ్యోతి వెలిగిస్తున్న స్వామీజీ భక్తులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి ఇంటిలో భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆచార విచారాలు, కట్టుబొట్టు వంటి వాటిపై ప్రజల్లో ప్రచారం చేయడానికి పండిట్ గురు పుట్టరాజ సాహిత్యం ఎంతో దోహద పడుతోందని గురు పుట్టరాజ సేవా సమితి సంస్థాపకుడు చెన్నవీరస్వామి హిరేమఠ అన్నారు. ఆయన దావణగెరెలోని కన్నడ కువెంపు భవనంలో ఏర్పాటు చేసిన డాక్టర్ పండిత్ గురు పుట్టరాజ సాహిత్య గ్రంథాలను పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. కార్య క్రమంలో ప్రమీల, సౌమ్య, సతీష్, శివరాజ్, రేవణ సిద్దప్ప, గీతాలున్నారు.

పంట నష్టపరిహారం అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ అనురాధ

హొసపేటె: జిల్లాలో ఫేజ్–1 నుంచి ఫేజ్–9 వరకు వచ్చిన డేటాను, పంట నష్టపరిహారం సొమ్మును వెంటనే సక్రమంగా అందించాలని అదనపు జిల్లాధికారిణి అనురాధ అధికారులను ఆదేశించారు. 2023–24లో వర్షాకాలంలో కర్ణాటక స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇటీవల నిర్వహించిన వీడియో ఇంటరాక్షన్ తర్వాత జిల్లా పరిపాలన భవన్‌లోని కేస్వాన్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పంట నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియపై ఆమె చర్చించారు. జిల్లాలో కొంత మంది రైతుల ఖాతాలకు పంట నష్టపరిహారం సొమ్ము ఎందుకు చెల్లించలేదనే సాంకేతిక కారణాలపై ఇప్పటికే వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులకు సమాచారం పంపినందున సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఈ విషయమై నివేదిక ఇవ్వాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో కరువు కారణంగా పంటనష్టం సర్వే డేటా సమాచారం ఆధారంగా ఐడీ ఉన్న రైతులకు, రెండో దశలో జిల్లాలో మొత్తం 1,09,543 మంది రైతులకు పరిహారం కింద రూ.130.08 కోట్లను విడుదల చేసినట్లు జిల్లాధికారి ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. ఈ పంట నష్టపరిహారం సొమ్మును పొందడంలో కొందరు రైతులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

డెంగీపై జాగ్రుతి జాతాకు శ్రీకారం



జాతాను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తదితరులు

హొసపేటె: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజల సహకారంతో డెంగీని అదుపు చేద్దాం అనే నినాదంతో నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు పచ్చజెండా ఊపి అవగాహన జాతాను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేకుంటే డెంగీ జ్వరం ప్రాణాంతకం కావచ్చన్నారు. వర్షాకాలం ముందు, తర్వాత డెంగీ దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. దోమ ఎప్పుడు కుడుతుంది, డెంగీ వ్యాధి లక్షణాలు ఏంటి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై సంఘసంస్థలతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారి డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ వ్యాధులు వచ్చినప్పుడు చికిత్స పొందడమే కాకుండా రాకముందే జాగ్రత్త పడడం మంచిదన్నారు. ప్రజలు ఇంట్లో నిల్వ ఉన్న నీటిని తరచుగా మార్చుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: ఘన, సంప్రదాయ, ద్రవ వ్యర్థాల నిర్వహణపై న్యాయశాఖకు సమర్పించిన అఫిడవిట్‌లోని అంశాలను నిర్ణీత గడువులోగా అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ హెచ్చరించారు. ఆయన గురువారం తన కార్యాలయ సభామందిరంలో జిల్లాలోని పట్టణ పంచాయతీ, స్థానిక సంస్థల, జిల్లా వాయు కాలుష్య నియంత్రణ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ పంచాయతీ, స్థానిక సంస్థలు జాతీయ గ్రీన్ జ్యుడిషియరీ ఆదేశాలను పాటించే అంశంలో ఘన వ్యర్థాల నిర్వహణపై రాష్ట్రీయ గ్రీన్ జ్యుడిషియరీ బెంచ్‌లో కేసు నమోదైందన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకున్న చర్యల గురించి సమాచారాన్ని తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ ప్లానింగ్ డైరెక్టర్ మనోహర్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజ, ఏఈఈలు వీరేష్, శిల్పశ్రీ, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ జగదీశ్, జిల్లాలోని అన్ని పట్టణ పంచాయతీ, స్థానిక సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీరు తెలంగాణకా?

- కర్ణాటక రైతుల అభ్యంతరం

రాయచూరు రూరల్: రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం(ఆర్టీపీఎస్)లో విద్యుత్ ఉత్పత్తి కోసం నారాయణపుర డ్యాం నుంచి కృష్ణా నదికి 1.25 టీఎంసీ నీరు విడుదల చేస్తే ఆ నీటిని విద్యుత్ ఉత్పత్తి అనంతరం తెలంగాణకు తాగునీటి కోసం వదిలినట్లు అధికారులు చెబుతుండటంపై కర్ణాటక రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత మార్చి నెలలో నారాయణపూర్ డ్యాం నుంచి కాలువలకు నీరు వదిలితే రైతులు మిరప, పత్తి పంటలను సాగు చేసుకుంటారని కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టినా స్పందించని నీటి పారుదల శాఖాధికారులు ఇప్పుడు మౌనం దాల్చడాన్ని ఖండించారు. నారాయణపుర డ్యాం పూర్తి నిల్వ సామర్థ్యం 33.33 టీఎంసీలు కాగా 14 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఆర్టీపీఎస్ కోసం 0.46 టీఎంసీల సామర్థ్యంతో గూర్జాపూర్ బ్యారేజీని నిర్మించినా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.



గూర్జాపూర్ బ్యారేజీలో నిల్వ ఉన్న నీరు

తాగునీటి కోసం ధర్నా



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు గురువారం జిల్లాధికారి కార్యాలయం ముందు ఖాళీ బిందెలు చేత పట్టుకొని బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. నగరంలో ఐదు రోజులకోసారి తాగునీరు వదలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోయారు. తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలని ప్రజలు ఒత్తిడి చేశారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.



వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజలు

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం



తనిఖీ చేస్తున్న ఏడీసీ ఝుబేర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు

బళ్లారిఅర్బన్: నగరంలోని 4వ వార్డు గుగ్గరహట్టి ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఆహార పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి గురువారం సాయంత్రం సీజ్ చేశారు. శరభయ్య అనే వ్యక్తి లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని హొసపేటె రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించి లారీని స్వాధీనపరచుకున్నారు. దాడిలో అదనపు జిల్లాధికారి మహమ్మద్ ఝుబేర్, ఆహార శాఖ అధికారి సభీన, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంజలి కుటుంబానికి పరామర్శ



కుటుంబాన్నిపరామర్శిస్తున్న స్వామీజీలు

హుబ్లీ: నగరంలోని వీరాపుర వీధిలో బుధవారం ప్రేమోన్మాది చేతిలో బలైన అంజలి కుటుంబానికి అండగా నిలుస్తామని శిరహట్టి మఠం ఫక్కీర దింగాలేశ్వర స్వామి భరోసా ఇచ్చారు. గురువారం ఆయన అంజలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అంజలి తల్లి గంగమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఆమె నలుగురు ఆడపిల్లలతో జీవిస్తున్నారని, వీరి కుటుంబంలో ఎలాంటి పురుష దిక్కు లేదన్నారు. ప్రభుత్వం ఈ కుటుంబానికి గృహ వసతి, విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని సీఎం సిద్దరామయ్యకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తానని స్వామి అన్నారు. కాగా అంబిగర సమాజ స్వామి కూడా అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత నెలలో హత్యకు గురైన నేహా తండ్రి నిరంజనయ్య హిరేమఠ అంజలి కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.లక్ష పరిహారం అందించారు. ఈ హత్యను ఖండిస్తూ నగరంలో గురువారం కూడా ఆందోళనలు కొనసాగాయి.